తిరుమల తిరుపతి దేవస్థానములు

సప్తగిరి

సచిత్రమాసపత్రిక

సెప్టెంబరు 2017

వెల రూ.5/-



తిరుమల
శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు

2017 సెప్టెంబరు 23 నుండి అక్టోబరు 01 వరకు

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
2017 సెప్టెంబరు 23 నుండి అక్టోబరు 01 వరకు



గరుడపటాన్ని ఎగురవేయగా..
కేతనంపై ఉన్న గరుడుడు అన్ని లోకాలవారిని,
సమస్తదేవతలను శ్రీవారి బ్రహ్మోత్సవాలకు
విచ్చేయాల్సిందిగా ఆహ్వానిస్తాడు.
బ్రహ్మోత్సవాలు పూర్తయేవరకు
ఈ గరుడపటం ధ్వజస్తంభంపైనే ఉంటుంది.

23-09-2017
శనివారం
పగలు: ధ్వజారోహణం



23-09-2017
శనివారం
రాత్రి: పెద్దశేషవాహనం

శేషవాహనం ముఖ్యంగా దాస్యభక్తికి నిదర్శనం.
ఆ భక్తితో పశుత్వం తొలగి మానవత్వం,
అందుండి దైవత్వం, పరమపదం సిద్ధిస్తాయి.



24-09-2017
ఆదివారం
పగలు: చిన్నశేషవాహనం

చిన్నశేషవాహనాన్ని సందర్శించిన
భక్తులకు కుండలినీయోగసిద్ధిఫలం
లభిస్తుంది.

గీతాశ్లోకార్థసారం



శ్లో : ఉద్ధరేదాత్మనాత్మానాం నాత్మానమవసాదయేత్ ।
ఆత్మైవ హ్యాత్మనో బన్ధురాత్మైవ రిపురాత్మనః ॥ (భగవద్గీత.అధ్యా-6, శ్లో-5)

ప్రతిపదార్థం : ఆత్మనా=తనచేత; ఆత్మానం= తన్ను; ఉద్ధరేత్= ఉద్ధరించుకోవాలి; ఆత్మానామ్= తన్ను; న అవసాదయేత్= అధోగతిని పొందించుకోగూడదు; హి= ఏలయనగా; ఆత్మనః= తనకు; ఆత్మైవ= తానే; బన్ధుః=బంధువు; ఆత్మనః=తనకు; ఆత్మైవ=తానే; రిపుః= శత్రువౌతాడు.

భావం : అధోగతిపాలుకాకుండా తనను తానే ఉద్ధరించుకోవాలి - ఏలనగా ఇంద్రియమనంబులను జయించినట్లైతే తనకు తానే బంధువున్ను, జయించకపోయినట్లైతే తనకు తానే శత్రువున్ను ఔతాడు.

త్రిజగములు నెఱుఁగ తిరువేంకటాద్రిపై..

కొనరో కొనరో మీరు కూరిమిమందు
ఉనికి మనికి కెల్ల నొక్కటే మందు

ధ్రువుడు గొనినమందు తొల్లియుఁ బ్రహ్లాదుడు
చవిగాఁ గొనిన మందు చల్లని మందు
భవరోగములు వీడి పారఁగఁ బెద్దలు మున్ను
జవకట్టికొనిన నిచ్చలమైన మందు

నిలిచి నారదుఁడు గొనినమందు జనకుఁడు
గెలుపుతోఁ గొని బ్రతికిన యా మందు
మొలచి నాలుగుయుగముల రాజులు ఘనులు
కలకాలముగొని కడగన్న మందు

అజునకుఁ బరమాయువై యొసగిన మందు
నిజమై లోకములెల్ల నిండిన మందు
త్రిజగములు నెఱుఁగ తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తెఁ గోనేటి దరినున్న మందు
(సంపుటం-01, సంకీర్తనం-237)



బ్రహ్మదేవునకు భగవంతుడనే పరమౌషధం పరమాయువై విలసిల్లినది. ఇదే సత్యస్వరూపమై భువనములెల్ల నిండియున్నది. ఇది ఎట్టి ఉద్వేగాన్నీ కల్గించని చల్లనిమందు. స్వామిపుష్కరిణిగట్టుననున్న ఈ మందే ముల్లోకాలకు "నాలాగా పరిమార్పగలిగే మందు ఇంకొక్కటి లే"-దని శ్రీవేంకటాద్రిపై రథమెక్కి చాటినది.

సంసారరోగాల్ని పోగొట్టుకోవడానికై ఈ ఔషధాన్నే పూర్వం స్వామి పరమభక్తులు నారదుడు, జనకుడు, ధ్రువుడు, ప్రహ్లాదుడు మిక్కిలి ప్రీతితో స్వీకరించారు. నాలుగుయుగాలకు చెందిన నరపతులు, మహాత్ములు ఈ మందునే సేవించి ముక్తులయ్యారు.



కాబట్టి ఓ జనులారా! ప్రేమస్వరూపుడైన భగవంతుడనే పరమౌషధాన్ని మీరూ స్వీకరించండి. లోకంలో సుఖంగా జీవించటానికి ఇదొక్కటే శరణాగతిమందు అంటూ అన్నమయ్య ఈ సంకీర్తనలో ఉద్బోధిస్తున్నాడు.

పవిత్రోత్సవం దర్శయామి!!

– శ్రీ డి.అజయ్‌కుమార్ అర్చకస్వామి

పవిత్రోత్సవమంటే పరమపవిత్రమైన ప్రాయశ్చిత్తవిశిష్ట మహోత్సవం. సంవత్సరానికొకసారి ఆలయపవిత్రవాతావరణం పునః స్థాపితం కావడానికి జరిపే ఉత్సవమిది. ఆలయాల్లో సంవత్సర పర్యంతమూ చేసే ఆరాధనయందు జరిగే దోషాలను అంటే నిత్య, నైమిత్తిక, కామ్య ఉత్సవాలైన నిత్యారాధనాహోమ(బలి)నివేదన, బలి సమర్పణలు; మాసోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, జ్యేష్ఠాభిషేక, సహస్ర కలశ, స్నపన, ఆరాధనాదులు; దేశప్రజాజనహితార్థం ఆచరించే యజ్ఞయాగాదిక్రియలయందు జరిగే మంత్ర, తంత్ర, క్రియాకలాప, శౌచ, అశౌచములయందు దోషనివారణకై స్వామికి జరిపించే ఉత్సవమే పవిత్రోత్సవం.

యజ్ఞయాగాదుల్లో జరిగే లోపాలను పూర్ణాహుతితో తొలగించినట్లుగా సంవత్సరదోషనివృత్తికై పవిత్రోత్సవాల్ని తప్పక ఆచరించడం ఒక ధర్మం.

ఈ పవిత్రోత్సవాలను ఆషాఢ, శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజమాసాల్లో, శుక్లపక్షంలోని పాడ్యమి, విదియ, పంచమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, పౌర్ణిమలలో; భరణి, రోహిణి, పునర్వసు, పుష్యమి, హస్త, స్వాతి, రేవతి, శ్రవణం మొదలైన నక్షత్రాల్లో ఆచరించాలని పాంచరాత్రాగమం చెప్తోంది.

ఈ పవిత్రోత్సవాల్లో ఉపయోగించే పవిత్రాలు–బంగారం, వెండి, రాగి, మృణ్మయం, పత్తి, ముంజగడ్డి, దర్భ, పట్టు మొదలైన వాటితో చేస్తారు. అలా చేయబడిన పవిత్రలను ఆచార్యుడు స్వీకరించి, పంచగవ్యాదులచే ప్రోక్షించి ఆ ఆలయ ఆగమాన్ననుసరించి పవిత్రలకు యజ్ఞ ఆరాధనాదులను పూర్తిచేస్తాడు. వీటిని స్వామికి సమర్పించడంవల్ల జనులకు ఆయుః క్షేమాభివృద్ధి కలుగుతాయి. శ్రీమన్నారాయణారాధనను అత్యంత భక్తిశ్రద్ధలతో సంవత్సరకాలం చేస్తే కలిగే ఫలితమంతా పవిత్రారోపణమాచరిస్తే కలుగుతుంది. ఈ పవిత్రోత్సవం మహాప్రాయశ్చిత్తం. కావున, ప్రతి సంవత్సరం చేయాలి ఈ ఉత్సవం. అలా ఆచరించకున్నా పరమాత్మకు ఆ సంవత్సరకాలం చేసిన ఆరాధనమంతా నిష్ఫలమౌతుంది. అందువల్ల ఈ ఉత్సవాన్ని ప్రతిసంవత్సరం ఆచరించాలని ఆగమశాస్త్రాలు చెప్తున్నాయి.

అలాంటి ఈ పవిత్రోత్సవాన్ని మొదట క్రీ.శ.1463వ సం॥లో సాళువ మల్లయ్య దేవరాజ అనేవారు తిరుమలస్వామికి చేయించారు. వీరే దీనిని మొట్టమొదటగా పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో పురాణాలు, వేదాలు పఠించేలా ఏర్పాటు చేయించారు. అలా ఈ ఉత్సవం నిరాఘాటంగా 1562వసం॥వరకు జరిగింది. ఆ తర్వాత ఎందుకో నిలిచిపోయింది.

మరలా తి.తి.దేవస్థానంవారు ఈ ఉత్సవాన్ని 1982వ సం॥న తిరిగి పునరుద్ధరించారు. ఈ తరహా పవిత్రోత్సవకార్యక్రమాన్ని తి.తి.దేవస్థాన అనుబంధంగా ఉన్న అన్ని ఆలయాల్లో జరిగేలా నిర్ణయం చేశారు.

ఆ కోవలో ఈ పవిత్రోత్సవకార్యక్రమాలు ఈ నెల (భాద్రపదమాసం)లో నాలుగు ప్రధానాలయాల్లో జరుగుతాయి. అవి– తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారికి 01వతేదీనుండి 03వతేదీ వరకు; తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారికి 03వతేదీనుండి 06వతేదీవరకు; నారాయణవనం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి 04వతేదీనుండి 05వతేదీవరకు; అప్పలాయిగుంట శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారికి 16వతేదీనుండి 17వ తేదీవరకు జరుగుతాయి.



ఈ కార్యక్రమంలో ఉత్సవవిగ్రహాల్ని యాగశాలలో ఉంచడం, ఆ తర్వాతరోజు పట్టుపూసలు లేదా తామరతూళ్లసరంలాగా కనిపించే పవిత్రలు యాగశాలలో ఉంచడం, తర్వాత పవిత్ర సమర్పణం, పూర్ణాహుతి జరిపి ఉత్సవసమాప్తి చేస్తారు. అప్పలాయిగుంటలో ఒక్కరోజు మాత్రమే పవిత్రోత్సవం జరుగుతుంది. ఆ తర్వాత గ్రామోత్సవం జరుగుతుంది.

అలా జరిగే పవిత్రోత్సవాలను దర్శించినవారి అపచారాల్లోని మాలిన్యమంతా కూడా తొలగి పవిత్రతను చేకూరుస్తుందనీ, తద్ద్వారా చీడపీడలన్నీ తొలగి మనసు నిర్మలత్వాన్ని పొందుతుందనీ పెద్దలమాట. కాబట్టి మనమందరమూ కూడా ఈ పవిత్రోత్సవ కార్యక్రమాల్ని కన్నులారా దర్శించి పునీతులమౌదాం.



తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

సప్తగిరి

సంపుటి : 48 సెప్టెంబరు, 2017 సంచిక : 04

వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
0877-2264543

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఈ నెలలో....

ముఖచిత్రం : ఉభయదేవేరులతో శ్రీవారు
వెనుక చిత్రం : చక్రస్నానం - చక్రత్తాళ్వారు

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

వెబ్‌సైట్- www.tirumala.org, www.tirupati.org; ఆన్‌లైన్ సేవలు/వసతిసౌకర్యం కొరకు- www.ttdsevaonline.com

సంపాదకీయం

బ్రహ్మోత్సవ దర్శన ప్రాప్తిరస్తు!!

'నానాదిక్కుల నరులెల్లా,వానలలో ననె వత్తురు గదలి' – స్వామి బ్రహ్మోత్సవాలు చూడ్డానికి ఎక్కడున్నవారంతా వానలను కూడా సైతం లెక్కచేయక ఉరుకుతారు అంటూ అన్నమయ్య స్వామి బ్రహ్మోత్సవాలు ఎంత వైభవంగా జరుగుతాయో తన సంకీర్తనలో కీర్తించాడు. అన్నమయ్యే కాదు ఆళ్వారులు కూడా వెంకన్ననూ, వేంకటాద్రినీ వేనోళ్ల ప్రస్తుతించారు. వారు కీర్తించిన నాలాయిర దివ్యప్రబంధగానమే బ్రహ్మోత్సవ వాహనసేవల్లో అఖండంగా గానం చేయబడుతుంది. వేంకటాద్రి కలియుగవైకుంఠం. వేంకటం అంటే సమస్త పాపాల్ని పోగొట్టేది అని అర్థం. ఆ వేంకటనివాసుడు సాక్షాత్తూ వేదస్వరూపుడు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు. ఆదిమధ్యాంతరహితుడు. సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు. ఆ దేవుని భక్తులు కొలిస్తే చాలు కోరిన వరాలిస్తాడు. వేడుకుంటే చాలు వేదనలన్నీ తీరుస్తాడు.

అలాంటి ఆ వేంకటాద్రి నిత్యకల్యాణమూ... పచ్చతోరణమే!! ఆ స్వామిని ఎప్పుడు దర్శించుకున్నా ఆయన అభయహస్తం మన ఆపదలన్నీ తీరుస్తుంది. ఆ కోవలోనే స్వామికి ఏడాదికోమారు శరన్నవరాత్రుల్లో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాల్ని బ్రహ్మయే స్వయంగా ప్రారంభించాడు. ఆ బ్రహ్మోత్సవాలే నేటికీ అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవ వాహనసేవల్లో శ్రీస్వామి సర్వాలంకారాలు ధరించి దేవేరులతో వివిధవాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకునికి జరిగే ఈ ఉత్సవాలకు అఖిలాండకోటి భక్తజనమంతా కూడా పరుగులు తీస్తుంది. కన్నులారా తిలకిస్తుంది. వీరేకాదు దేవతలు, ఋషులు, యక్ష, కిన్నెర, కింపురుష, గంధర్వాదులేకాక చెట్లుచామలు, పూలూ, పండ్లూ, నేలానింగీ అన్నీ శ్రీవారి ఉత్సవాలను తిలకించి పరవశించి పోతాయి.

ఈ ఉత్సవాల్లో వివిధ వాహనసేవలు, నిరంతర వేదఘోష, ఎటుచూసినా అద్భుతమైన అలంకరణలు, ఫలపుష్పప్రదర్శనలు, తిరుమల నాదనీరాజన, ఆస్థానమండపాలు, తిరుపతి అన్నమాచార్య కళామందిరం, మహతిసభామందిరంలలో నిరంతర సంగీత, నాట్య, హరికథ, భజన, కోలాటాలు మున్నగు సాంస్కృతిక వైభవాలతో అలరారుతూంటాయి. ముఖ్యంగా శ్రీవిల్లిపుత్తూరునుండి గోదాదేవి ధరించిన తులసిమాలలు, కొత్తగొడుగులు, ప్రభుత్వంవారిచే నూతన పట్టువస్త్రాల సమర్పణముంటుంది.

అలా విశ్వమూర్తికి జరిగే ఈ ఉత్సవాల్ని మనం దర్శిద్దాం. స్వామి లీలావినోదాన్ని తిలకిద్దాం. శ్రీవారి లీలల్ని కీర్తిద్దాం. అందునా ముఖ్యంగా రథోత్సవంలో రథారూఢుడైన శ్రీనివాసుని దర్శిద్దాం. ఇక ఆలస్యమెందుకు? ప్రపంచంలో మూలమూలలనుండీ తరలివచ్చి ఆ మూలపురుషుని దర్శించుకుందాం. మన జన్మను సార్థకం చేసుకుందాం.

అలా వచ్చే భక్తజనకోటికి కావలసిన అన్ని వసతులు సమకూర్చడానికి తి.తి.దేవస్థానం సమాయాత్తమౌతోంది. రవాణా, వసతి, దర్శనాలు, భద్రత, వైద్యం, సమాచారవివరణ, అన్నదానం మొదలైన అన్నింటినీ సిద్ధం చేస్తోంది. కాబట్టి 'న భూతో న భవిష్యతి' అయిన ఆ నారాయణుణ్ణి దర్శించుకుందాం. సప్తగిరీశునికి సాష్టాంగపడదాం. ఆ వేంకటేశుని కరుణాకటాక్షాలు అందరిపై ప్రసరించాలని కోరుకుంటూ ఆ దేవదేవుణ్ణి సప్తగిరి ప్రార్థిస్తోంది.

శ్రీ సప్తగిరీశ దర్శన ప్రాప్తిరస్తు

స్వామికృపకు పాత్రులౌదాం రండి!!

- శ్రీమాన్ అర్చకం రామకృష్ణదీక్షితులు

శ్రీవైఖానస భృగుసంహిత ప్రకీర్ణాధికారః (20, 36 అధ్యాయాలు) గ్రంథాల్లో వైష్ణవాలయాల్లో భక్తులు నడుచుకోవాల్సిన నియమాలు వివరంగా తెలియజేయ బడినాయి. ప్రధానంగా ఆలయానికొచ్చే....... భక్తుని ప్రవర్తన, ఆలయంలో పాటించాల్సిన అనేకములైన విధులు, నిషేధాలు భృగుమహర్షులవారు వివరంగా తెలియజేసియున్నారు. ఇది పురుషపరంగా ఉన్నప్పటికీ ఇవన్నీ స్త్రీపురుషులకి సమంగా వర్తిస్తాయి. ఆ నియమాలను విధిగా ఆచరిస్తే శ్రీవారి పరిపూర్ణకృపకు పాత్రులమౌతాం. అవేంటో తెలుసుకుందాం.

01) ఆలయంలోపల యానం (వాహనం-చక్రాలతో, యంత్రాలతో నడిచేది) మీదకానీ, పాదరక్షలతోకానీ ప్రవేశింప కూడదు. తిరుగకూడదు.

02) మెల్లగా ప్రదక్షిణ చేసిన తర్వాత ఆలయంలోకి ప్రవేశించాలి.

03) విమానం (గర్భగుడిగోపురం) సాక్షాత్తూ శ్రీమహావిష్ణు స్వరూపం కావున దాని శిఖరాదులనీడను పాదాలతో త్రొక్కకూడదు.

04) ఆలయాన్ని ప్రదక్షిణగా చుట్టిరావడానికి ముందే దైవానికి ప్రసన్నమైనమనస్సుతో నమస్కారం చేయాలి.

05) ప్రదక్షిణచేసేసమయంలో తప్ప ఇంకెప్పుడూ దేవాలయం ధ్వజస్తంభంనీడనుకానీ, విమానంనీడనుకానీ, మహాద్వార రాజగోపురఛాయనుకానీ, ప్రాకారంనీడనుకానీ దాట కూడదు.

06) యజ్ఞోపవీతము (జందెము) ఉన్నవారు నడుముకు చుట్టుకొనికానీ, చెవికి తగిలించుకునికానీ, అపసవ్యంగా వేసుకొనికానీ లేదా దండవలె ధరించిగానీ ఆలయప్రవేశం చేయకూడదు.

07) మనోహరాకారుడైన విష్ణువును దర్శించుకోవడానికి ఆలయంలో ప్రవేశించేముందు ఉపవీతమును సవ్యంగా ధరించి,సదా శుచియై మంచి ఉత్తరీయం ధరించి ఆ దేవ దేవుని దర్శించాలి.

08) తలపాగా, టోపీని ధరించికానీ, చేతిలో ఆయుధం పట్టుకునికానీ స్వామిని దర్శించుకో కూడదు.

09) వస్త్రంతో కానీ, శాలువాతో కానీ శరీరం కప్పుకోవాలి.

10) రిక్తహస్తుడుగా కానీ (భగవంతుడికి సమర్పించడానికి చేతిలో ఏదీ లేకుండా), తిలకం ధరించకుండా కానీ, ఉత్తరీయం లేకుండా కానీ, తాంబూలం నములుతూ కానీ, తినుబండారాలు తింటూకానీ, పానీయసేవనం చేస్తూకానీ దేవాలయంలోకి ప్రవేశించకూడదు. అట్లా ప్రవేశిస్తే పాపం చుట్టుకుంటుంది.

11) దేవాలయంలో శ్రీవారిప్రసాదం తిని, మిగిలినదానిని అక్కడే విడిచిపెట్టి వెళ్లిపోయినా, ప్రసాదం తినకుండా పారవేసినా, వద్దన్నా అలాంటి మూర్ఖులు విపత్తులపాలు అవుతారు.

12) వీలైనంతవరకు వ్యాధులతో ఉన్నవారు ఆలయప్రవేశం చేయకూడదు.

13) చంచలమైన మనస్సుతో స్వామిని దర్శించకూడదు.

14) దేవాలయంలో కాళ్లు బార్లా చాపి కూర్చున్నా...., నిద్రపోయినా అతడు నరకం పాలౌతాడు.

15) దేవాలయంలో ప్రవేశించి భక్తితో రోదించకూడదు. రోదిస్తూ దేవుని స్తుతించకూడదు.



16) రాగద్వేషాలకు అతీతమైన మనస్సు, హింసాది రహితమైన శరీరం, సత్యాన్ని పలికి ధర్మాచరణ చేసే మనస్తత్త్వం అనే ఈ మూడునూ కేశవారాధనలో ప్రధానాంశాలు.

17) ఏ ప్రాణికైనా దుఃఖం కల్గించే ఎలాంటి హింసనూ ఆలయంలో చేయకూడదు.

18) శ్రీవారిఆలయంలో ప్రవేశించే మహద్భాగ్యం పొందిన వ్యక్తి ఇతర ఆలోచనలు విడిచిపెట్టి, అమూల్యమైన ఆ సమయంలో హరిని మాత్రమే చింతిస్తూ హరినామస్మరణ చేయాలి.

19) ఆలయంలో దేవునిముందు నిలబడి అబద్ధాలు చెప్ప కూడదు. భగవంతుడు సత్యస్వరూపుడు. కాబట్టి ఆయన ఎదుట సత్యాన్ని దాచకూడదు.

20) దేవాలయంలో వ్యర్థమైన, సంబంధంలేని, విపరీతమైన శాస్త్రచర్చలు చేయకూడదు. అట్లా క్షణంపాటు గడిపినా, అది దేవుని అవమానించినట్లే.

21) శ్రీవారిసన్నిధిలో లౌకికపుస్తకాలు చదవటం, వ్రాయటం చేయకూడదు. అట్లా చేసే వ్యక్తి అక్షరద్రోహి. దేవుని ధిక్కరించిన వాడౌతాడు.

22) దేవాలయంలో అనర్థప్రసంగాలు చేసే వ్యక్తి ఐదుజన్మల వరకు తిత్తిరిపక్షి గా జన్మిస్తాడు.

23) దేవాలయంలో హరిసన్నిధి ముందు ఎన్నడూ వివాదాలు పెట్టుకోకూడదు. వివాదాలకు అది స్థానం కాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ హరిసమక్షంలో వివాదాల జోలికి వెళ్ల కూడదు.

24) దేవాలయంలో అహంకారంతో తనను తాను పొగడుకొనే వ్యక్తి, దేవుడిని, పెద్దలను లెక్కచేయక నోటికొచ్చినట్లు మాట్లాడే వ్యక్తి గర్వించినవాడై తనకు సంక్రమించే మహ త్తరమైన దోషాన్ని గుర్తించలేడు.

25) తాను ఎంతటిస్థితిలో ఉన్నప్పటికీ, దేవాలయంలో తన కంటే పెద్దవారిని 'నీవు' అని ఏకవచనంతో సంబోధించ కూడదు.

26) ఆలయంలో దేవుని ఎదుట ఇతరులను దూషించటం, లేదా పొగడటం ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకూడదు. శ్రీవారిఆశీస్సులు, అనుగ్రహం కోరేవ్యక్తి ఆలయంలో ఇత రులను పొగడటం, పూజించటం చేయకూడదు.

27) ఆలయంలో ఉన్నప్పుడు ఇతరులకు నమస్కారం చేయ కూడదు. అక్కడ నారాయణుడే సర్వేశ్వరుడు.

28) దేవాలయంలో దేవునికి వీపుభాగం చూపిస్తూ కూచో కూడదు. భక్తుడు అన్నివేళల్లోనూ దేవునికి అభిముఖుడై ఉండాలి. భగవదాశీస్సులు కోరే వ్యక్తి, దేవునికి వీపు చూపించకూడదు. ఒక ప్రక్కగా తిరిగి మాత్రమే ఆలయం నుంచి నిష్క్రమించాలి.

29) అధికారగర్వంతో ఎవడు అకాలంలో ఆలయంలో ప్రవే శించి భగవంతుని సేవించాలని కోరతాడో అతడు దుర్గతిని పొందుతాడు. నిర్దేశించిన కాలంనందే వివేకవంతుడు భగవంతుని సేవించాలి.

చివరి అర్చన తర్వాత ఆలయద్వారాలు మూసివేయ బడుతాయి. మరల ప్రత్యూషకాలంలో ద్వారాలు తెరువ బడుతాయి. ఆ మధ్యకాలంలో అంటే ఆలయం మూసి వేసిన అర్ధరాత్రివేళల్లో హరిని సేవించకూడదు.

భక్తులు స్వామివారిసేవల్లో పాల్గొనేటప్పుడు కూడా తెరవెనుక స్వామికి కొన్నిసేవలు జరుగుతుంటాయి. అలాంటిసమయంలో తెరతీసి చూడాలనే ఆసక్తి కనబర చడం, చూడటం కూడా చాలా తప్పు. కావున, భక్తులు అలాంటి అకాలదర్శనాలు చేసుకోకూడదు.

30) లౌకికవిషయాల్లో అమిత ఆసక్తిపరుడై విష్ణ్వారాధన చేయని వాని జన్మ, వాని కర్మలు ఈ కర్మభూమిలో విఫలములు కాక తప్పదు.

31) గురువునందు మానుషభావం, దైవమునందు శిలాభావం, మంత్రములందు జీవికాభావం, యజ్ఞములందు హింసా భావం, అర్చకులపట్ల, అర్చనలపట్ల నీరసభావం ఉన్న వ్యక్తి సర్వదా నిందించదగినవాడౌతాడు. వానికి ఏవీ సిద్ధిం చవు. వాని జీవితం వ్యర్థం.

కాబట్టి, మనమందరమూ కూడా పై నియమాలన్నిం టినీ దేవాలయాల్లో పాటించి, ఆ దేవుని కృపకు పాత్రుల మవుదాం.


పచ్చతోరణం

అద్భుతాలవలయం... ఆనందనిలయం!

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

'ఆనందనిలయుడు' అని నోరారా అంటేనే, ఒక ఆనందం! చెవులారా వింటేనే చెప్పలేని ఒక తన్మయత్వం! ఇక ఆ స్వామివారి చరిత్రో! మరీ పరమాద్భుతం! అసలు ఆ స్వామి నిలిచివున్న కొండే అద్భుతం! ఆ కొండల మధ్య వింత వింతలుగా వెలుగులీనుతున్న బంగారు మేడ "ఆనందనిలయం" చూస్తే చాలు. ఎక్కడలేని పరమానందం! ఆ మేడలోని అతిలోకసుందరమోహనాంగుడు ఆనందనిలయుని నిలువెత్తు దివ్య మంగళరూపాన్ని దర్శిస్తేనో! అహో! ఎంతో పరమాద్భుతం! ఆయన నిలిచివున్న తీరూ, రీతీ, భంగిమా, ఆయనకు ఉన్న పేర్లూ, అలంకారాలూ, ఆరగింపులూ... ఇలా ఇవి ఒకటా! రెండా! ఈ అద్భుతాలను అన్నింటిని ఏకరువు పెడుతూ వర్ణించడానికి ఆ బ్రహ్మదేవుడికి సాధ్యం కాకపోయినా పరవాలేదు. మనం మాత్రం ఆ అద్భుతాల్లో ఏ కొన్నింటిని అయినా స్మరించుకుందాం. సర్వపాపాలు పోగొట్టుకుందాం. ఆ స్వామిని దర్శించుదాం. ఎన్నో పుణ్యాలు మూట కట్టుకుందాం.

ఇంక ఆలస్యం దేనికి? ఈ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకునికి సాక్షాత్తు బ్రహ్మదేవుడు నిర్వహిస్తున్న పదినాళ్ళ బ్రహ్మోత్సవ వేడుకల వేళల్లో, ఆ ఏడు కొండల్లో విహరిద్దాం. ఏడేడు లోకాల్లో ఈడే లేని, సరిజోడే లేని ఘనవేంకటేశుని వైభవాన్ని చర్చించుకుందాం! కన్నులారా, కన్నులనిండా దర్శించుకుందాం. సర్వత్రా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తున్న శ్రీ వేంకటేశుని సన్నిధిలో వింత వింత అనుభూతులతో విహరించుదాం. మన జన్మలను పవిత్రం చేసుకొందాం!



అతిలోకసుందరుడు

శ్రీవేంకటేశమతి సుందర మోహనాంగం
శ్రీభూమికాంత మరవింద దళాయతాక్షమ్

ఆనందనిలయుడు అందరినీ సమ్మోహనపరచే అతిలోకసౌందర్య మూర్తి! ఇంతటి సుకుమారమైన దేవుడు 'నేను వైకుంఠాన్నైనా విడిచి ఉంటానుగాని, నా భక్తులను విడిచి ఒక్క క్షణమైనా ఉండలేను' అంటూ శ్రీవైకుంఠం నుంచి దిగివచ్చి భూలోకంలో వేంకటాచలంలో అద్భుత సాలగ్రామ శిలామూర్తిగా వక్షఃస్థలశ్రీమహాలక్ష్మితో స్వయంవ్యక్తరూపంలో ఆవిర్భవించాడు.

ఆ వక్షఃస్థల లక్ష్మివల్లే ఆ స్వామి 'శ్రీ'నివాసుడయ్యాడు.

విచిత్ర భంగిమ

శిరస్సున కిరీటంతో, యజ్ఞోపవీతంతో, నడుమున నందక ఖడ్గంతో పై కుడి ఎడమ రెండుచేతుల్లో శంఖచక్రాలను ధరించి, కిందికుడిచేతిని వరదముద్రలో, ఉంచి తన పాదద్వయాన్ని శరణు వేడుమన్నట్లుగా చూపిస్తున్నాడు. అలాగే క్రింది ఎడమచేతిని నడుముపై ఉంచి కటి హస్తంతో మోకాళ్లను చూపుతున్నాడు. విచిత్రమైన ఈ భంగిమలో, తాను నిలిచివున్న ఈచోటే సాక్షాత్తు శ్రీవైకుంఠం, అంతేగాక నా ఈ పాదాలను శరణువేడితే చాలు. అలాంటివారికి "సంసారసాగర సముత్తరణైక సేతో" అన్నట్లు సేతువునై అగాధమైన సంసారసముద్రాన్ని మోకాళ్లబంటిగా చేసి సులువుగా దాటిస్తాను. అంటూ 'కటిహస్తం'తోను, మీ వరాలనన్నింటిని ఇస్తానంటూ 'వరద హస్తం'తోను చూపుతూ ఒక సొంపైన భంగిమలో నిలిచివున్న స్వామి శ్రీనివాసుడు.

క్షేత్రపాలకుడు

ఏడుకొండలవాని క్షేత్రానికి పరిపాలకుడు సాక్షాత్తు పరమశివుడు. ఆయనే ఈ క్షేత్రంలో "రుద్రుడు" అని పిలువబడుతున్నాడు. ఈ క్షేత్ర పాలకుడు, గోగర్భంలోవుంటూ మహాశివరాత్రికి అభిషేకాలు జరుపుకుంటున్నాడు.

బ్రహ్మపూజ-బ్రహ్మతీర్థం

భక్తవరదుడైన తిరుమలేశునికి బంగారువాకిళ్లు తెరువక ముందే ప్రతిరోజు బ్రాహ్మ ముహూర్తంలో (2½-3గం) బ్రహ్మదేవుడు తొలిపూజ చేస్తాడు. అందుకోసమే ఆలయంలో బ్రహ్మపూజకోసం "పెద్దబంగారు గిన్నె"లో జలాన్ని, పళ్లెంలో చందనాన్ని ఉంచుతారు. ఆ తర్వాత దాన్నే "బ్రహ్మతీర్థం"గా భక్తులకు ఇవ్వబడుతుంది. ప్రత్యేకంగా కన్యామాసంలో బ్రహ్మదేవుడు బ్రహ్మోత్సవాలు చేస్తున్నాడు.

ధ్రువబేరం



భోగ శ్రీనివాసమూర్తి



కొలువు శ్రీనివాసమూర్తి



పంచబేరాలు


ఆనందనిలయ గర్భాలయంలో సాలగ్రామశిలామూర్తి అయిన మూలవిరాట్టుతోపాటు శ్రీనివాస స్వామివారికి మరి నాలుగు రకాల ఉత్సవమూర్తులు ఉన్నాయి. వీటిని మూలమూర్తితో కలిపి పంచ బేరాలు అంటారు. మూలవిరాట్టు స్థిరంగా, 8 అడుగుల ఎత్తు సాలగ్రామ శిలామూర్తిని **'ధ్రువబేరం'** అంటారు. ఈ స్వామివారి దర్శనంకోసమే భక్తులు యాత్రకు వస్తారు. ఈ మూలవిరాట్టుకే ప్రతిరోజు ప్రధానంగా సుప్రభాతం, రెండుమార్లు తోమాలసేవ అనే పుష్పాలంకరణసేవ, ఉదయం సహస్రనామార్చన, మధ్యాహ్నం సాయంత్రం అష్టోత్తరశతనామార్చనలు, మూడుపూటలా నివేదనలు జరుగుతాయి.

ప్రతి మంగళవారం అష్టదళ పాదపద్మారాధన, గురువారం తిరుప్పావడసేవ, నేత్రదర్శనం, రాత్రి పూలంగిసేవ, శుక్రవారం ఉదయం సుగంధ పరిమళద్రవ్యాలతో అభిషేకం జరుగుతుంది. శ్రీస్వామివారికి అర్చనలు, నివేదనలు జరిగిన వెంటనే వక్షఃస్థలం లోని "వ్యూహలక్ష్మి"కి జరుపుతారు. ఇక రెండవబేరం, **'భోగ శ్రీనివాసమూర్తి'** మూలమూర్తికి నకలు వెండిప్రతిమ అయిన ఈయన్నే **'మనవాళపెరుమాళ్'** అని అంటారు. సుమారు ఒకటిన్నర అడుగుల ఎత్తు ఉన్న ఈ వెండిమూర్తికి ప్రతిరోజు ఉదయం ఆకాశగంగా తీర్థాభిషేకం రాత్రి పవ్వళింపుసేవ 'ఏకాంతసేవ' జరుగుతుంది. ఈ స్వామివారికి ప్రతి బుధవారం బంగారువాకిలి వద్ద సహస్ర కలశాభిషేకం జరగుతుంది.

ఇక మూడవబేరం **'కొలువు శ్రీనివాసమూర్తి'**. మూలమూర్తికి నకలు పంచలోహప్రతిమ. ఒకటిన్నర అడుగుల ఎత్తువున్న ఈ మూర్తికి ప్రతిరోజు బంగారువాకిలి లోపల 'బంగారు సింహాసనం'లో కొలువు, దర్బార్ జరుగుతుంది. పంచాంగశ్రవణం అయిన తర్వాత ఆదాయవ్యయాలు. మున్నగు లెక్కలన్నీ వినే స్వామి ఈ కొలువుమూర్తి. నాల్గవమూర్తి **'ఉగ్రశ్రీనివాసమూర్తి'**. శ్రీదేవిభూదేవులతో కూడి ఉన్న ఈ ఉగ్రమూర్తికి పూర్వం ఉత్సవాలు జరిగేవి. ఇప్పుడు జరగడం లేదు. ఒక **కార్తిక కైశికద్వాదశి రోజున** మాత్రమే తెల్లవారుజామున సూర్యోదయానికి పూర్వమే ఉత్సవం పూర్తి చేసుకొని ఆలయం లోనికి వెళ్తారు.

ఐదవమూర్తి **'ఉత్సవ శ్రీనివాసమూర్తి'**. వీరే **'మలయప్పస్వామి'**. శ్రీదేవీ భూదేవీ సమేతంగా ఉన్న ఉత్సవమూర్తి. మలయప్పకోనలో లభ్యమయ్యాడట. అందువల్ల మలయప్పస్వామి అని పిలువబడుతూ ఆలయం బయట అన్ని ఉత్సవాల్లో పాల్గొంటూ, భక్తులకు సన్నిహితంగా దర్శనమిస్తుంటాడు.

ఇవి గాక ఆనందనిలయగర్భాలయంలో **సుదర్శన చక్రత్తాళ్వార్, అనంతుడు, శ్రీసీతారామలక్ష్మణులు, శ్రీరుక్మిణీ శ్రీకృష్ణులు, సుగ్రీవహనుమంతులు, గరుత్మంతుడు, విష్వక్సేనుడు** మున్నగు ఉత్సవమూర్తులు ఆ యా వేళ్లలో ఊరేగింపుల్లో పాల్గొంటున్నాయి. వీటిల్లో కొన్నింటిని ప్రస్తుతం తీర్థం ఇచ్చేచోట అరలో చూడవచ్చు.





వింత వింత పేర్లు

తిరుమలేశుడికి పేర్లు ఎన్నో ఎన్నెన్నో ఉన్నాయి. అవన్నీ విచిత్రమైన పేర్లు. అవన్నీ ఆ స్వామివారి అసలైన సొంత పేర్లా అంటే అదీ చెప్పలేం. కాని ఒక్కటిమాత్రం నిజం. భక్తులు ప్రియంగా పిలుచుకుంటున్నవే. ఇష్టంగా పిలుచుకుంటున్నవే.

వాటిల్లో ప్రసిద్ధమైంది **'ఏడుకొండలవాడా!'** అని. **శేషాద్రి, వేంకటాద్రి, నారాయణాద్రి, గరుడాద్రి, వృషాద్రి, వృషభాద్రి, అంజనాద్రి** అనే ఏడుకొండల్లో ఉన్న స్వామి కనుక **ఏడుకొండలవాడయ్యాడు.** అలాగే వేం= పాపాలను; కటః= పోగొడతాడు కనుక 'వేంకటపతి' అనీ, తిరుమలేశుడనీ, స్థలాన్ని బట్టి, చేసేపనిని బట్టి పిలువబడుతున్న స్వామి శ్రీనివాసుడు.

కాని అన్నీ పేర్లకంటె మరో విచిత్రమైన పేరు ఉంది. అదే మంటే భార్యపేరుతో పిలిపించుకోవడం. అదే 'శ్రీ'నివాసుడు. ఆయన వక్షఃస్థలంలో ఉన్న "వ్యూహలక్ష్మి" భక్తులకు కోరికలను తీర్చడంలో, స్వామికి చెప్పి సిఫారసు చేస్తుందట. ఆమె **"వాత్సల్యగుణోజ్జ్వలాం"** కనుక భక్తులమీద ప్రేమ ఎక్కువ. ఆ తల్లి వల్లే **''శ్రీ'నివాసుడు"** అంటున్నారు. అసలు నీ పేరేమయ్యా అంటే చెప్పడు కాని, **"అదుగదుగుదండాలవాడా!"** అన్నా పలుకుతాడు. **"ఆపద్బాంధవా!"** అన్నా పలుకుతాడు. ఇలా ఏ పేరుతో పిలిచినా పలుకుతూ మన కోరికలు తీరుస్తూనే వున్న వింత వింత పెట్టుడు పేర్ల దేవుడు వేంకటేశుడు.

ఉత్సవాల దేవుడు

తిరుమలేశుడికి ఉత్సవాలదేవుడు అనే పేరుంది. ఈ స్వామికి సుప్రభాతం, తోమాలసేవ, అర్చనలు, కల్యాణోత్సవం, డోలోత్సవం, ఏకాంతసేవవంటి నిత్యోత్సవాలు, విశేషపూజ, అష్టదళపాదపద్మారాధన, సహస్రకలశాభిషేకం తిరుప్పావడసేవ, నేత్ర దర్శనం, పూలంగి సేవ, శుక్రవారాభిషేకం మున్నగు వారోత్సవాలు, రోహిణి, ఆర్ద్ర, పునర్వసు, శ్రవణం, పున్నమి గరుడసేవవంటి మాసోత్సవాలు, ఉగాది ఆస్థానం, ఆణివర ఆస్థానం పవిత్రోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, పుష్పయాగంవంటి వార్షికోత్సవాల్లో శ్రీవేంకటేశుడి వైభవం వర్ణనాతీతం.

అబ్బుర పరిచే ఆభరణాలు

ఘనవేంకటేశునకు పాదాది శిరస్సువరకు ఎన్నో దివ్యాభరణాలు మణిహారాలు, అలంకరింపబడి భక్తులకు ఆశ్చర్యంతోపాటు ఆనందాన్ని కలిగిస్తాయి. అలా జిగేలుమనీ మెరిసే అలంకారాలు ఎనెన్నో!


బంగారు పద్మపీఠం, బంగారుపాదకవచం, స్వర్ణపీతాంబరం, బంగారు నందకఖడ్గం, వజ్రాలు తాపిన సూర్యకఠారి, వైకుంఠ

తొలిహారతి

శ్రీవారి సుప్రభాతానంతరం, శ్రీస్వామివారికి మహంతు బావాజీవారి "నవనీతహారతి" తొలిగా సమర్పింపబడుతుంది. శ్రీస్వామివారితో పాచికలాడిన పరమభక్తుడే ఈ మహంతుబావాజీ!

హస్తం (వరదహస్తం) కటిహస్తం, బంగారుకవచాలు, సాలగ్రామ హారాలు శంఖుచక్రాల బంగారుకవచాలు, నవరత్నాలుతాపినవి, లక్ష్మీ హారం, నాలుగుపేటల సహస్రనామమాలలు వజ్రకిరీటాలు, మకర తోరణం... ఇలా ఎన్నో ఎన్నెన్నో శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఆపాద మస్తకం ఆభరణాలు వున్నాయి.

ఆ యా విశేష సందర్భాల్లో వీటిని స్వామికి అలంకరిస్తారు. ఇవన్నీ ఎక్కడివి? ఎవరిచ్చారు? అంటే కోరికలు తీరిన భక్తులు ఇచ్చి ఉంటారు. ఎంతమందికి మాటలు ఇచ్చాడో, మాట నిలబెట్టాడో, ఎందరికి కడుపును పండించాడో, ఎందరికి కడుపు నింపాడో, ఎవరికి చేతులిచ్చాడో, ఎందరికి చేతలిచ్చాడో, ఎందరికి కన్ను లిచ్చాడో, కాళ్లిచ్చాడో, ఎవరికి తెలుసు. ఇదిగో! అలా కోరికలు తీరిన భక్తులే స్వామివారికి మణులిచ్చారు. అలంకారా లిచ్చి



మేల్కొలుపు సేవ

ప్రతిరోజు శ్రీవారి సుప్రభాతంలో తాళ్లపాక అన్నమయ్య వంశీయులు, బంగారువాకిళ్ల దగ్గర నేటికీ మేల్కొలుపు పాటలు పాడుతూ స్వామివారిని మేల్కొల్పుతూ, అలాగే రాత్రి ఏకాంత సేవలో 'జోలపాట' పాడుతూ స్వామివారి పవళింపు సేవలో పాల్గొంటున్నారు. నిత్యమూ జరిగే "కల్యాణోత్సవం"లో తాళ్లపాక వారు నిత్యకన్యా దాతలుగా సత్కారం పొందుతున్నారు.

ఉంటారు. ఆ భక్తులు ఇచ్చిన వాటినే శ్రీనివాసుడు మురిపెంగా అలంకరించుకొంటూ భక్తులను మురిపిస్తున్నాడు. అయితే స్వామి వారు ఏ భక్తునికి ఏ కోరిక తీర్చాడో ఒక్క స్వామికే తెలియాలి. అంతే! అంతే!

కమ్మని ఆరగింపులు

ఆనందనిలయుడు అలంకారప్రియుడు! అంతకంటె మిక్కిలి ఆహారప్రియుడు! అంతకంటే భక్తప్రియుడు! భక్తుల కోసమే ఎన్నెన్నో కమ్మగా ఉండే **లడ్డులను, వడలను, దోసెలను, అప్పాలను, క్షీరాన్నం పాయసం, కదంబం, మొళహోర, పొంగలి, సీరా, కేసరి** మున్నగు అన్నప్రసాదాలను సుష్టుగా ఆరగిస్తాడు.



భోజన ప్రియుడైన శ్రీనివాసప్రభువు నిత్యమూ **"తోమని పళ్లాల్లో"** ఆరగిస్తాడట! ఒకసారి భోజనం చేసిన పళ్లాన్ని కడగకుండా పారవేస్తారు. భోజనానికి మళ్లీ కొత్త పళ్లెం ఉపయోగిస్తారు విచిత్రంగా ఉందికదూ! అవేమంటే **"మట్టికుండలు"** అది కూడ సగం పగిలినమట్టికుండ. అదే ఓటి కుండ - దాన్నే **'ఓడు'** అంటారు. ప్రతిరోజు 'ఓడు'లో మాత్రమే ఆరగించే ఆనందనిలయుని వైభోగం వైభవం ఇదా అని ఆశ్చర్యపోక తప్పదుమరి! ఇలా ఏది తిన్నా, ఎన్నెన్నిటిని తిన్నా తన భుక్తశేషాన్ని మళ్లీ భక్తులకే ప్రసాదిస్తాడు. వాటిని తిన్న భక్తులకు తుష్టీ, పుష్టీ, సంతుష్టితోపాటు సమస్త కోరికలు తీరుతున్నాయి. సంపూర్ణ ఆరోగ్యం కలుగుతున్నది.

వింత వింత మొక్కుబళ్లు

'పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి' అన్నట్లు ఎన్నెన్ని పుర్రె లున్నాయో, వాటి ఆలోచనలు మరెన్నెన్ని ఉన్నా, ఆ ఆలోచనలకు తగ్గట్లు అభిరుచులు ఉన్నా, ఆ అన్నింటి ఆలోచనలకు, అభిరుచులకు తగిన దేవుడు తిరుమలేశుడు.

భక్తులు ఆచార వ్యవహారాలు వేర్వేరు అయినా, వారి భాషలు ఒక్కటి కాకపోయినా, మొక్కులను వింత వింతలుగా చెల్లించినా వాటినన్నింటిని ప్రీతిగా స్వీకరించి, వారు కోరే కోరికలను తీరుస్తున్న స్వామి తిరుమలేశుడు!

అసలు మొక్కుబళ్ల మిషతోనే తన దగ్గరికి రప్పించుకుంటాడట శ్రీనివాసుడు. మొక్కుబళ్ల సమర్పణలో ఆడా మగా, చిన్నా పెద్దా తేడా లేకుండా మొక్కులుగా, కొందరు నిలువుదోపిడిలు ఇస్తారు. తలచిక్కులను ఇస్తారు. తల చిక్కులను స్వీకరించి, జీవితంలోని చిక్కులను తీర్చే విచిత్రమైన స్వామి వేంకటేశుడు.

సామాన్యులేకాక మాన్యులు, అసామాన్యులు కూడా దేవుడికి మొక్కులు చెల్లించారు.

విజయనగరచక్రవర్తి శ్రీకృష్ణరాయలు 1513 నుండి 1521 వరకు ఏడుమార్లు తిరుమలయాత్ర చేసి, నవరత్నఖచితహారాలను, పాల ఆరగింపు కోసం బంగారు గిన్నెలను, మకరతోరణాన్ని బంగారు విమానపూతను మొక్కుబళ్లుగా సమర్పించినాడట! అచ్యుతరాయలు వెంకటపతిరాయలు, ఎన్నో మొక్కులు చెల్లించారు.

అంతకు పూర్వం 614లో **పల్లవరాణి సామవై** వెండి భోగశ్రీనివాసుని చిన్న విగ్రహాన్ని మొక్కుగా సమర్పించి, బ్రహ్మోత్సవాలకు ముందుగా ఊరేగించేట్లు చేసిందట.

తులాభారాలు, ఆలయప్రదక్షిణలు, అంగప్రదక్షిణలు అఖండ దీపారాధనలు... ఇలా శ్రీస్వామివారికి సమర్పింపబడే మొక్కులు ఎన్నెన్నో! ఎవరికెరుక.

విచిత్రమైన వరాలు - ఆనందకరమైన లీలలు

కొండలరాయడు 'కోరిన వరాల రాయడు'. అన్నమయ్య అన్నట్లు - **"ఏమివలసిన ఇచ్చు ఎప్పుడైనను, ఏమరక కొలిచిన ఇతడే దైవము".** కొందరికి కన్నులిస్తాడు, కాళ్లిస్తాడు. పనిచేయ చేతులిస్తాడు. మాటలిస్తాడు. ప్రాణమిస్తాడు. పదవులిస్తాడు. కడుపును నింపుతాడు. కడుపును పండిస్తాడు.

'శ్రీనివాసా! బహూక్త్యా కిం? భక్త సర్వార్తినాశనే,
సర్వార్థ పూరణే చాపి త్వత్సమోండే న కుత్రచిత్'

అయ్యా! భక్తులకు "అవి ఇస్తావు, ఇవి ఇస్తావు" అని పొగడడం దేనికి? భక్తుల సర్వార్తులను పోగొడుతూ, సర్వార్థాలను

ప్రసాదించే నీలాంటి దేవుడు ఈ బ్రహ్మాండంలో ఎక్కడా లేడు, కన పడదు కదయ్యా స్వామీ! అని పొగడబడుతున్నాడు. తిరుమలేశుడు.

అంబరాన్నంటే బ్రహ్మోత్సవ సంబరాలు

ఏడాదికి ఒకమారు పదినాళ్లపాటు సాగే బ్రహ్మోత్సవాలు 'న భూతో న భవిష్యతి!' గా ఉంటూ, ఏ ఏడాదికి ఆ ఏడాది కొత్తగా జరుగుతూ ఆనందాన్ని కలిగిస్తాయి.

వేంకటేశ్వరుడు కన్యామాసంలో శ్రవణనక్షత్రం రోజున ఆవిర్భవించిన రోజును పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలు ఏనాటి నుంచో జరుగుతున్నాయి. బ్రహ్మదేవుడు నిర్వహించినందువల్లే ఇవి బ్రహ్మోత్సవాలుగా ప్రసిద్ధిని పొందాయి. శ్రవణనక్షత్రం రోజుకు పదినాళ్ల ముందుగా **ధ్వజారోహణతో** ప్రారంభమై, చివరగా, **చక్ర స్నానం, ధ్వజావరోహణంతో** ముగిసే ఈ పదినాళ్ల వేడుకల సంరం భాన్ని, సంబరాల్ని వర్ణించడం సాధ్యం కాదు, చూచి తీరవలసిందే.

మొదటిరోజు రాత్రి **పెద్దశేషవాహనంతో** ప్రారంభమైన ఉత్సవాలు ప్రతి రోజు ఉదయం రాత్రి వరుసగా **చిన్నశేషవాహనం, హంసవాహనం, సింహం, ముత్యపుపందిరి, కల్పవృక్షం, సర్వభూపాల వాహనం, మోహినీఅవతారం, గరుడోత్సవం, హనుమద్వాహనం, గజవాహనం, సూర్య ప్రభ, చంద్రప్రభ, రథోత్సవం, అశ్వవాహనం.** ఇలా జరిగే వాహనోత్సవాల్లో శ్రీనివాసుని వైభవం అనంతం! అప్రమేయం! అచింత్యం!!

ఈ బ్రహ్మోత్సవంలో ముఖ్యంగా ఐదవనాటి రాత్రి జరిగే బంగారు గరుడోత్సవం, ఎనిమిదవరోజు ఉదయం జరిగే రథోత్సవా లను దర్శించడానికి రెండు కన్నులు చాలవు.

శ్రీవారి గరుడోత్సవం రోజున మూలవిరాట్టునకు అలం కరించే **మకరకంఠి, లక్ష్మీహారాలు, సహస్రనామమాలలు,** మద్రాసు నుంచి కొత్తగొడుగులు, **శ్రీవిల్లిపుత్తూరు గోదాదేవిమాలలు.** ఇలా అనేక విశేషమైన వాటితో తిరుమల వీథులలో బంగారు గరుడునిపై విహరించే వేంకటేశుణ్ణి, ఆ ఒక్కరోజు దర్శించడానికి లక్షలాది భక్తులు తిరుమల చేరుకుంటారు.

బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాల్లో **బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు, యతీశ్వరులు, బాలబాలికలు, కన్యలు, పుణ్యాంగనలు, వితంతువులు, విధురులు, కుంటి, గుడ్డి, వికలాంగులు, అధికారులు, అనధికారులు, పండితులు, పామరులు, ధనికులు, పేదవారు, ఉద్యోగులు, ఉద్యోగార్థులు, కార్యార్థులు, శరణార్థులూ, అర్థార్థులూ.** ఇలా వారూ వీరూ అనకుండా ఎందరెందరో, మరెం దరో కలియుగవైకుంఠుని దర్శించడానికి వస్తారు.

ముఖ్యంగా ఏడాదికి ఒకమారు పదినాళ్లపాటు జరిగే బ్రహ్మోత్సవ సంబరాలు అంబరాన్నంటుతాయి.

ఏడుకొండల్లో ఒకవైపు గోవిందలు పెడుతూ కొండలు ఎక్కు తున్న భక్తజనం. మరోవైపు భక్తితో భజన చేస్తున్న భజనబృందాలు ఇంకోవైపు **కోలాటనృత్యాలు, చెక్క భజనలు, హరికథలు, బుర్ర కథలు, పగటివేషాలు, పుష్కరిణీస్నానాలు, దర్శనాలు, నున్నటి గుండ్లతో** తిరునామాలతో సాక్షాత్తు నామాలవాని **ప్రతిరూపాలు**గా కన్పడే భక్తులు, **నిత్యాన్నదానాలు, ప్రసాద వితరణలు...** యాత్రికుల సేవలో అహరహం శ్రమిస్తున్న దేవస్థానం ఉద్యోగస్థులు, **శ్రీవారి సేవక బృందాలు, స్కౌట్లు,....,ఆరోగ్యాధికారులు, అర్చకస్వాములూ, ధార్మిక ప్రసంగాలు..** ఇలా ఒక్కరేమిటి ఒక్కటేమిటి ఎందరెందరో ఎన్నోవిధాల ఆనందంగా కోలాహలంగా సంబరంగా కనపడతారు.

ఇక బ్రహ్మోత్సవం జరిగే రాత్రిళ్లలో తిరుమలక్షేత్ర సౌందర్యం వర్ణనాతీతం! తిరుమల అంతటా **స్వాగతతోరణాలు, ఆలయప్రాకా రాలు, మండపాలు, పుష్కరిణి, సత్రాలు..** ఇలా సర్వేసర్వత్రా తిరు మలలో మిరుమిట్లు గొలుపుతున్న విద్యుద్దీపాలలో శోభాయమానంగా అలంకరింపబడుతుంది. దేవతలు, ఇతరలోక దేవతలు జ్యోతి స్వరూపాలుగా దిగివచ్చి బ్రహ్మాండనాయకుని ఉత్సవాన్ని వీక్షిస్తున్నారా అన్నట్లుగా ఉంటుంది తిరుమలక్షేత్రం. ఈ సందర్భంలో ప్రత్యేకత పుష్పాలంకరణ. శ్రీవారిఆలయం అంతటా వింత వింత పుష్పాలతో, సుగంధాలను వెదజల్లే పూలతో శ్రీవారిఆలయం, సర్వత్రా అలం కరించడం దేవస్థానంవారి, పుష్పవనాలశాఖ ప్రత్యేకత! అవన్నీ కన్ను లారా చూస్తూ మనసారా ఆస్వాదించవలసిందే తప్ప చెప్పడానికి మాటలు చాలవు. లేవు కూడ.

పుష్పకైంకర్యం

శ్రీనివాసుడు పుష్పప్రియుడు. కొండమీది పూలన్నీ స్వామివారి పూజకు మాత్రమే. ఇతరులు పుష్పాలు ఉపయోగించరాదు. అందుకే తిరుమల "పుష్పమండపం" అని పేరును పొందింది. వెయ్యేండ్లకు పూర్వం నుంచీ "ఆనందాళ్వారు" శ్రీనివాసుని పుష్పకైంకర్యంలో పాల్గొంటు న్నారు. వీరు భగవద్రామానుజాచార్యులవారి శిష్యుడు.

తీర్థకైంకర్యం

ప్రతిరోజు శ్రీవారి భోగశ్రీనివాసమూర్తికి, ప్రతి శుక్రవారం మూలమూర్తికి ఆకాశగంగాతీర్థంతో అభిషేకం జరుగుతుంది. తిరుమలలోని ఆకాశగంగా తీర్థజలాలను తెచ్చే కైంకర్యంలో సుమారు వేయ్యేండ్లుగా 'తిరుమలనంబి' అనే వైష్ణవాచార్యుల వంశీయులు పాల్గొంటున్నారు. వీరు శ్రీరామానుజుల వారికి గురువులు. స్వయంగా మేనమామకూడ. శ్రీనివాసుడు వీరిని ఒక సందర్భంలో తాతా! తాతా! అన్నాడట. అందువల్లే 'తిరుమలనంబి'కి 'తిరుమల తాతాచార్యులు' అనే మరో ప్రసిద్ధమైన పేరు ఏర్పడింది.

ముత్యాల హారతి

ప్రతిరోజు రాత్రి చివరగా తిరుమలేశునికి **'ఏకాంతసేవ'** అనే **పవళింపుసేవ** జరుగుతుంది. ఈ సేవలో సన్నిధిగొల్ల పట్టు పాన్పును వేసి దీపజ్యోతులు వెల్గిస్తాడు. శ్రీస్వామివారు యోగనిద్ర కుపక్రమిస్తూ తూగుటుయ్యాలలో మంద్ర మంద్రగా ఊగుతుంటాడు. ఆ సమయంలో అన్నమయ్య **జోలపాట** పాడుతుం డగా, **తరిగొండవెంగమాంబ పేరుతో ముత్యాలుపేర్చిన వెండిపళ్లెంలో కర్పూర దివ్యమంగళ నీరాజనం** సమ ర్పించబడుతుంది. తరిగొండనుంచి చిన్నపుడే వచ్చి తిరుమల సన్నిధిలో స్థిరపడిన పరమభక్తురాలు వెంగ మాంబ. ఈమె సమర్పించే **ముత్యాలహారతే** చివరి హారతి.



అందుకే శ్రీవారి ఆలయంలో **'తాళ్లపాకవారి లాలి, తరిగొండవారి హారతి'** అన్న ప్రసిద్ధి ఏర్పడింది. ఆ తర్వాత దర్శనాలు ఉండవు, హారతులు ఉండవు. అందువల్లే తాళ్లపాకవారి లాలిని వింటూ తరిగొండ వారి హారతిని స్వీకరించి యోగనిద్రకుపక్రమిస్తాడు శ్రీనివాస ప్రభువు. ఆ తర్వాత శ్రీవారి ఆలయం బంగారువాకిళ్లు మూసివేస్తారు.

ఇన్ని అద్భుతాలను, చెప్పుకొన్న మనం మరో ఆశ్చర్యకరమైన, మరిచిపోకుండా ఆచరించవలసిన క్షేత్ర సంప్రదాయం ఒకటి ఉంది. అదే **శ్రీస్వామిపుష్క రిణీ స్నానం, శ్రీ ఆదివరాహస్వామిదర్శనం.**

శ్రీస్వామి పుష్కరిణీ స్నానం

తిరుమలక్షేత్రంలో తొలిగా శుభ్రంగా సకలపాపాలు తొలగే **"శ్రీస్వామి పుష్కరిణి"** అనే దివ్యతీర్థంలో స్నానం చెయ్యాలి. ఈ పుష్కరిణిలో స్నానం చేసిన తర్వాత ఆ పుష్కరిణీతీరంలో ఉండే శ్రీవరాహస్వామివారిని మొదట దర్శించాలి.



శ్రీస్వామిపుష్కరిణితో పాటు తిరుమలకొండల్లో ఉన్న దివ్యతీర్థాలను దర్శించి పుణ్యస్నానాలు చెయ్యాలి.

శ్రీ భూవరాహస్వామి



వేంకటాచలక్షేత్రంలోని **తొలిదైవం శ్రీ ఆదివరాహస్వామి.** ఈయన్నే **'శ్వేత వరాహస్వామి'** అంటారు. క్షేత్రసంప్రదాయం ప్రకారం **'తొలిపూజ, తొలి నైవేద్యం, తొలిదర్శనం'** జరుగు తున్న ఈ వరాహస్వామిని దర్శిం చిన తర్వాతే శ్రీవేంకటేశ్వరుణ్ణి దర్శించడం శ్రేష్ఠం! శ్రీవేంకటేశ్వ రునికి ఇష్టమే గాక, యాత్ర కూడా సఫలం అవుతుంది.

ఇలా ఆనందనిలయం, చుట్టూరా, సప్తగిరిక్షేత్ర సానువుల్లో అణువణువునా, అడుగడుగునా అద్భుతాలు, ఆశ్చర్యాలు చోటు చేసుకొన్నాయి. వాటిల్లో అన్నింటిని తెలుసుకోవడం చాల అసాధ్యం. ఒక్క ఆనందనిలయునికే తెలి యాలి. ఒక్క ఆనందనిలయునికి మాత్రమే తెలియాలి. అవన్నీ ఆ స్వామివారు తెలియచేసినా తెలుసుకొనే శక్తి మనకు లేదు గాక లేదు. అయినా మన కోరికలను తీరుస్తున్న ఆ **'వరాలరాయుడి' కొండంత దయ** మనమీద ఉంటే చాలు! మన జన్మలు తరించినట్లే!!

ఓం నమో శ్రీవేంకటేశాయ

శ్రీవేంకటేశుని కీర్తికిరీటాలు...

- శ్రీ పి.వి.లక్ష్మీనారాయణ

తిరుమలస్వామికి ఎందరో మహానుభావులు కిరీటకైంకర్యాలు చేశారు. అవేంటో తెల్సుకుందాం.

ఆకాశరాజకిరీటమే స్వామికి తొలికిరీటం

శ్రీనివాసునికి పద్మావతితో పెళ్లైంది!! మామగారు ఆకాశ రాజుగారింట్లో పెండ్లికొడుకుగా కొలువై ఉన్నాడు శ్రీనివాసుడు. నారాయణవరక్షేత్రం పరమపావనమైంది.

అల్లుడు సాక్షాత్తు జగదానందకారకుడైన వైకుంఠవాసుడని పసిగట్టి, తెలుగు చోడవంశజుడైన ఆకాశరాజు, "జగముల నేలే త్రిభువనచక్రవర్తివి! సమస్త దేవీ- దేవతాసామ్రాట్టువి. ఇదిగో మా ఈ చిన్నికిరీటాన్ని ధరించి, మా లోకపావనం చెయ్యి తండ్రీ!!" అంటూ నవరత్నఖచితమైన బహుసుందరమైన, ఘనమైన ఒక సువర్ణకిరీటాన్ని శ్రీనివాసునికి సమర్పించుకున్నాడు. కలియుగ కల్యాణకారకసార్వభౌమునికి అదే తొలి కిరీటం!!

సామవాయికిరీటం

ఆంధ్రదేశంలో రాణులు-మహారాణులు, దానశీలురైన మహిళామణులు ఎందరో ఉన్నా ఆ కోవకు చెందిన ఆదర్శనారీరత్నం "పల్లవరాణి సామవాయి!" ఈ వనితామతల్లి తిరుమల శ్రీవేంకటేశునికి అనన్యభక్తురాలు. ప్రయాణసౌకర్యాలు మృగ్యమైన ఆ రోజుల్లో 7వ శతాబ్దంలో తిరుమలకొండను 5సార్లు అధిరోహించిన ఈ స్త్రీరత్నం, స్వామిఆలయాన్ని సుశోభితంగా పునర్నిర్మించడంతో పాటు, శ్రీవేంకటేశునికి నవరత్నఖచితమకుటంతో పాటు, అనేకానేక తిరువాభరణసంపత్తిని కూడా సమర్పించుకుని తరించింది!!

కృష్ణరాయడు సమర్పించిన కీర్తికిరీట కట్నకానుకలు

గొప్ప సాహసీ, ఖడ్గవీరుడైన శ్రీకృష్ణదేవరాయలకు తిరుమల వెంకన్నపై అపారమైన భక్తివిశ్వాసాలుండేవి. స్వయంగా ఖడ్గధారణం చేసి అప్రమేయబలవిలసితమైన సేనాసమూహసంచాలనం చేసి, శత్రువీరులగుండెల్లో మృత్యునాదాలు చెలరేగించింది తాను కాదు; సాలగ్రామవిగ్రహమూర్తి, మనోహరాకృతితో, బ్రహ్మాండమౌనముద్రతో



జగద్వీక్షణం చేస్తూ నిలబడి ఉన్న శ్రీవేంకటేశ్వరుడే మహాబలుడని నమ్మిన మహాభక్తుడు శ్రీకృష్ణదేవరాయలు!!

ఆయన ఏడుసార్లు, తిరుమలకొండను సకుటుంబంగానూ, ఒక్కడుగానూ సందర్శించినట్లు చరిత్ర చెబుతోంది. తాను గెలిచిన ప్రతిపర్యాయమూ, తనను గెలిపించిన వేంకటాద్రి వేల్పునకు ఆయన సమర్పించిన కట్నకానుకలు అపారం!!

అవి-నవరత్నఖచితకిరీటం, 25 వెండిపళ్ళేలు, ఇరు దేవేరులద్వారా స్వామివారి పాలఆరగింపుసేవకు రెండు అపరంజి పాన పాత్రలు. ఉత్సవమూర్తులకు కిరీటాలు, ఇతర విలువైన ఆభరణాలు, మాతృమూర్తి నాగాంబిక, తండ్రి నరసనాయకుని సంస్మరణార్థం ఆలయంలో నిత్యనైవేద్యం, సంవత్సరమహోత్సవాల నిర్వహణకై 5గ్రామాలు దానం, తిరుమలదేవి నిలువుదోపు, చిన్నాదేవి కంఠహార, పతకాల సమర్పణ, నవరత్నప్రభావళి, మకరతోరణం, స్వామికి కంఠమాల, పతకం, 30వేలవరహాలతో, ఆనందనిలయం విమానానికి బంగారుపూత, ఆలయంలో అనేక ఉత్సవాలఏర్పాట్ల నిర్వహణకై అనేక దానాలు, కుమారుడు తిరుమలరాయని తరపున అనేకమైన కానుకలు, నవరత్నఖచిత పీతాంబరం, నవరత్నాలు పొదిగిన కుళ్ళాయి, వింజామరలు-2, నవరత్నపతకం, 1000 వరహాలు, తిరుమలదేవి తరపున పతకం.

దేవదేవునికి ఇతోధికమైన కానుకలు సమర్పించి, నిత్య దీప-ధూప-నైవేద్యాలకు యథాశక్తి ధనధాన్యసంపత్తిని సమకూర్చి, కలియుగ యుగాంతం వరకూ ఆయన సన్నిధిలో సేవకునిగా దేదీప్యమానంగా వెలుగొందాలన్నదే రాయలవారి కృతనిశ్చయం!!

కృష్ణదేవరాయల తిరుమల యాత్రలు, ఆనాటి జన సామాన్యంలో భక్తిని కలిగించాయనడం ఎంత మాత్రమూ అతిశయోక్తి కాదు! "అంతటి మహాప్రభువులే తిరుమలేశుని ముందు మోకరిల్లినాడంటే, ఆయన మహత్తు ఎంత గొప్పదో కదా!" అని సామాన్య దేశవాళీభక్తజనం తలచేవారు!! తిరుమలదేవరకు కృష్ణరాయడు సమర్పించినంత సంపదను ఇంకెవరూ సమర్పించి ఉండలేదు. ఆయన స్వామికి నవరత్నఖచితకిరీటం, ఉత్సవమూర్తులకు గుండ్రటి ఆ కుంభరూపకిరీటాలేకాక, వెలకట్టవీలుకాని కెంపులు, పచ్చలు, వజ్రాలు, నీలాలు, మాణిక్యాలు, వైడూర్యాలు, గోమేధికాలు సమర్పించి తరించాడు!!

వేదవ్యాసుని పద్దెనిమిదిపురాణాల్లో వామనపురాణమొకటి. శ్రీమహావిష్ణువు దశావతారాల్లో వామనావతారం ఐదవది. ధర్మానికి భంగంకల్గిన ప్రతిసారీ దుష్టశిక్షణ శిష్టరక్షణకై అవతారం దాల్చి ధర్మసంస్థాపన చేస్తానని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ ప్రబోధించాడు. బ్రహ్మతేజస్సుతో దండాన్ని, గొడుగును, కమండలాన్ని ధరించి బ్రాహ్మణరూపంలో వామనుడుగా శ్రీమహావిష్ణువు అవతరించాడు. ఇంద్రుని తమ్ముడుగా ఉపేంద్రుడై, మూడడుగులతో మూడులోకాల్ని ఆక్రమించి త్రివిక్రముడై బలిచక్రవర్తిని పాతాళానికి అణచివేశాడు. మూడు అడుగులు జాగ్రత్త, స్వప్న, సుషుప్తి అవస్థలకు ప్రతీక. వీటిని అధిగమిస్తే మోక్షం ప్రాప్తించగలదని ఈ అవతార పరమార్థం. విష్ణుపురాణం, శ్రీమద్భాగవతంలోనూ వామనుని ప్రస్తావన ఉంది. భాద్రపదమాసం శుక్లపక్షం ద్వాదశినాడు వామనజయంతి నిర్వహిస్తారు. కనుక వామనజయంతిని వామనద్వాదశి అని కూడా పిలుస్తారు.

దరిద్రుడివౌతావు

ఒకప్పుడు దేవేంద్రుడు ఐరావతాన్ని ఎక్కి రాజవీథిగుండా వస్తుండగా దుర్వాసమహర్షి కనిపించాడు. దుర్వాసుడు ఇంద్రుని చూచి సంతోషించి ఒక పుష్పమాలను అందించాడు. ఇంద్రుడు దాన్ని తీసుకుని అనాలోచితంగా ఐరావతంపై వేయగా ఆ ఏనుగు దాన్ని క్రిందపడేసి తొక్కేసింది. ఇంద్రుని ఆ వైఖరికి కోపించిన దుర్వాసుడు దరిద్రుడివైపోతావంటూ ఇంద్రుని శపించాడు. ఆ శాప ఫలితంగా కొంతకాలానికి బలిచక్రవర్తి దేవతలపై దండెత్తి స్వర్గాన్ని కైవసం చేసుకోగా ఇంద్రాదిదేవతలు నిరాశ్రయులయ్యారు.

వామనుడి పుట్టుక

ఇంద్రుని తల్లి అదితిని వెంట పెట్టుకొని సమస్తదేవతలు శ్రీమహావిష్ణువుకి మొర పెట్టుకోగా శ్రీమహావిష్ణువు అదితిగర్భాన జన్మించి దేవతల కష్టాల్ని తొలగిస్తానని మాటిచ్చాడు. అనతికాలంలోనే అదితి గర్భం ధరించి చక్కనిబాలునికి జన్మ నిచ్చింది. అదితి కశ్యపుల పుత్రుడైన వామనుడు దినదినప్రవర్ధమానుడై అనతికాలంలోనే బ్రహ్మచారిగా దీక్షను స్వీకరించాడు.

మూడడుగుల... దానమే చాలు!!

– శ్రీమతి మల్లాది రామలక్ష్మి




నేను బ్రాహ్మణవటువును... బ్రహ్మచారిని

బలిచక్రవర్తి హిరణ్యకశిపుని మునిమనుమడు. ప్రహ్లాదుని మనుమడు. విరోచనుని కుమారుడు. నూరుయజ్ఞాలను చేసిన బలిచక్రవర్తి దేవతలను గెలిచి ఆ విజయోత్సాహంలో అశ్వమేధయాగాన్ని చేయ సంకల్పించాడు. ఆ మేరకు అనేకదేశాలనుండి బ్రాహ్మణోత్తములు, పండితులు, పురోహితుల్ని ఆహ్వానించాడు. ఈ వార్త తెలుసుకుని విభూతిరేఖలు ధరించి ఒక చేతిలో కమండలం, మరొకచేత ఛత్రం ధరించి దివ్యతేజస్సు మూర్తీభవించిన రూపంతో బలి చక్రవర్తి యాగస్థలానికి వామనుడు వచ్చాడు. ఆ బాలవటువుయొక్క కోటిసూర్య సమదివ్య

సెప్టెంబరు - 02న
వామనజయంతి
సందర్భంగా...

మూడడుగుల పరమార్థమేమంటే....

భాద్రపద శుద్ధద్వాదశినాడు వామనజయంతి శ్రవణానక్షత్రంతో కలిసి వస్తే విశేషయోగం. విష్ణువు మూడుపాదాలు కలిగినవాడుగా ఋగ్వేద వాక్కు. సూర్యుని ఉదయ, మధ్యాహ్న, అస్తమయాలే ఈ మూడుపాదాలని పెద్దలమాట. విష్ణుపాదాల్లో రెండుమాత్రమే మానవులకు కనిపిస్తాయని, మూడోది చీకటిమయమైన అధోలోకంలో ఉండటంవల్ల మానవులకు కనిపించ దని, సూర్యుడు అస్తమయమై దీర్ఘరాత్రిని కల్పించినపుడు అదృశ్యమైన మూడో పాదం ఏర్పడుతుందని పెద్దలమాట. వామనుని మూడుపాదాలూ విశ్వరూప, తైజసరూప, ప్రాజ్ఞరూపపాదాలని తాత్వికులవాక్కు. వేదాలు వామనుని ఉరు క్రముడని వర్ణించాయి. ధూళిధూసరమైన ఆయన పాదంలో సమస్తలోకాలూ అంతర్హితమయ్యాయని వర్ణించారు. శ్రీమహావిష్ణువు విభవావతారాల్లో త్రివిక్రమ స్వరూపం అత్యంత అద్భుతమైనది. బలిచక్రవర్తివంటివారు ధర్మపరాయణులై సత్యానికి కట్టుబడి ఉన్నందున వారి పేరు చిరస్థాయిగా ధరణిపై నిలిచి పోయింది. స్మృతికౌస్తుభంలో బలిబంధన పుణ్యకాలాన్ని వామనజయంతి వ్రతమని పేర్కొనబడింది. దీనికి శ్రావణద్వాదశి, విజయద్వాదశి అనేపేర్లు కూడా ఉన్నాయి.



ప్రకాశాన్ని చూసిన వారందరూ ప్రణమిల్లి ఆహ్వానించారు. విష్ణుభక్తుడైన బలిచక్రవర్తి వామనుని అల్లంతదూరంలో చూసి ఎవరో మహానుభావుడని గ్రహించి ఎదురేగి నమస్కరించి వినయవిధేయతలతో ఉచితాసనంపై కూర్చుండబెట్టాడు. వామనునిపాదాలను కడిగి ఆ పవిత్రోదకాన్ని శిరస్సున చల్లుకొని స్వామీ! మీకు నానుంచి ఏమి కావాలంటూ వినయంగా అడిగాడు. అందుకు వామనుడు రాజా! “నేను బ్రాహ్మణవటువును. బ్రహ్మచారిని. నీ రాజ్యం, నీ సిరిసంపదలు నాకవసరం లేదు. కానీ మూడడుగుల భూమినిస్తే చాలు” అన్నాడు.

ఇచ్చినమాటకు కట్టుబడుంటాను

బలిచక్రవర్తి వామనుడడిగిన మూడడుగుల భూమిని ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. ఇంతలో బలిచక్రవర్తి గురువైన శుక్రాచార్యుడు అడ్డొచ్చి ఈ బ్రాహ్మణవటువు సామాన్యుడు కాదు. వామనరూపంలో వచ్చిన సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే. మూడడుగులనేలను ఇవ్వటం సమంజసం కాదని వారిం చాడు. కానీ, బలిచక్రవర్తి నేను ఇచ్చినమాటకు కట్టుబడుంటానని చెప్పి మూడడుగుల నేలను ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు.

ఇంతింతై వటుడింతింతై....

బలిచక్రవర్తి ధర్మపత్ని వింధ్యావలి జలంతోనింపిన సువర్ణకలశాన్ని తీసుకువచ్చి వామనమూర్తి పవిత్రపాదాలపై జలాన్ని విడువగా బలిచక్రవర్తి వామనునిపాదాలను కడుగుతున్నసమయంలో శుక్రాచార్యుడు సూక్ష్మ రూపంలో కలశరంధ్రంలోనికి ప్రవేశించి కలశజలధారకు అడ్డుగా నిలిచాడు. ఆ విషయం గ్రహించి వామనుడు దర్భను తీసు కొని కలశ రంధ్రంలోనికి పొడువగా అతడు ఒక కన్ను పోయి ఏకాక్షుడైపోయాడు. దానధారలు మీద పడటమే తడవుగా వామనుడు ఇంతింతై బ్రహ్మాం డాంతసంవర్ధి అయ్యాడు. ఒకఅడుగుతో భూమిని, రెండోఅడుగుతో స్వర్గాన్ని ఆక్రమించాడు. మూడో అడుగు ఎక్కడ పెట్టమంటావని వామనుడు అడగ్గా బలిచక్రవర్తి తన నెత్తిమీద పెట్టుమన్నాడు. విష్ణువు బలి త్యాగగుణానికి, వచనబద్ధతకు ప్రసన్నుడై బలిని సుతలలోకానికి అణగదొక్కి, అతనికి ఎట్టి భంగపాటు కలక్కుండా తానే అతనివాకిట కాప లాగా ఉన్నాడు.

వామనుని ప్రసిద్ధ ఆలయాలేవంటే...

వామనుని ఆలయాల్లో కేరళలోని తిక్కకర ఆలయం, కాంచీపురంలో ఉలగళనంత పెరుమాళ్ ఆలయం, తమిళనాడు విల్లుపురంలో తిరుకోయి లూర్ ఉలగళనంత పెరుమాళ్ ఆలయాలు ప్రసిద్ధి చెందాయి. ఖజురహోలో కూడా వామనుని ఆల యాన్ని మనం దర్శించవచ్చు.



ఛత్రమా.. హరిఛత్రమా..!

- శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి

బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజు రాత్రి గరుడసేవనాడు
తనకు నిత్యసేవకుడైన గరుత్మంతుడిమీద స్వామి ఊరేగుతారు.
ఈ రోజున స్వామివారి మూలమూర్తిమీద ఉన్న
మకరకంఠి, లక్ష్మీహారం, సహస్రనామాలు ధరించి
మలయప్పస్వామి భక్తులను అనుగ్రహిస్తారు.
గోదాదేవి శ్రీవిల్లిపుత్తూరునుంచి పంపే తులసిమాలను,
కొత్త గొడుగులను ఈ వాహనంలో అలంకరిస్తారు.
ఆ గొడుగుల ప్రాభవమేంటో కొంత తెలుసుకుందాం.

వైకుంఠవాసుడైన తిరుమలేశునికి జరిగే బ్రహ్మోత్స వాల్లో గరుడసేవ అత్యంత ప్రాముఖ్యమైంది. ఈ గరుడసేవలో ప్రత్యేకించి చెప్పుకోదగ్గది స్వామికి సమర్పించబడే గొడుగుల ప్రాధాన్యతే ఎక్కువగా ఉంటుంది. ఈ గొడుగులే లేకపోతే గరుడసేవకు ప్రాధాన్యతే ఉండదని భక్తులమాట. ఆ గొడుగుల నేపథ్యం గురించి తెలుసుకుందాం.

దేవుళ్ళకు గొడుగులు సమర్పించాలనే ఆలోచన.... ఎలా కలిగిందంటే.....

గొడుగులనేవి ఎన్నో రకాలు. ప్రాచీనకాలంనుండీ కూడా మానవుడు ఏదో ఒకరూపంలో ఉన్న గొడుగును వాడు తూనే ఉన్నాడు. మొట్టమొదట పల్లెల్లో తాటిఆకులు, ఈత ఆకులు, మొగలిరేకులు, కొబ్బరిఆకులతో అల్లబడిన గుండ్రని గొడుగులను వాడేవారు. ఆ తర్వాత ఎన్నోరకాల గొడుగులు వచ్చాయి.

ఆ క్రమంలో మానవుడు తన అవసరాలకోసం తానేమి ఉపయోగిస్తున్నాడో వాటినంతా దేవుళ్ళకు కూడా అమర్చాలను కున్నాడు. అలా మానవులకు జరిగే పుట్టినరోజులు, పెళ్ళిళ్ళు, ఊరేగింపులు చేసేట్లు దేవుళ్ళకు కూడా జరపాలని తలచాడు. అలా దేవుళ్ళకు ఉత్సవకాలంలో ఊరేగింపులు చేసేప్పుడు అంద మైన, సొగసైన గొడుగులను అమర్చాలనే తలంపు కల్గింది. అలా ఎన్నోరకాల గొడుగులను తయారుచేసి సమర్పించుకోవడం జరిగింది. ఆ కోవలోనే దేవుళ్ళకు ఇత్తడి, ఎవర్‌సిల్వర్, వెండి, బంగారుగొడుగులు సమర్పించుకోవడం జరిగింది.

తిరుమలస్వామి గొడుగులకైంకర్యం

తిరుమలలో స్వామికి జరిగే బ్రహ్మోత్సవంలో గరుడ సేవనాడు ప్రతి సంవత్సరం కొత్తగొడుగులు సమర్పించబడు తాయి. ఈ గొడుగులకైంకర్యం ప్రత్యేకించి గరుడవాహనసేవ నాడే జరుగుతుంది. ఇలా ఎన్నో సంవత్సరాలుగా జరుగుతోంది. ఇలా గొడుగులు సమర్పించే సంప్రదాయం సౌకర్యాలు అంతగా లేని రోజుల్లో కూడా దివిటీల వెలుగుల్లో ఎడ్లబండ్లల్లో కాలి నడకనే తీసుకొచ్చేవారట. చెట్టియార్లు ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ కొనసాగిస్తూండటం విశేషం.

ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో చెన్నపట్టణంలో **'గొడుగులవైభవం'** జరుగుతుంది. నిత్యకల్యాణం పచ్చతోరణం అన్నట్లు కొండమీద దేవునికి ప్రతిరోజూ ఉత్సవమే. కానీ, అన్ని ఉత్సవాలకన్నా మిక్కిలి శ్రేష్ఠమైనది భాద్రపదమాసంలో జరిగే బ్రహ్మోత్సవమే! ఇది బ్రహ్మదేవుడే ప్రారంభించాడని పురాణాల వచనం.

ఈ బ్రహ్మోత్సవంలో ఐదోరోజు జరుపబడేదే గరుడో త్సవం. అనగా గరుడసేవ. ఆ రోజున శ్రీవారిని గరుత్మంత వాహనంమీద ఊరేగింపు చేస్తారు. ఆ సందర్భంలో ప్రతి సంవ త్సరం నాలుగు చిన్నగొడుగులు, రెండు పెద్దగొడుగులు సమ ర్పించబడుతాయి. ఈ గొడుగులను తయారుచేసేరోజునుండి కొండమీద సమర్పించేరోజువరకు అనగా దాదాపు నెలరోజు లుగా **'తిరుమల గొడుగుల ఉత్సవం'** జరుగుతుంది.

ఈ విధంగా గరుడోత్సవంనాడు గొడుగులను సమర్పించే కైంకర్యం సుమారు 180ఏళ్ళుగా జరుగుతోందని పెద్దల మాట. ఈ కైంకర్యాన్ని శ్రీ వేంకటకృష్ణమ్మశెట్టి చేస్తుండేవారు. ఆనాటినుండి ఈ వైభవం పారంపర్యంగా ప్రతి సంవత్సరం జరుగుతోంది. ఇవి తయారుచేయడానికి దాదాపు నెలరోజుల సమయం పడుతుంది. కనుక రెండునెలలముందునుండే ఈ కైంకర్యానికి సంబంధించి పనులు జరుగుతాయి. ఆషాఢ మాసంలో వచ్చే అమావాస్యనుండి శ్రావణమాసం పున్నమి లోపల ఒకమంచి ముహూర్తంలో గొడుగులతయారీకి కావలసిన పక్వమైన వెదురు బద్దలను పెట్టి పూజచేసి గొడుగులతయారీ ఆరంభిస్తారు.

వీటితయారీకి మానుకాడ, పైన కలశం, వెదురు బద్దలు, పట్టువస్త్రం, తెల్లగుడ్డ ఉపయోగిస్తారు. వివిధభాగాల్ని వేరువేరుచోట్ల తయారుచేస్తారు. వీటిలో చెక్కపని చెన్నపురిలో, వెదురుపని కంచిలో, పట్టుకుచ్చుల్ని కుట్టేపని చెన్నపురి చింతాద్రిపేటలో చేస్తారు.

మొదట గొడుగు లోపలిభాగంలో 'పట్టు' వస్త్రాన్ని, పైభాగంలో మేలిరకపు 'ట్రాకేడ్' వస్త్రాన్ని, దానిమీద తెల్లని 'డ్రిల్' వస్త్రాన్ని ఏర్పాటుచేసి, గుండ్రనిభాగం చుట్టు కుచ్చులు పెట్టి కుడతారు. ఈ మూడువస్త్రాలపై ఒక తెల్లతెర ఒరవేస్తారు. వీథుల్లో గొడుగుల ఊరేగింపుసమయాల్లో మేలిరకపువస్త్రాలు మాసిపోకుండా ఉండేందుకు ఈ ఏర్పాట్లు చేస్తారు. తిరుమలకు చేరగానే ఈ ఒరను తీసేస్తారు. అప్పుడు గొడుగు కొత్తగా కనిపిస్తుంది. గొడుగుపైన, కింద మానుకాడతో ఆనుకుని ఉండే కలశాలకు బంగారుపూతరంగు ఉంటుంది.

ఈ గొడుగుల్ని చెన్నపట్నమంతా మేళవాద్యాలతో ఊరేగింపు చేస్తారు. ఆ సమయంలో భక్తులు ధూపదీపనైవేద్యాలు ఇస్తారు. ఇలా ప్రతిరోజూ ఊరేగింపు తర్వాత చెన్నపట్నంలోని కందపుశెట్టివీథిలోని కల్యాణమండపంలోకి చేరుకుంటాయి.

ఈ మండపాన్ని అప్పటి చెన్నపురి మేయరు శ్రీ కె.శ్రీరాములు అనేవారు ఏర్పాటుచేశారు. ఈ మండపం కేవలం గొడుగుల వైభవకాలంలో ఆ పనికి మాత్రమే ఉపయోగించాలన్న నియమం విధించబడింది. ఇక్కడుండే శ్రీ వేంకటాచలపతికి ఈ నెలలో విశేషపూజాపునస్కారాలు జరుపుతారు. ఆ రోజుల్లో ఈ మండపంలో దర్శించుకునేవారు ఏడుకొండల మీద దైవసన్నిధిలో ఉన్నట్లే అనుభూతి పొందుతారు.



ఇచ్చట ప్రత్యేకించి ఇంకొకవిశేషం కూడా ఉంది. తిరుమలలోని మూలమూర్తికి ఒక అమూల్యపట్టువస్త్రం కూడా తయారుచేస్తారు. దానిని గాజుఅలమరలో ఉంచి పూజచేస్తారు. గొడుగులతోపాటే ఈ వస్త్రాన్నికూడా తీసుకుని కాలినడకనే ప్రయాణం సాగించి తిరుమలకు చేరుకుంటారు. అదికూడా సరిగ్గా గరుడసేవనాడే చేరుకుంటారు. ఆనాటిరాత్రి స్వామి గరుత్మంతుని అధిరోహించి వచ్చేప్పుడు కొత్త గొడుగులతో ఊరేగింపు జరుగుతుంది. ఆపై పట్టువస్త్రం మూలమూర్తికి అలంకరిస్తారు.


ఇదీ తిరుమలస్వామి గరుడవాహనసేవ **'గొడుగుల కైంకర్యం'**గా ప్రసిద్ధికెక్కింది. కాబట్టి మనమందరమూ కూడా గరుడసేవనాడు స్వామిని దర్శించి, శ్రీవారి అనుగ్రహం పొందుదాం.

(గతసంచిక తరువాయిభాగం...)

'పాంచజన్యమా! ఎంత అదృష్టమో నీది. కమలనాభుని మోవి తేనె తాగుతున్నావు. ఆ రుచి కపురంపువాసనా? కమలపువాసనా? ఎంత తీపో? చెప్పు మరి. మొగుల్లార! మీరు తిరువేంగడంలోని స్వామితో నా అవస్థ తెలిపి ఏలుకోమని చెప్పండి' అని దూతగా భావించి వేడుకొంది. గరుడాచలంలోగాని, శ్రీరంగంలోగాని, ద్వారకాది తిరుపతులలోగాని నా తాపం చల్లారేలా నన్ను అక్కడికి చేర్చరాదా? అని బతిమాలేది. బలిచక్రవర్తి కంకణం కట్టుకొన్న స్వామి నా చేత కంకణం అడుగు తాడేమిటని ఊహించుకొని నవ్వుకొనేది. ఆహా! స్వామి ఎంత నిర్దయుడో? అని నిట్టూర్పులు నిగిడ్చేది. కాసేపాగి–

'రాముడైన శ్రీరంగనాయకుడు సీతకోసం వారధి కట్టలేదా? ప్రళయకాలంలో భూమి కుంగిపోతే వరాహరూపంలో ఉద్ధరించలేదా? తన్ను కోరే రుక్మిణికోసం శిశుపాలాదులను దండించలేదా? ఇతర చింతలు వదలిపెట్టి తన పాదపద్మాలనే శరణు కోరిన కుంతీసుతుల్ని పాలించిన స్వామి నన్ను అన్యగా తలచాడా? నేను అలక బూనితే నా అలక తీర్చి ఒక నిమిషమయినా నిన్ను వదలిపెట్టనులే అని వాగ్దానమిచ్చి వెళ్ళినవాడు మరల రాలేదెందుకో?' అని పలవరించేది. గోదాదేవిని కనిపెట్టుకొని ఉండేవారు కళవళపడ్డారు.

'ఏమిటో ఈ వ్యవహారం? ఇంతకుముందు మనం ఆరామాలకు ఎన్నిసార్లు రాలేదు' ఈవేళ గోదవాలకం అంతు పట్టడంలేదు. మాట ఒకవంక మనసొకవంక. ఎవరిమీద మనసు పెట్టుకొందో? అని శైత్యోపచారాలు చేశారు. గోదాదేవి శారీరక మానసిక పరిస్థితులు చూచి 'అనుగ్రహ' భయపడింది. ఎవరిని వేడుకోవాలో? ఈమెకు ఏలాంటి సేవచేయాలో? ఏం చేస్తే చెలి మామూలు మనిషవుతుంది' అని బాధపడుతూంటే కనక విగ్రహ అనుగ్రహ గోదదగ్గరికి ప్రియంతో వచ్చింది. లాలించింది. ఒళ్ళంతా నిమిరింది. జారిన పయ్యెద సవరించింది. తాపోపశమనం చేసింది.



మెల్లగా దగ్గరికి చేరి 'అమ్మా! నాతో చెప్పరాదూ? నిజం చెప్పవే. దాపరికమెందుకే? శరీరాలు వేరేగాని ప్రాణాలు మనవి ఒకటే కదా' అని మెల్లగా లాలించింది. గోద సిగ్గుతో ఏకాంతంలో....

'నీవు నా తోడు. నా నీడవు కూడా. నీ మాట జవదాటను. విను. నా కలలో వెన్నుడు వచ్చాడు. ప్రీతితో కావిలించుకొన్నాడు. మరుకేళి తేల్చినాడు. ఎంతో చనువున్నట్టు గడిపాడు. నిన్ను వదలనులే అన్నాడు. నేను నమ్మాను ఇదంతా నిజం' అంది. ఆపై దిగులుమొగం పెట్టింది. అపుడు అనుగ్రహ గోదను సముదాయించి

గోదా! ఇంతమాత్రానికే బాధపడతావెందుకే? నీవు రంగపతికోసం నోములు నోమావు. నీ నోము ఫలిస్తుంది. శ్రీరంగపతి నీకు పతికావడం ముమ్మాటికి నిజం. నా మాట నమ్ము' అంది. ఆపై తనతో చెలిని ఇంటివైపు నడిపించింది.

గోదాదేవి మానసికస్థితి చెలికత్తెలకు మాత్రం పరిమితమవుతుంటే కాకతాళీయంగా...

హరిచిత్తుడైన విష్ణుచిత్తుడు ఒకసారి శ్రీరంగానికి వెళ్ళాలని శ్రీరంగనాథుని సేవించాలని భావించాడు.

గోదాదేవిని పల్లకిలో ఎక్కించి కదిలారు.

అపుడు గోద తండ్రితో 'జనకా! శ్రీరంగనాయకుని గోపురం ఎక్కడ కనబడుతుందో ఏ వేళ చేరుతుందో అపుడు పల్లకిని దించండి' అంది. విష్ణుచిత్తుడు సరేనన్నాడు.

పల్లకి కదులుతూ ఉంది. మార్గంలో నదులు, కొండలు. అన్నింటినిదాటి రంగపురం చేరారు. ఆ పురంలోని వారు ఆకాశంలోని సూర్యబింబంలాగా బంగరుబొట్టులు పెట్టుకొన్న వారిని చూచారు. అక్కడ ద్రావిడవేదాలు అధ్యయనం చేసే పెనువీధిదాటారు. మంచి పన్నీరు కలయంపి చల్లిన ఇంటి ముంగిళ్ళు దాటారు. 'దామోదర' అనే పేరుతోడి తూరుపు గోపురం దగ్గరికి చేరుకొన్నారు.

విష్ణుచిత్తులవారికి గోద కోరిక గుర్తుకు వచ్చింది. పల్లకి ఆపారు. కాని అప్పుడే ఆకాశమార్గాన గోదాదేవి రంగనాథుని దగ్గరికి వెళ్ళడం వారికి తెలియదు. పల్లకి ఖాళీగా ఉండడం చూచి చిలుకలేని పంజరంగా ఉస్సురుమన్నారు. 'హా' అంటూ మూర్ఛపోయారు. కాసేపటికి తెప్పరిల్లి ఇదంతా శ్రీరంగేశుని మాయగా తలపోశారు. అయినా పుత్రికా మమకారంతో–

'రంగేశా! ఇది తగునా! నీవు కీర్తివంతుడవుకదా! ఈలా నా కూతుర్ని దొంగలించడం న్యాయమా? ఇదేమయినా గొల్లఇండ్ల వెన్న అనుకొన్నావా? లేదా రాక్షసవివాహంతో అపహరించే రాజకన్య లనుకొన్నావా? అయినా ఈ దొంగతనం వెన్న దొంగిలించిన కాలంనాటి నుండి నీకు తెలిసిన విద్యే కదా! నా కుమార్తె నీకు ఇష్టమయితే మా ఇంటికి వచ్చి చుట్టరికం బలపడేలా సేసలు చల్లి నీవు మొరబెట్టుకోవాలి గాని జగదేకసాక్షివై, సర్వనాయకుడవై నీవే ఇలా అన్యాయం చేయవచ్చా? నీవే ఇలా చేస్తే ఇతరులను వారించడం సాధ్యమా? అంటూ శ్రీరంగనాయకులసన్నిధిలో కన్నీరుమున్నీరుగా ఏడ్చారు. అపుడు రంగనాథుని ఆనతో గోదాదేవి స్వామి వామభాగం నుండి మేఘాలమధ్య మెఱుపులాగా మెరుస్తూ కనబడి–

"అన్న! ఎందుకు హడలిపడుతున్నావు. ఇక్కడే ఉన్నా. నా వైపుచూడు నాన్నా' అంది.

విష్ణుచిత్తులవారు ఆలాగే చూశారు. అపుడు రంగపతి–

'హరిచిత్తా విష్ణుచిత్తా! నీవు చెప్పినట్లే మీ పురానికి గరుడారూఢునిగా వస్తాను. సకలసన్నాహాలమధ్య నీ కుమార్తె గోదాదేవిని దేవతలు, అచ్చరలు విస్తుపోయేలా తప్పక వరిస్తా. చింత మాను. నీ కూతురితో ప్రస్తుతం నీ పట్టణానికి వెళ్ళు' అన్నాడు.

విష్ణుచిత్తుడు ఆలాగే గోదతో శ్రీవిల్లిపుత్తూరు వెనుతిరిగారు. రంగనాథుని ఆదేశం మేరకు తదనంతరం విష్ణుచిత్తులు మధురాధిపతి వల్లభదేవుని తనకడకు రప్పించుకొన్నారు.

'ప్రభూ! నా కూతురు గోదాదేవిని శ్రీరంగవిభుడు పెళ్ళాడతానని వాగ్దానం చేశాడు. పెళ్ళికి అవసరమయిన అన్నీ సిద్ధం చేయవయ్యా అంటే రాజు 'ఆహా! నా భాగ్యమే భాగ్యమంటూ సకలసన్నాహాలు చేయడానికి శ్రీకారం చుట్టారు.

కనకరత్నాదివస్తువులతో ముగ్గులు పెట్టించాడు. బంగారు అరటిచెట్లను ఊరంతా కట్టించాడు. సకలసంపదలతో విరాజిల్లువిధంగా పట్టణాన్ని శోభాయమానంచేసి భట్టనాథులకు తన ఏర్పాట్లను వివరించాడు.

శ్రీరంగనాథుడు విష్ణుచిత్తులకు వాగ్దానం చేసినట్టుగానే గోదాదేవిని పెళ్ళాడడానికోసం శ్రీరంగంనుండి పయనమయ్యాడు. తానే 'వటపత్రశాయి' అయినవాడు, తానే శ్రీ వేంకటరమణుడయిన రంగవిభుడు గరుడవాహనమెక్కాడు. స్వామి కదులుతుంటే నిత్యులు, ముక్తులు అనుసరించారు. పడగల మీది మణులు జిగేలుమని ప్రకాశిస్తుంటే ఆదిశేషుడు ముత్యాల గొడుగుపట్టాడు. వాయుదేవుడు, వరుణుడు చెరోవైపు వింజామరలతో నడిచారు. ప్రచండుడయిన సూర్యుడు చల్లని కిరణాలవాడై విసనకర్రలతో కదిలాడు. పరమశివుడు, దేవేంద్రుడు చేత 'బెత్తాలు' పట్టి సమస్తం స్వయంగా సాగేలా జాగ్రత్తపడుతూ వెడుతున్నారు. కిన్నెరాధిపతి 'తాంబూల కరండకం' చేతబట్టి స్వామి ఆనకోసం ఎదురుచూస్తూ జాగ్రత్తగా కదలుతున్నాడు. వందిమాగధులు కైవారం చేస్తుంటే, దేవగణమంతా సేవిస్తుంటే శ్రీరంగనాథుడు విల్లిపుత్తూరు చేరుకొన్నారు.

పెళ్ళివారిని చూచి విష్ణుచిత్తుడు స్వామికి 'ఎదుర్కోలు' మర్యాద చేశాడు. స్వామి పాదాలకు నమస్కరించాడు. సకలోపచారాలు చేసి తన ఇంటికి వారిని నడిపించాడు. స్వగృహంలో వారికి వివాహోచితమైన మర్యాదలన్నీ చేశాడు.

(ఇంకా ఉంది)

మహామణిమండపశోభితుడు!!

– డా॥ రేవూరు అనంతపద్మనాభరావు

కట్టెదుట వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ

– అని అన్నమయ్య ప్రస్తుతించిన తిరుమలఆలయంలో వెలసిన వివిధమండపాల శోభను పరిశీలిస్తే స్వామివారికి వివిధములైన ఉత్సవసందర్భాల్లో అవి ఎలా ఉపయుక్తమౌతున్నాయో విశదమౌతుంది.

ప్రతిమామండపంలో....

మహాద్వారంనుండి లోపలికి ప్రవేశించగానే 16స్తంభాలతో కృష్ణదేవరాయమండపం(ప్రతిమామండపం) విజయనగర శిల్పసంప్రదాయం ఉట్టిపడేలా ఉంటుంది. ఈ మండపంలో దక్షిణభాగాన కృష్ణదేవరాయలు, ఆయన దేవేరులు, తిరుమలదేవి–చిన్నాదేవి అంజలి ఘటిస్తున్నట్లున్న నిలువెత్తు రాగివిగ్రహాలు కన్పిస్తాయి. మలయప్పస్వామి తిరుమల మాడవీథుల్లో సంచరించి లోపలికి వచ్చి ఈ ప్రతిమామండపంలోనే కొంతసేపు విశ్రమిస్తారు. ఇక్కడే ఆచార్యపురుషులు దివ్యప్రబంధగానం చేస్తారు.

అద్దాలమండపంలో...

ప్రతిమామండపానికి ఉత్తరదిక్కున ఎత్తైనప్రదేశంలో అద్దాలమండపం (అయినామహల్) ఉంది. అందులో డోలోత్సవానికిగాను గొలుసులు వేలాడదీయబడి ఉన్నాయి. ఊయలలో ఊగేటప్పుడు స్వామివారు అద్దాలలో అన్నివైపులా ప్రతిబింబిస్తారు. ఇక్కడ నిత్యం డోలోత్సవం జరుగుతుంది. క్రీ.శ.1831 నాటికే ఈ మండపముంది.

రంగమండపంలో.....

రంగమండపమనబడే రంగనాయకమండపం అద్దాల మండపానికి ఎదురుగా ఎత్తైన రాతిస్తంభాలతో ఉంది. క్రీ.శ. 1320–60 మధ్య శ్రీరంగనాథుని ఉత్సవమూర్తులు ఈ మండపంలో రక్షింపబడి పూజలందుకొన్నారు. ప్రస్తుతం దీన్ని వాహనమండపంగా ఉపయోగిస్తున్నారు. బ్రహ్మోత్సవసమయాల్లో స్వామివారు ఇక్కడే పూజానైవేద్యాలు అందుకొంటారు. ఒకప్పుడు నిత్యకల్యాణోత్సవాలు ఇక్కడే జరిగేవి. ప్రముఖులకు వేదపండితుల ఆశీర్వచనాలు కూడా ఇక్కడే ఇస్తారు. పట్టపువాహనమైన బంగారుశేషుడు చుట్టచుట్టుకొని ఇక్కడ దర్శనమిస్తాడు.

తిరుమలరాయమండపంలో.....

రంగమండపాన్ని ఆనుకొని ఉన్న ధ్వజస్తంభమండపానికి 10అడుగులదూరంలో తిరుమలరాయమండపం నెలకొని ఉంది. క్రీ.శ.1473లో సాళువనరసింహరాయలు ఈ మండపం ప్రతిష్ఠించారు. ఇక్కడ హంసతూలికాతల్పంలో స్వామివారు ఉభయనాంచారులతో ఊగుతారు. 16వశతాబ్దంలో తిరుమలరాయలు దీనిని విస్తరింపజేసి ఏటా వసంతోత్సవం జరిపే ఏర్పాటుచేశాడు. బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణవేళ స్వామివారు ఈ మండపంలోకి వేంచేస్తారు.

ధ్వజస్తంభమండపంలో...

ఈ మండపాన్ని 15వశతాబ్దంలో నిర్మించారు. బ్రహ్మోత్సవాల ఆరంభంలో ధ్వజారోహణం బంగారు ధ్వజస్తంభంపై గరుడాళ్వారు ధ్వజపటం ఎగురవేయడంతో జరుగుతుంది.



వదలక వలసిన వారికి వరములు ఎదురెదురైతానిచ్చును
నిదురలేక పెనునిధానమై కదలడదె గరుడ గంభముకాడ

– అంటాడు అన్నమయ్య.

నాలుగుకాళ్లమండపంలో...

తిరుమలరాయమండపానికి పడమరగా సంపంగి ప్రదక్షిణలో ఆగ్నేయమూలగా నాలుగుకాళ్లమండపాలున్నాయి. పూర్వము స్వామివారు ఇక్కడికే వేంచేసేవారు. క్రీ.శ. 1470లో సాళువనరసింహరాయలు తన కుటుంబసభ్యులపేర దీనిని నిర్మించాడు. 'ఉట్లపండుగ' నాడు కృష్ణస్వామి ఇక్కడ వేంచేపు చేసి పూజలందుకొంటాడు. దీనినే 'శిక్యోత్సవ'మంటారు.

ఎక్కెను శ్రీవేంకటాద్రి ఇదివో మన కృష్ణుడు
చక్కనాయ, పనులెల్లా చాలించిరారో

అంటాడు అన్నమయ్య.

కల్యాణమండపంలో...

సంపంగిప్రదక్షిణకు దక్షిణంవైపున దీర్ఘచతురస్రాకారంలో నిత్యకల్యాణం పచ్చతోరణానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది శ్రీవేంకటరమణస్వామి కల్యాణమండపం. ఇక్కడే రోజూ ఆర్జితసేవలకింద మధ్యాహ్నం 12గంటలనుండి కల్యాణోత్సవం జరుపుతారు. కొన్నేళ్లక్రితం ఇది రంగమండపంలో జరిగేది. పవిత్రోత్సవం, పుష్పయాగం, జ్యేష్ఠాభిషేకం కూడా ఇక్కడే ఏటా జరుపుతారు.

మహామణిమండపంలో...

ఆనందనిలయంలోకి ప్రవేశించగానే మహామణి మండపం బంగారువాకిలికి గరుడమందిరానికి మధ్య ఉంది. దీనినే ఘంటామండపం, ముఖమండపం అని కూడా పిలుస్తారు. ఇక్కడ నాలుగువరుసల్లో 16 స్తంభాలున్నాయి. క్రీ.శ. 1417లో విజయనగరసామ్రాజ్యమంత్రి–మల్లన దీనిని నిర్మించారు. ఈ స్తంభాలపై వరాహస్వామి, నృసింహస్వామి, మహావిష్ణువు, వేంకటేశ్వరస్వామి, వరదరాజస్వామి శిల్పాకృతులు దర్శనమిస్తాయి.

ఈ మండపంలో నిత్యం ప్రాతఃకాలాన మూడు గంటలవేళ సుప్రభాతపఠనం చేస్తారు. కొలువు, పంచాంగ శ్రవణం, ఆదాయవ్యయనివేదన ఇక్కడే చేస్తారు. బుధవారం ఉదయం సహస్రకలశాభిషేకం, గురువారం అన్నకూటోత్సవం (తిరుప్పావడ) జరుపుతారు. ఇది స్వామివారి ఆస్థానమండపం.

ఈ మండపానికి (బంగారువాకిలికి) దక్షిణాన రెండు పెద్దగంటలు చెక్కదూలానికి – పెద్ద ఇనుపగొలుసులతో వ్రేలాడదీయబడి ఉంటాయి. స్వామివారికి నివేదనసమయంలో వీటిని మోగిస్తారు. ఇదే ఘంటామండపం. దీనినే తిరుమామణి మండపం అని కూడా పిలుస్తారు. తమిళంలో 'మణి' అంటే గంట అని అర్థం.

స్నపనమండపంలో...

బంగారువాకిలి లోపల చతురస్రాకారంలో కనిపించేదే స్నపనమండపం. నాలుగుస్తంభాలపై బాలకృష్ణుడు, యోగనరసింహుడు, శ్రీకృష్ణుని కాళీయమర్దనులు చెక్కబడ్డాయి. దీనిని తమిళంలో తిరువిలాన్‌కోయిల్ అంటారు. క్రీ.శ. 614లో పల్లవ రాణి సమవాయి (పెరుందేవి) వెండి భోగశ్రీనివాసమూర్తిని బహూకరించి ఈ మండపంలో అభిషేకాదులు జరిగేలా కట్టడి చేసింది. ప్రస్తుతం ఏ విధమైన అభిషేకాదులు లేవు ఇక్కడ.

శయనమండపంలో...

రాములవారి మేడ దాటగానే కన్పించేదే శయన మండపం. ఇక్కడ రోజూ రాత్రివేళ భోగశ్రీనివాసమూర్తికి ఏకాంతసేవ జరుపుతారు. వెండిగొలుసులతోనున్న బంగారు పట్టె మంచంపై స్వామివారిని పరుండజేస్తారు. అన్నమయ్య వంశీకుడు అన్నమయ్యలాలి పాడుతారు. సుప్రభాతం తర్వాత తోమాల సేవలసమయంలో దివ్యప్రబంధగానాన్ని చేస్తారు. సహస్రనామ పఠనం, వేదపఠనం ఇక్కడే జరుగుతాయి. ఆర్జిత సేవాభక్తులు ఇక్కడ కూర్చొని స్వామిని వీక్షిస్తారు.

వెండివాకిలికి దక్షిణదిశలో అంకురార్పణమండపం, పరకామణిమండపం ఉన్నాయి. విమానవేంకటేశ్వరుని దర్శించి, హుండీలో కానుకలు సమర్పించి రాగానే యోగనారసింహుని ప్రదక్షిణమండపం కన్పిస్తుంది.

అంకురార్పణమండపంలో బ్రహ్మోత్సవాలకు ముందు బీజావాపం అనే వైదికప్రక్రియ జరుగుతుంది. ఈ మండపాలకు తోడుగా గొల్లమండపం, పారువేటమండపం, (గతంలో వేయికాళ్లమండపం), ఆస్థానమండపం, సహస్రదీపాలంకరణ సేవాకొలువుమండపం, వసంతోత్సవమండపం, వాహన మండపం, నాదనీరాజనమండపం తిరుమలకు విచ్చేసిన భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఇనుమడింపజేస్తాయి. వివిధ మండపశోభితుడైన శ్రీనివాసుని దర్శించి తరిద్దాం.

భక్తులబ్రోవుమా.....
పుణ్యనదీమతల్లీ...!!

12-09-2017 నుంచి 23-09-2017వరకు
కావేరీ పుష్కరాల సందర్భంగా....

-డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

కావేరీ! మధురాంబుదాయిని! ధునీ! గంభీరసంచారిణీ!
లావణ్యాంగి! తరంగ రాగ హృదయోల్లాసాను సంధాయినీ!
కైవల్యామృత వర్షిణీ! సుగుణ సంఘాతాంతరంగా! కృపా
భావైకాద్భుత దివ్యమూర్తి! జననీ! పాథోధిభామామణీ!

పుణ్యనదీమతల్లి అయిన కావేరి గంగాదిమాతల వలె విశ్వానికి తల్లిగా సమస్త జీవరాశుల పాపాలను హరిస్తోంది.

జీవనదిగా ప్రఖ్యాతి వహించిన కావేరీనది సకలవరప్రదాయిని. దక్షిణభారతదేశంలో రెండురాష్ట్రాలను పునీతం చేస్తూ, సస్యశ్యామలం చేసిన నదీలలామ కావేరి.



ప్రజోపకారిణిగా

పవిత్రనదీజలాలు అమృతమయాలు కావడంతో సమస్త జీవ రాశికి ప్రాణశక్తిని ప్రసాదిస్తాయి. నదీప్రవాహవేగంవల్ల ఓషధీలతలు జలంలో విలీనమై రోగనివారకాలౌతాయి. పుణ్యనదీ జలస్పర్శచేత మనోవాక్కాయకర్మలు పవిత్రమై మానవుని సన్మార్గప్రవర్తకుని చేస్తాయి. విద్యుత్తును సృజించేశక్తి ఉండటంతో కావేరీనది అనేకవిధాలుగా ప్రజోప కారిణిగా కన్నడ, తమిళదేశాలను సుసంపన్నం చేస్తోంది.

తండ్రికే మోక్షాన్ని ప్రసాదించిన కావేరి

కవేరుడనే రాజర్షికి పుత్రికగా బ్రహ్మచేత ప్రసాదింపబడిన విష్ణుమాయే 'కావేరి' అయింది. పరమపవిత్ర జలరూపిణి, పుణ్యప్రదాయిని కనుకనే - కావేరీమాతను స్మరిస్తూ భగవంతునికి సమర్పించే షోడశోపచారాలకు కావలసిన కలశజలంలో కావేరీజలాన్ని కూడా ప్రవేశపెట్టమని ప్రార్థిస్తారు.

కావేరీ కన్య అసలుపేరు- లోపాముద్ర. ఈమె మంత్రద్రష్ట. కావేరి మరో విశేషగుణం ఏమిటంటే - తండ్రి ఐన కవేరుడికి మోక్షాన్ని కలిగించడానికి-ఆమె విష్ణుమూర్తిని గూర్చి ఘోరతపస్సు చేయటం. శ్రీమన్నారాయణుని వరప్రభావంగా కావేరి-ఒక అంశతో-లోపాముద్రగా, మరో అంశతో-నదిగా వెలసింది. అగస్త్యమహర్షిని వివాహ మాడగానే లోపాముద్ర నదిగా మారిపోయింది. ఆ తపోధను డామెను తన కమండలంలో నిల్పుకొని సహ్యపర్వతసమీపంలో నివసించ సాగాడు. కొంతకాలం గడచిన తర్వాత అగస్త్యుడు-కమండలాన్ని శిష్యుల కిచ్చి దూరంగా ఉన్న వింధ్యపర్వతంవద్దకు వెళ్లాడు. అగస్త్యుడు దగ్గర లేకపోవడంతో లోపాముద్ర మానవరూపాన్నివదలి కావేరీనదిగా మారి పోయింది. అగస్త్యుడు ప్రక్కన ఉన్నంతవరకే ఆమె మానవకాంత. ఆయన దూరమైతే నేను నదిగా మారిపోతానని ముందే ఆయనతో ఒడంబడిక చేసుకొంది. ఆ కారణంతో కావేరి నదిగా, జలరూపంతో బ్రహ్మగిరి నుంచి ప్రవహించసాగింది. కావేరి పుట్టినస్థలం-'తలక్కావేరి'.



తండ్రి ఐన కవేరమహర్షి ఈ పుణ్యజలాల్లో స్నానమాచరించి అప్పటికప్పుడే మోక్షాన్ని పొందాడు. తనయగా తండ్రికి ముక్తిని ప్రసాదించిన మహామహిమాన్విత-కావేరి. కావేరి-దక్షిణగంగగా పిలవబడటం ఆమె పవిత్రతకు నిదర్శనం. తలక్కావేరిలో కావేరీ మాతకు పెద్దవిగ్రహం కట్టించారు భక్తులు.

కావేరినదీతీరప్రాంతవిస్తరణలో...

తపోధని అయిన కావేరి అనేకానేకప్రాంతాల్లో ప్రవహిస్తూ, భూమిలో బంగారుపంటలు పండటానికి కారణభూతురాలౌతూ, తనలో మునిగినవారి పాపాలను పరిహరిస్తూ, పుణ్యాన్ని ప్రసాదిస్తూ, జీవనాధారమై, ముక్తినిచ్చే దేవతా మూర్తిగా అందరి పూజలూ అందుకుంటోంది. సముద్ర మట్టానికి 1320 మీటర్ల ఎత్తునుంచి, సహ్యాద్రిశ్రేణుల్లోని బ్రహ్మగిరినుంచి ప్రవహించటం మొదలుపెట్టిన కావేరి 90 కి.మీ. పర్వత సానువుల మధ్య ప్రవహించటం ఒక విశేషం. మొదటగా కావేరి 'శివసముద్రం' వద్ద పల్లంవైపు దూకడంతో- అక్కడ సుప్రసిద్ధ జలపాతం ఏర్పడింది. దానిపేరే 'శివసముద్ర జలపాతం'. శివసముద్రంవద్ద కావేరి రెండుగా చీలి వేరువేరు జలపాతాలుగా కొండపైనుంచి క్రిందకు చేరుతుంది. వాటిని పరచుక్కి, గగనచుక్కి అంటారు. భారతదేశంలోని పెద్దనదుల్లో కావేరికూడా ఒకటి. మనదేశంలో ప్రవహిస్తున్న పన్నెండు పుణ్యనదుల్లో ఏడవదైన కావేరీనదికి పుష్కరాలు వచ్చే సమయం ఆసన్నమైంది.

బ్రహ్మదేవుని నియమం

తుందిలమహర్షి ఘోరమైన తపస్సుచేసి, శివుని మెప్పించి, పరమేశ్వరుని అష్టరూపాల్లోని 'జల'రూపాన్ని వరంగా పొందాడు. జలాధిదేవుడిగా, పుష్కరుడిగా, మూడున్నరకోట్ల పుణ్యతీర్థాలకు అధిపతిగా శివానుగ్రహాన్ని పొందినా, సృష్టి కార్యానికి బ్రహ్మదేవుడు పరమశివుని ప్రార్థించడంతో - విధాత కమండలంలో పుష్కరుడు నివాసం ఏర్పరచుకొన్నాడు. పుష్కరునిసహాయంతో బ్రహ్మ సృష్టిని నిర్వహిస్తుండగా కొంతకాలం గడిచింది. దేవతల గురువైన బృహస్పతికి కూడా జలం కావలసి వచ్చింది. బృహస్పతి బ్రహ్మనుగూర్చి తపస్సు చేసి, పుష్కరుని తనకిమ్మని వేడుకొన్నాడు. దానికి పుష్కరుడు అంగీకరించక పోవటంతో బ్రహ్మదేవుడు ఒక నియమాన్ని విధించాడు. 'గురువు మేషాదిరాశుల్లో ప్రవేశించినప్పుడు పుష్కరుడు మొదటి పన్నెండురోజులు గురువుతో కలిసి ఆ రాశిలో ఉండాలి. దానిని 'ఆదిపుష్కర'మంటారు. అలాగే గురువు ఆ రాశినుంచి నిష్క్రమించే సమయంలో చివరి పన్నెండురోజులు పుష్కరుడు గురువుతో కలిసి ఉండాలి. సంవత్సరం మధ్యకాలంలో- నాలుగుగడియల కాలం పుష్కరుడు బృహస్పతితో కలసి ఉండాలి. ఈ మూడు కాలాలలోను బ్రహ్మ సమస్తదేవతాగణంతో, పితృదేవతలతో కూడి పుష్కరునివద్దే ఉంటాడు. ఈ నియమానికి పుష్కరుడు, గురువు ఇద్దరూ అంగీకరించారు. ఆ విధంగా పవిత్రనదులుగా పేరొందిన పన్నెండునదులకు, పన్నెండుసంవత్సరాల కొకసారి పుష్కరాలు వస్తాయి. గురువు ఒక్కొక్కరాశిలో ఒక్కొక్కసంవత్సరం





రంగరంగరంగపతీ రంగనాథా....

కావేరీప్రవాహంలో మూడుదీవులేర్పడటం, ఆయాప్రదేశాల్లో విష్ణుమూర్తి శేషశయనుడిగా దర్శనమివ్వడం విశిష్టవిషయాలు. వాటినే ఆదిరంగం, మధ్యరంగం, అంత్యరంగంగా పేర్కొంటారు. కర్ణాటకలోని- శ్రీరంగపట్టణం ఆదిరంగక్షేత్రంగా విలసిల్లితే, శివసముద్రం వద్ద వెలసిన జగన్మోహన రంగనాథుని ఆలయం- మధ్యరంగక్షేత్రంగా దర్శనమిస్తుంది. ఇక తమిళనాడులోని సుప్రసిద్ధక్షేత్రమైన శ్రీరంగం- అంత్యరంగంగా ఖ్యాతికెక్కింది. ఆ పుణ్యనదీతీరంలో ఎన్నెన్నో ప్రసిద్ధ దేవాలయాలు వెలసి ఉండటం మరో ప్రత్యేకత. ఏ ఆలయంలో చూసినా శిల్పసంపద కనువిందు చేస్తుంటుంది. కావేరీనదిపాయలు కొన్ని కేరళరాష్ట్రంలోను, పాండిచ్చేరిలోను కనపడటం ఆయా ప్రదేశాలకే ప్రత్యేకతను కలగజేస్తోంది.

కస్తూరి రంగరంగా, మా తండ్రి కావేటి రంగరంగా, శ్రీరంగరంగరంగా, నినుబాసి నే ఎట్లు మరచి ఉందూ - కావేరీతీరాన పూజలందుకొంటున్న రంగనాథుడు కన్నడ తమిళ దేశీయులకే కాదు, తెలుగువారికి కూడా ఆరాధ్యదైవమే. తెలుగువారు నిత్యం పాడుకొనేపాటల్లో కావేటిరంగడు కొలువై ఉండటం - తెలుగువారి మహద్భాగ్యమనే చెప్పకోవచ్చు.

ఉంటాడు. కనుక ఏ రాశికైనా మళ్లీ ఆయన తిరిగి రావాలంటే పన్నెండుసంవత్సరాలకాలం పడుతుంది. అందుకే పుష్కరాలు పన్నెండుసంవత్సరాలకొకసారి వస్తాయి.

ఈ గడియల్లోనే పుష్కరాలు

జలాధిదేవుడైన పుష్కరుడు నదిని పరమపవిత్రం చేయ గల శక్తిమంతుడు. అందుకే పుష్కరకాలంలో నదీజలాలు అతి పవిత్రంగాను, పుణ్యప్రదాలుగాను ఉంటాయి. "కావేర్యాంచ తులాగతే" అన్నట్లు గురువు తులారాశిలో ప్రవేశించినప్పుడు- పుష్కరుడు కూడా గురువుతో కలిసి ఉండటంతో, కావేరీనదికి పుష్కరాలు వస్తాయి. అప్పుడు త్రిమూర్తులు, తక్కిన దేవతలు అందరూ కావేరీతీరంలోనే ఉంటారు. ఈ సంవత్సరంలో - అంటే హేమలంబినామసంవత్సరం-భాద్రపదమాసం-కృష్ణపక్షం- సప్తమీతిథి-మంగళవారం- ఉ.6గంటల- పైబై ఒక్కనిముషాలు (12-09-2017)- సార్ధత్రికోటీ తీర్థ సహిత కావేరీపుష్కర ప్రవేశ సమయం. మూడున్నరకోట్ల పవిత్రతీర్థాలతో కూడిన కావేరీనదికి పుష్కరాలు ప్రారంభమౌతాయి. ఆ నదీజలాల మహిమ అంతా ఇంతా కాదు. గంగానది అంతర్వాహినిగా వచ్చి కావేరిలో చేరటంవల్ల కావేరి పావిత్ర్యం మరింత పెరుగుతోంది.

నదీస్నానదానఫలమేమంటే....

12-09-2017నుంచి 23-09-2017వరకు పుష్కరకాలం ఉండటంతో ఆ పన్నెండురోజుల్లో కావేరీ జలాన్ని పానంచేసినా, ఆ నదిలో స్నానంచేసినా సమస్త పాపాలు వైదొలగి వ్యాధిరహితులౌతారు. కుష్ఠ మొదలైన రోగాలను పోగొట్టే కావేరి ఎంత మహిమాన్వితమైనదో గదా!

పుష్కరకాలంలో స్నానం చేసినంతమాత్రంచేతనే పుట్టిననాటినుంచి చేసిన పాపాలనన్నింటినీ మానవులు పోగొట్టుకోగలుగుతారు. అంతేకాదు. శరీరానికి తేజస్సు కలుగుతుంది. కావేరీజలాన్ని పానం చేస్తే - వందయజ్ఞాలు చేసిన పుణ్యఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

పుష్కరసమయంలో దానధర్మాలుచేసినా, పితృ కార్యాలు నిర్వహించినా, జపానుష్ఠానాలు ఆచరించినా కోటి రెట్లఫలం లభిస్తుందన్నది ఆర్యోక్తి. పుష్కరస్నానం గ్రహదోషా లను పోగొట్టి సకలశుభాలనిస్తుందన్నది పుష్కరునిమహిమకు మరో తార్కాణం.

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు
2017 సెప్టెంబరు 23 నుండి అక్టోబరు 01 వరకు

ఆత్మానాత్మ వివేకం కలవానికి భగవదనుగ్రహం
సంపూర్ణంగా కల్గుతుంది.
భగవానుడు అట్టివారినే పరిగ్రహిస్తాడు.



24-09-2017 ఆదివారం
రాత్రి: హంసవాహనం

ధర్మరక్షణకై నృసింహరూప
స్వామి సింహాన్ని అధిష్ఠించి
రావడం-దుష్టజనశిక్షణకు,
శిష్టజనరక్షణకు సంకేతం.



25-09-2017 సోమవారం
పగలు: సింహవాహనం



25-09-2017 సోమవారం
రాత్రి: ముత్యపుపందిరివాహనం

చక్కటి ముత్యాలు చలువదనానికి ప్రతీకలు.
లోకాలనేలే చల్లనితండ్రికి
ముత్యాలపందిరి వాహనం కావడం విశేషమే!



26-09-2017 మంగళవారం
పగలు: కల్పవృక్షవాహనం

కామితఫలాలనిచ్చేది కల్పవృక్షం.
కామితార్థాలు నెరవేర్చే స్వామికి
వాహనంగా అమరడం అపూర్వం.



26-09-2017 మంగళవారం
రాత్రి: సర్వభూపాలవాహనం

రాజులందరూ అంతో ఇంతో భగవదంశలే.
వారు అంశలైతే, స్వామి అంశి.
అందుకే సర్వభూపాలురూ భగవంతుణ్ణి
తమ భుజస్కంధాలపై నుంచుకొని ఊరేగిస్తారు.



27-09-2017 బుధవారం
పగలు: పల్లకీలో
మోహినీఅవతారోత్సవం

జగత్తు అంతా మాయామోహానికి లొంగి ఉన్నది.
తనకు ప్రసన్నులైనవారు మాయను సులభంగా
దాటగలరనేదే ఈ మోహినీఅవతార పరమార్థం.

గరుత్మంతుడే
శ్రీమహావిష్ణువుకు
నిత్యవాహనం.
అందువల్ల గరుడోత్సవానికి
ఇతర ఉత్సవాలకన్నా
ఎక్కువ ప్రాముఖ్యత ఉంది.



27-09-2017 బుధవారం
రాత్రి: గరుడవాహనం

హనుమంతుడు భగవద్భక్తుల్లో అగ్రగణ్యుడు. శ్రీవైష్ణవసంప్రదాయంలో గరుడసేవను పెరియతిరువడిగా, హనుమద్వాహనసేవను సెరియతిరువడిగా కీర్తిస్తారు.

28-09-2017
గురువారం
పగలు:
హనుమద్వాహనం





గజవాహనం అనాదినుండి ప్రసిద్ధమే. శరణాగతిప్రక్రియలో గజేంద్రునికున్న ప్రాధాన్యం అనన్యసామాన్యమైనది.

28-09-2017 గురువారం
రాత్రి:
గజవాహనం



29-09-2017
శుక్రవారం
పగలు:
సూర్యప్రభవాహనం

సూర్యుడు కర్మసాక్షి, ప్రత్యక్షదైవం.
ఆ సూర్యునిప్రభ వెలుగులీనుతూ
వేంకటేశ్వరునిముందుకు నడపటం ముదావహం.

గీతాచార్యుడు "నక్షత్రాణాం అహం శశీ" అంటూ
తాను చుక్కల్లో చంద్రుడనన్నాడు.
ఓషధీశుడైన చంద్రుడు మనకూ పోషకుడే.

29-09-2017
శుక్రవారం
రాత్రి:
చంద్రప్రభవాహనం



నవరాత్రోత్సవాల్లో దేవీపూజలు

- శ్రీమతి పల్లం పద్మావతి

ఆశ్వయుజమాసం మొదటిరోజైన పాడ్యమిరోజు నుండి తొమ్మిదిరోజులపాటు దేవీనవరాత్రోత్సవాలు జరపడం ఆనవాయితీ. జగన్మాతయైన శ్రీదేవిఅమ్మవారు లోకకంటకుడైన మహిషాసురుణ్ణి వధించడంకోసం అతనితో తొమ్మిదిరోజులపాటు యుద్ధంచేసి అతడిని సంహరించింది. అందుకే ఆ తొమ్మిదిరోజులూ నవ రాత్రులపేరుతో దేవీపూజలు జరుగుతాయి.

స్త్రీమూర్తిచేతిలోనే మరణం

మహిషాసురుడు రంభుడను రాక్షసుని కుమారుడు. ఇతను బ్రహ్మకై తపస్సుచేసి స్త్రీచేతిలో తప్ప తనకు చావు లేకుండా వరం పొందాడు. ఆ వరబలగర్వంతో స్వర్గంపై దాడిచేసి దేవేంద్రుణ్ణి, దేవగణాలను స్థాన భ్రష్టులను చేశాడు. ఇంద్రసింహాసనం ఆక్రమించాడు.


దాంతో దేవతలందరూ బ్రహ్మరుద్రులతో కలసి వైకుంఠం వెళ్లి నారాయణుడితో తమగోడు వెళ్లబోసుకున్నారు. అప్పుడు శ్రీహరి ఆ మహిషుడు స్త్రీమూర్తి చేతిలో మాత్రమే మరణిస్తాడు. కాబట్టి మనం మనందరి దివ్యశక్తులతో ఒక మహాశక్తివంతురాలైన స్త్రీమూర్తిని సృష్టించి, ఆమెకు మనందరి ఆయుధాలను సమర్పించినట్లయితే ఆమె మహిషాసురుణ్ణి వధిస్తుందన్నాడు.

ఆమేరకు తమదివ్యశక్తులతో అమితశక్తివంతురాలైన స్త్రీమూర్తిని రూపొందించారు. అప్పుడు బ్రహ్మముఖంనుంచి రజోగుణంతో కూడిన తేజోవంతురాలు, శివుడిముఖంనుండి తమోగుణంతో ఒక స్త్రీమూర్తి, విష్ణువుముఖంనుండి సత్త్వగుణసంపన్నురాలైన మరో స్త్రీమూర్తీ ఆవిర్భవించారు. అలాగే ఇంద్ర, వరుణ, కుబేరాదులనుంచి కూడా తేజస్సులు వెలువడ్డాయి. ఈ అన్నితేజస్సులతో ఒక స్త్రీమూర్తి సహస్రబాహువులతో ఆవిర్భవించింది.

త్రిమూర్తులతోపాటు దేవతలందరుకూడా వారి వారి ఆయుధాల నుండి వాటి ప్రతిరూపాలను సృష్టించి ఆ దేవికి సమర్పించారు. అలాగే ఆ శ్రీదేవికి దేవతలందరూ దివ్యవస్త్రాలను, దివ్యాభరణాలను సమర్పించారు.

ఆ శ్రీదేవి తాను మహిషాసురుణ్ణి వధించి దేవతలను రక్షిస్తానని వారికి అభయమిచ్చింది.

ఆ శ్రీదేవిసౌందర్యాన్ని గురించి దూతలద్వారా తెలుసుకున్న మహిషుడు ఆ దేవిని తన అర్ధాంగిని చేసుకుంటాను తీసుకురమ్మని తన దూతలను పంపాడు. ఆ దేవి మహిషుణ్ణి చంపుతానని సందేశం పంపింది.



బొమ్మలకొలువు

ఈ నవరాత్రుల్లో బొమ్మలకొలువు పెట్టడం కూడా ఆనవాయితీగా ఉంది. ఐదు లేదా తొమ్మిదిమెట్లుగా పీఠం ఏర్పరచి ఆ మెట్లమీద వరుసక్రమంలో బొమ్మలను అమర్చుతారు. పై మెట్టుమీద మధ్యలో శ్రీదేవీప్రతిమ, ఆ దేవికి ఇరువైపులా ఇతరదేవతలప్రతిమలు; తర్వాత మెట్టుమీద పక్షులబొమ్మలు; తర్వాత మెట్టుమీద మనుషులబొమ్మలు; తర్వాత మెట్టుమీద జంతువులు, చెట్లు, ఉద్యానవనాలు మొదలైన బొమ్మలు; తర్వాత మెట్టుమీద జలచరాలు మొదలైనవి ఇలా వరుస క్రమంలో అమరుస్తారు.



ప్రతిరోజూ ఆ పీఠంపై కొలువుదీరిన దేవితో పాటు ఇతరదేవతల ప్రతిమలను కూడా పుష్పాలతో అలంకరించి, రోజుకొక రకం నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ముత్తైదువులను పిలిచి వారికి తాంబూలాదులను ఇస్తారు. దేవీకథలను పారాయణ చేస్తారు. ఇలా చేయడంవల్ల సకలపాపాలు తొలగి కామితార్థాలు నెరవేరుతాయి. సుఖసంతోషాలు చేకూరుతాయి.

ఈ విధంగా ఈ దేవీనవరాత్రుల్లో శ్రీదేవిని నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకలదోషాలు, బాధలు తొలగి ఆయురారోగ్య ఐశ్వర్యానందాభివృద్ధిని పొందుతారు.

అలా శ్రీదేవికి మహిషునికి మధ్య తొమ్మిదిరోజుల పాటు జరిగిన యుద్ధంలో మహిషుడు మరణించాడు.

తొమ్మిదిరోజుల యుద్ధానికి గుర్తుగా తొమ్మిదిరోజుల పాటు నవరాత్రోత్సవాలను, అలాగే ఆ దేవి విజయానికి గుర్తుగా దశమిరోజు విజయదశమి పండుగను ఆనందోత్సాహాలతో, భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

ఆధ్యాత్మిక, సాంస్కృతికకార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. దేవీకథలను ప్రవచనాలుగా చెప్తారు. ఈ నవరాత్రుల్లో స్త్రీలు తమ తమ గృహాల్లో ప్రత్యేకంగా, పవిత్రంగా, భక్తిశ్రద్ధలతో దేవిని పూజిస్తారు.

ఈ దేవీనవరాత్రోత్సవాల్లో...
అమ్మవారిఆలయాల్లో దేవిని
ఒక్కోరోజు ఒక్కోవిధంగా అలంకరించి,
ఒక్కోరోజు ఒక్కో రకం నైవేద్యం సమర్పించి
ప్రత్యేకపూజలు చేస్తారు.

కుమారీపూజ

ఈ దేవీనవరాత్రుల్లో కుమారీపూజ చాల ముఖ్యమైనది. ఈ దేవీనవరాత్రిపూజలప్పుడు 2సం॥నుండి 10సం॥లమధ్య వయస్సులైన బాలికలను పూజించడం ఒక ముఖ్య విశేషం. 2-10సం॥లమధ్య వయస్సులైన బాలికల్లో రెండేళ్ల బాలికను కుమారి, మూడేళ్లబాలికను త్రిమూర్తి, నాలుగేళ్లబాలికను కల్యాణి, అయిదేళ్లబాలికను రోహిణి, ఆరేళ్లబాలికను కాళిక, ఏడేళ్లబాలికను చండిక, ఎనిమిదేళ్లబాలికను శాంభవి, తొమ్మిదేళ్ల బాలికను దుర్గ, పదేళ్లబాలికను సుభద్ర అనే పేర్లతో ఈ కుమారీ పూజలో వ్యవహరిస్తారు.

ఈ కుమారీపూజ చేయడంవల్ల కష్టాలు తొలగిపోతాయి. దీర్ఘాయువు, పుత్రపౌత్రాభివృద్ధి, విద్యాభివృద్ధి, రాజ్యలాభం, ఐశ్వర్యవృద్ధినిస్తుంది. పాపాల్ని పోగొట్టి పునీతుల్ని చేస్తుంది. రోగాలు తొలగిపోతాయి. శత్రువులు నశిస్తారు. అనుకున్న కోర్కెలు నెరవేరుతాయి. విజయం కల్గుతుంది. సుఖసంతోషాలతో వర్ధిల్లుతారు.

ఓం నమో వేంకటేశాయ

– శ్రీ బి.బాలక్రిష్ణసింగ్

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరుడు. ఈ స్వామి తిరుమలపై వెలసియున్నాడు. ఈ క్షేత్రంలో వెలసిన స్వామిని దర్శించి, తరించాలని ఎంతో భక్తిశ్రద్ధలతో దేశవిదేశాలనుండి సైతం ఎందరో భక్తులు నిత్యమూ వస్తూంటారు. ఆ క్రమంలో ఎంతో ఉరుకులు పరుగులతో వెళ్లడమే మనకు కనిపిస్తుంది. అలా బయలుదేరి స్వామిసన్నిధికి చేరుకుంటారు. ఆలయం ముందునుంచీ కూడా గోవిందా గోవిందా అంటూ భక్తుల గోవిందనామఘోషతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనిస్తుంటుంది. అలా వారు స్వామి గర్భగుడివద్దకు చేరుకుంటారు. ఆక్కడికెళ్లగానే చిత్రంగా అందరూ మంత్రముగ్ధులైనట్లు ఎంతో తన్మయత్వంతో స్వామినే తదేకంగా చూస్తూ తమను తాము మైమరచి పోతుంటారు. కారణం అక్కడ మనకు వినిపించేది ఒక అతీంద్రియమైన, మహత్తరమైన అలౌకిక స్థాయికి తీసుకెళ్ళే మంత్రమని వేరే చెప్పక్కరలేదు. ఆ మంత్రం అత్యంత మహిమాన్వితమైనది. అదే 'ఓం నమో వేంకటేశాయ' అనే మంత్రం. ఈ మంత్రమే నిత్యమూ స్వామిఆలయంలో ప్రతిధ్వనిస్తూంటుంది. ఆ మంత్రం గురించి కొంత తెలుసుకుందాం.... ఆ కోవలో త్రేతాయుగంలో అష్టాక్షరీమహామంత్రప్రభావంతోనే రామావిర్భావం జరిగిందనే విషయం తెలుసుకుందాం.

త్రేతాయుగంలో శ్రీరాములవారు ఉద్భవించిన తరువాత 'నారాయణాష్టాక్షరి' మంత్రంలో ఉన్న 'రా', 'నమశ్శివాయపంచాక్షరి' మంత్రంలో ఉన్న 'మ' రెండూ కలిపి 'రామ' అనే మంత్రం ఆవిర్భవించింది. ప్రతి మంత్రంలోను 'ఓం' అనే ప్రణవముంటుంది. కానీ, ఈ మంత్రానికి ముందు మాత్రం 'శ్రీ' అనే శ్రీకారముంటుంది. ఈ మంత్రమే "శ్రీరామ, రామ, రామ" అని పలుకబడుతుంది. ఈ మంత్రాన్ని పరమేశ్వరులవారు పార్వతీదేవికి దీన్ని ఒకసారి జపిస్తే చాలు అది విష్ణుసహస్రనామంతో సరి అని చెప్పారు. 'రామ' అనే రెండక్షరాలు జపిస్తే చాలు మనం చేసిన పాపాలన్నీ కూడా నశిస్తాయి.


ఆ రాముడే కలియుగంలో తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిగా ఉద్భవించారు. 'కలౌ వేంకటనాయకః' అని పిలువబడుతున్నాడు. అంటే కలియుగదేవుడని అర్థం.

వేంకటేశాష్టాక్షరీమంత్రం త్రేతాయుగంలో శ్రీరాములవారు పుట్టకమునుపే పుట్టిందని శ్రీ వేంకటాచలమాహాత్మ్యం చెప్తోంది.

ఎల్లపుడూ...
శ్రీవేంకటేశ్వరనామాన్నే జపిస్తూ,
శ్రీవారికృపకు పాత్రులమౌదాం.

త్రేతాయుగంలోనే పుట్టింది

త్రేతాయుగంలో దశరథమహారాజుకు ముగ్గురు భార్యలు. అయినా ఆయనకు సంతానం కలుగలేదు. అప్పుడు పుత్రార్థియై



దశరథుడు వసిష్ఠమహర్షితో కూడా వేంకటాద్రియందున్న స్వామిపుష్కరిణీ తీర్థానికి వచ్చాడు. అప్పుడు వసిష్ఠమహర్షి దశరథమహారాజుతో, "రాజా! ఇచ్చట శ్రీ మహావిష్ణువు ఆవిర్భవించాడు. నీవు పుష్కరిణిలో స్నానంచేసి శుచివై జపం గావించుమన్నాడు. అప్పుడు దశరథమహారాజు, "స్వామీ! అట్లే చేస్తాను. కానీ, నాకొక మంత్రాన్నుపదేశించండని ప్రార్థించాడు. వసిష్ఠమహర్షి దశరథునకు "వేంకటేశాష్టాక్షరి" మంత్రాన్నుపదేశించాడు. ఆ మంత్రాన్ని స్వీకరించి దశరథుడు పుష్కరిణిలో స్నానం చేసి, జపించసాగాడు.

ఆ మంత్రప్రభావంతో శ్రీమహావిష్ణువు ఉద్భవించి దశరథుని చూచి ఏమి వరం కావాలని అడిగాడు. అందులకు దశరథుడు 'స్వామీ! నీ దయవల్ల నేను చిరకాలం రాజ్యసుఖమనుభవించాను. దానధర్మాలు చేసి పుణ్యం సంపాదించాను. పుత్రజన్మసంభవసుఖాన్ని మాత్రం అనుభవించలేకపోయాను. పుత్రులులేనివారికి పుణ్యలోకప్రాప్తి లేదు కదా! వంశకరుడైన పుత్రుని ప్రసాదించుమని ప్రార్థించాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు ఇట్లన్నారు. రాజా! నీ భక్తికి నేను సంతసించాను. నీవు అయోధ్యకు వెళ్లి పుత్రకామేష్టి యాగం చేయుము. అందువల్ల శూరులు, బలవంతులు, పరాక్రమవంతులూ అయిన నలుగురు కుమారులు కలుగుతారని చెప్పి ఆ మహావిష్ణువే శ్రీరాములవారిగా ఉద్భవించారు. కాబట్టి ఈ మంత్రాన్ని మనం కూడా నిత్యమూ జపిస్తూ స్వామి కృపకు పాత్రులమౌదాం.

అనంతశయనా! పద్మనాభా!!

- శ్రీమతి దేగల అనితాసూరి

(సెప్టెంబరు 05న అనంతపద్మనాభవ్రతం సందర్భంగా....)


శాంతాకారం భుజగశయనం సురేశం
విశ్వాధారం గగనసదృశం మేఘవర్ణం శుభాంగమ్
లక్ష్మీకాంతం కమలనయనం యోగి హృద్ధ్యాన గమ్యం
వందేవిష్ణుం భవభయహరం సర్వలోకైక నాథమ్.

అనంతం అనగా అంతంలేనివాడు అని అర్థం. ఆయనే విష్ణువు. ఆయనకు నాభియందు పద్మం ఉంటుంది. కనుక, ఆ స్వామి అనంతపద్మనాభుడయ్యాడు. కాలస్వరూపుడైన సృష్టి, స్థితి, లయ కారణభూతుడే అనంతపద్మనాభస్వామి అవతారమని సాక్షాత్తూ శ్రీకృష్ణుడే అరణ్యవాససమయంలో స్వయంగా ధర్మ రాజుకు తెలిపినట్లు పురాణగాథలవల్ల తెలుస్తోంది. అంతే కాకుండా, భాద్రపద శుక్ల చతుర్దశి పర్వదినమందు శ్రీ అనంత పద్మనాభస్వామి వ్రతమాచరించటంవల్ల కలిగే విశిష్టఫలితాన్ని సైతం ఉదహరించారు శ్రీకృష్ణుడు.

పూజావిధానం

ఈ వ్రతాన్ని అత్యంత నియమనిష్ఠలతో చేయాలి. స్త్రీలు ఎఱ్ఱనిచీరను ధరించి, శుచిగా గోమయంతో అలికినప్రదేశంలో అష్టదళపద్మంగల ముగ్గును వేసి, కలశంలో యమునాదేవిని దర్భలతో చేసిన సర్పాకృతిని పీఠంమీద ఏర్పాటుచేసి, అన్ని పూజాద్రవ్యాలనూ పదునాలుగుసంఖ్యతో అన్నిరకాలను లెక్కించి ఉంచాలి. అలాగే గోధుమపిండితో ఇరువదిఎనిమిదిఅరిసెలు నివేదించి అందులో సగం బ్రాహ్మణునికి దానం చేసి, మిగిలిన సగాన్ని ప్రసాదంగా స్వీకరించాలి.

అలా పదునాలుగుసంవత్సరాలు క్రమం తప్పక ఆచరించి, ఉద్యాపన పలికితే సద్గతులు కలుగుతాయని, జీవించినంతకాలం అష్టైశ్వర్యాలతో తులతూగుతారనటానికి కౌండిన్యునివృత్తాంతం అందరికీ తెలిసిందే. ఈ వ్రతాన్ని ఆయన భార్య సుగుణవతి ఆచరించి, అంతమున నక్షత్రలోకప్రాప్తిని పొందారని పురాణగాథ.



మూడుద్వారాల్లో స్వామి పూర్తిదర్శనం

అనంతచతుర్దశి సందర్భంగా, శ్రీమహావిష్ణువుయొక్క 108దివ్యక్షేత్రాల్లో తిరువనంతపురం ఒకటి. కేరళరాష్ట్రంలో ఉన్న ఈ క్షేత్రాన్ని గురించి తెలుసుకుందాం. క్రీ.శ. 1568లో నిర్మింప బడిన ఈ ఆలయంగురించి ఇతిహాసాల్లో ఉంది.

శ్రీమద్భాగవతంలో బలరామదేవుడు తీర్థయాత్రలు చేస్తూ ఇక్కడ స్వామిని దర్శించి, పద్మతీర్థంలో స్నానమాచరించి నట్లు తెలుస్తుంది.

ఇక్కడ శ్రీఅనంతపద్మనాభస్వామి, ఆదిశేషుని తల్పంమీద యోగనిద్రలో శయనించి ఉంటాడు. ఆయనతో కొలువైన దేవి పేరు శ్రీహరి లక్ష్మీతాయార్. ఇక్కడ స్వామిని మూడుద్వారము లలో దర్శించాలి. మొదటిద్వారంగుండా తలభాగం, మధ్య ద్వారంనుంచీ బొడ్డు, అందులో పుట్టిన తామరపువ్వు, మూడవ ద్వారంద్వారా పాదభాగం కనిపిస్తాయి. ఈ స్వామిగురించి నమ్మాళ్వార్ తన 'తిరువాయ్‌మొళి' ప్రబంధంలో కీర్తించి యున్నారు. ఆలయంలోని మూలవిరాట్‌ను 1208 సాలగ్రామా లతో తయారుచేశారు.

ఎంతో పురాతనచరిత్ర కలిగిన ఈ ఆలయం ముఖ్యంగా ఈ మధ్యకాలంలో బయల్పడిన అపారసంపద కారణంగా మరింత విశిష్టతను సంపాదించుకుంది. ఇప్పటివరకు ఐదు నేలమాళిగలలోని సంపదను మాత్రమే లెక్కించారు. ఇంకా ఆరవనేలమాళిగను తెరిచే సాహసం చేయలేదు. సంపదలో అంతవరకూ మొదటిస్థానంలో శ్రీవేంకటేశ్వరుడు ఉండగా, అనంతలో బయల్పడిన బంగారు, వజ్రాలు, పచ్చలు, శ్రీకృష్ణదేవ రాయలకాలంనాటి నాణేలు, ఈస్టిండియాకాలంనాటి నాణేలు, నెపోలియన్‌కాలంనాటివికూడా బస్తాల్లో లభ్యమై శ్రీవారిని సంపదల్లో రెండవస్థానంలో నిలిచేలా చేశాయి.

తిరువనంతపురం స్థలపురాణంలో...

విష్ణుభక్తుడైన దివాకరముని తపస్సుకు మెచ్చి శ్రీమహా విష్ణువు బాలునిరూపంలో ప్రత్యక్షమయ్యాడు. ఆ బాలుని ముగ్ధ మనోహరరూపానికి తన్మయుడైన ముని తనవద్దనే ఉండి పొమ్మని ప్రార్థించాడు. అప్పుడా బాలుడు ఎప్పుడూ ప్రేమ పూర్వకంగా చూసుకుంటే ఉంటానని మాటిచ్చాడు. ఒకరోజు దివాకరముని పూజలో ఉండగా ఆ బాలుడు సాలగ్రామాన్ని నోటిలో ఉంచుకుని పరుగెత్తాడు. దానికి ఆగ్రహించినందువల్ల ఇచ్చినమాటను తప్పినందువల్ల వెళ్లిపోతున్నానని, తిరిగి చూడా లనిపిస్తే అడవిలో ఉంటానని చెప్పి మాయమయ్యాడు. తీవ్ర మనోవ్యథకు గురైన ముని బాలుడ్ని వెతుకుతూ అడవికి వెళ్లగా ఒక్కక్షణం కనిపించి, మహావృక్షరూపంలో నేలకొరిగి శేష శయనుడిగా కనిపించాడు. ఆ రూపం ఐదు కిలో మీటర్ల దూరంలో వ్యాపించిఉన్నందున మానవమాత్రులు దర్శించలేరని వేడుకోగా, ప్రస్తుతరూపంలో స్వామి వెలశారని తాళపత్రాలలో లిఖించబడింది.

ముఖ్యంగా శ్రీ అనంతపద్మనాభస్వామివ్రతంద్వారా సత్య ధర్మాలను అనుసరించటమే దైవభక్తికి నిదర్శనమని తెలియ జేస్తుంది. దానికి సంబంధించి తనను తినబోయిన పులితో ఓ ఆవు కాస్సేపు ఆగమని, ఇంటికెళ్లి దూడకు పాలిచ్చి వస్తానని చెప్పి, అన్నమాటకు కట్టుబడి పులి దగ్గరకెళ్లి తన సత్యవ్రతాన్ని చాటినట్లు చెబుతారు. అలాంటి ఆదర్శజీవితమే నిజమైన వ్రతమని సూచిస్తుంది.

అనంతుడూ, అవినాశుడూ, సర్వజ్ఞుడూ, సంసారసాగర అంతాన ఉండేవాడూ, యావత్ప్రపంచానికీ మంగళకరుడూ అయిన నారాయణుని అథోముఖమైన తామరమొగ్గలా ఉన్న హృదయంతో ధ్యానిద్దాం.

భర్తృహరి సుభాషితం

భుజకీర్తులూ,చంద్రహారాలూ, స్నానమూ, మైపూతలూ, పూలూ, అందంగా అలంకరించుకొన్న శిరోజాలు - ఇలాంటివేవీ మానవుడికి శోభ కలిగించలేవు. శాస్త్రసంస్కారం కల వాక్కు ఒక్కటే అతడికి శోభ చేకూరుస్తుంది. పైన చెప్పిన సువర్ణాభరణాదులు అన్నీ నశించిపోయేవే. వాక్కు అనే భూషణమొక్కటే శాశ్వతంగా నిలిచే భూషణం.

తొలి దర్శనభాగ్యంలో...

- శ్రీమతి పి.నీలావతి



స్వామివారిపై అలిగి వైకుంఠాన్ని వదలివెళ్ళిన లక్ష్మీ దేవిని వెతుక్కుంటూ శ్రీమన్నారాయణుడు తిరుమలలోని పుష్క రిణికి దక్షిణంవైపు ఒడ్డుననున్న చింతచెట్టుక్రింద పెద్దపుట్టలో సేదదీరారు. వైకుంఠాన్ని వీడి భూలోకం చేరుకున్న స్వామివారిని పూర్వజన్మలసుకృతఫలితంగా ఒక యాదవుడు మొట్టమొదటగా దర్శించుకున్నాడు. అతని సంతతివారే వంశపారంపర్యంగా కలి యుగాంతంవరకు 'తొలిదర్శనం' చేసుకునే మహత్తరభాగ్యాన్ని స్వామివారిచే వరంగా పొందారు. నేటికీ ఆ యాదవుని సంతతి వారే 'సన్నిధిగొల్ల'గా పిలువబడుతూ శ్రీవారిసేవలో తరిస్తున్నారు.

శ్రీవారి కైంకర్యపరులకు దారీ... కైంకర్యాలకు దారీ....

'సన్నిధిగొల్ల' ప్రతిదినం బ్రహ్మముహూర్తంలో 2.30 గం॥లకు నిద్రమేల్కొని శుచిగా స్నానంచేసి, నొసటన తిరు నామాలను ధరించి "గోవిందా..! గోవిందా..!!" అంటూ గోవిందనామాన్ని స్మరిస్తూ చేత చిన్నదివిటీ (పొంజు)తో తిరు మల ఉత్తరమాడవీధిలో ఉన్న శ్రీస్వామివారిసేవాకైంకర్యపరు లైన వైఖానస అర్చకస్వాముల 'తిరుమాళిగ' (అర్చకులఇల్లు)కు వెళ్ళి, భక్తిపూర్వకంగా వారికి నమస్కరించి, ఆ అర్చకస్వాములను ఆలయానికి ఆహ్వానిస్తారు. శ్రీనివాసప్రభువులవారి అర్చనకు గాను తనవెంట బయలుదేరిన అర్చకస్వాములకు దారిలో.. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగరూకుడై గమనిస్తూ "శ్రీవారి కైంకర్యపరులకు దారీ కైంకర్యాలకు దారీ!" అని గట్టిగా హెచ్చరిస్తూ దివిటీవెలుగుల్లో వారిని దేవాలయానికి పిలుచు కొస్తారు. వారంతా బంగారువాకిలివద్దకు చేరుకున్నతర్వాత సన్నిధిగొల్ల ఆలయానికి ప్రక్కనున్న 'శ్రీపెద్దజియ్యంగార్ల' మఠాని కెళ్ళి జియ్యంగారిని, వారి పరిచారికుడైన 'ఏకాంగి'ని ఆలయానికి ఆహ్వానిస్తారు.

తర్వాత 'సన్నిధిగొల్ల' ఆలయాధికారి ఐన 'పేష్కారు' వద్ద సీలు వేయబడిన తాళాలతోనున్న ఒక చిన్నసంచిని అందరిసమక్షంలో విప్పి, ఆ సంచిలో ఉన్న తాళంచెవులతో బంగారువాకిలికి వేసిన మూడు పెద్ద పెద్ద తాళాలను వాటిమీద సీళ్లు సరిగా ఉన్నదీలేనిదీ నిర్ధారించిన తర్వాతనే సన్నిధిగొల్ల ఆ సీళ్లను తొలగించిన తర్వాత తాళాలను తెరుస్తారు. అర్చకులు, జియ్యంగార్లు, ఆలయాధికారులసమక్షంలో సన్నిధిగొల్ల మాత్రమే బంగారువాకిళ్లకు ఉన్న తాళాలను తెరుస్తారు. ఈ ముగ్గురిలో



ఏ ఒక్కరు లేకపోయినా బంగారువాకిలి తాళాలు తీయడంకానీ, వేయడంకానీ జరుగదు.

తొట్టతొలిదర్శనభాగ్యంలో...

బంగారువాకిళ్ల తాళాలనన్నింటినీ తీసిన తరువాత 'సన్నిధిగొల్ల' చిన్నదివిటీ చేతబట్టుకొని బంగారువాకిలిని కొద్దిగా తెరచి లోనికి ముందుగా తాను ప్రవేశిస్తాడు. ఆ వెనువెంటనే అర్చకులు బిగ్గరగా "కౌసల్యా సుప్రజారామా! పూర్వా సంధ్యా ప్రవర్తతే" అంటూ సుప్రభాతాన్ని ప్రారంభిస్తూ 'సన్నిధి గొల్ల'ను అనుసరించి లోపలికి వెళ్తారు.

సన్నిధిగొల్ల, అర్చకులు, ఏకాంగి ఇలా అందరూ వరుసగా లోనికి వెళ్లిన వెంటనే బంగారువాకిళ్లు దగ్గరగా వేస్తారు. లోపల 'సన్నిధిగొల్ల' తన చేతిలోని దివిటీ వెలుగులో అర్చకులను గర్భాలయంలోని శ్రీవారిసన్నిధివరకు తీసుకువెళ్తాడు. తన చేతిలోని దివిటీవెలుగులో 'కులశేఖరపడి' గడపదగ్గర నిలబడి ఆనందనిలయంలో వింత వింత వెలుగులతో ప్రకాశిస్తున్న అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిని తొట్ట తొలిగా 'సన్నిధిగొల్ల' కన్నులారా దర్శించుకుంటాడు. తర్వాత ఏకాంగి 'సన్నిధిగొల్ల' చేతిలోని దివిటీ తీసుకుని స్వామివారి సన్నిధిలో అనగా గర్భాలయంలోని దీపాలను వెలిగించి దివిటీని మళ్లీ 'సన్నిధిగొల్ల' చేతికిస్తాడు. అతడు దానితోనే కులశేఖరపడి నుండి బంగారువాకిలివరకు లోపలున్న దీపాలనన్నింటినీ వెలిగిస్తాడు.

పూలదండలకైంకర్యంలో....

ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్వామివారికి జరిగే తోమాలసేవకుగాను 'యమునోత్తురై' అని పిలువబడే పుష్ప అరలో కావలసిన కొలతలతో ఉన్న పూలమాలలతో బాటు ఆయా ఋతువుల్లో దొరికే మల్లెలు, మొల్లలు, సన్నజాజులు, రోజాలు, గులాబీలు, సంపెంగలు, సుగంధాలు, మొగలి, మరువం, చామంతులు, గన్నేరు, తులసి, దవనం, మాచీపత్రం ఇలా ఎన్నో సుగంధపరిమళభరితమైన పుష్పజాతులతో, పత్రాలతో ఒక పెద్ద సన్నని వెదురుగంపలో సిద్ధంగా ఉంచబడతాయి. 'సన్నిధిగొల్ల' చిన్నదివిటీతో యమునోత్తరకు వెళ్లి స్వామివారికి పుష్పాలను తేవడానికి సిద్ధంగా ఉన్న 'వైష్ణవ జియ్యంగార్లు' లేదా వారి పరిచారిక సహాయకుడైన ఏకాంగిని ఆలయానికి ఆహ్వానిస్తారు.

సన్నిధిగొల్ల చేతిలో దివిటీపట్టుకుని హెచ్చరిక చేస్తూ ముందుకు నడుస్తూండగా ఏకాంగి పూలమాలలగంపలను తలపై పెట్టుకొని ఆలయంలోనికి ప్రవేశిస్తారు. సన్నాయి, డోలు, బూరలు, గంట మ్రోగిస్తూండగా ఛత్రచామరమర్యాదలతో ధ్వజస్తంభానికి ప్రదక్షిణం చేసిన తర్వాత సన్నిధిలో పూలగంపలను సమర్పిస్తారు.

వాయిద్య, ఛత్రచామరాలు అన్నీ బంగారువాకిలివద్ద నిలిచిపోగా సన్నిధిగొల్ల మాత్రమే చేతిలో దివిటీతో ముందు నడుస్తుండగా 'ఏకాంగి' బంగారువాకిట్లో ప్రవేశించి కులశేఖరపడి దాటి లోనికి వెళ్లి 'శ్రీవేంకటేశ్వరుని' సన్నిధిలో ఆ పూలమాలలను సమర్పిస్తారు. 'సన్నిధిగొల్ల' కులశేఖరపడివద్దే నిలిచిపోతారు.

ప్రథమతాంబూలస్వీకారంలో...

ప్రతిరోజు స్వామివారికి సుప్రభాతవేళలో నివేదించబడే అవుపాలను తొలుత అర్చకులు స్వీకరించి తర్వాత జియ్యంగారికి, ఏకాంగికి తర్వాత 'సన్నిధిగొల్ల'కు ఇస్తారు. రాత్రివేళ స్వామివారివద్ద 'బ్రహ్మదేవుడు' అర్చించడానికి ఉంచిన బ్రహ్మతీర్థాన్ని, చందన శఠారుల్ని తొలుత అర్చకస్వామి స్వీకరించి ఏకాంగివారికి ఇస్తారు. 'సన్నిధిగొల్ల'కు కూడా బ్రహ్మతీర్థ, చందన శఠారుల్ని అనుగ్రహించి, ఆ తట్టలోని 'ప్రథమ తాంబూలాన్ని' గొల్లకు ప్రసాదిస్తారు. తోమాలసేవ, ఏకాంతసేవ సమయంలో, పారువేటఉత్సవం మున్నగు ఉత్సవాల్లో కూడా ఈ 'సన్నిధిగొల్ల'స్వామివారికి సేవలందిస్తారు.

సన్నిధికి దారీ.. శ్రీవారికి దారీ...

ఆలయంనుండి ఉత్సవమూర్తులను అర్చకులు బయటకు తెస్తున్నప్పుడుగానీ, ఉత్సవానంతరం బంగారువాకిలినుండి లోనికి తీసుకెళ్తున్నప్పుడుగానీ ఈ సన్నిధిగొల్ల 'సన్నిధికి దారీ! శ్రీవారికి దారీ" అంటూ చేతిలోని దివిటీతో ముందుకు నడుస్తూ దారిలో విగ్రహమూర్తులను తీసుకుని వెళ్తున్న అర్చకులకు ఎలాంటి ఆటంకమూ కలుగకుండా హెచ్చరిస్తూ వెళ్తారు. శయనమండపంలో తూగుటుయ్యాల్లో మెత్తనిపరుపులపై 'భోగమూర్తి'ని శయనింపచేసేసమయంలో సన్నిధిగొల్ల తన చేతిలోని దివిటీతో శ్రీవారు పవళించే మంచానికి ముందుభాగంలో ఇరువైపులా ఉన్న రెండు దీపపుసమ్మెటలను ప్రతిరోజూ వెలిగిస్తారు. స్వామివారికి ఇంతటి విశిష్టసేవలందిస్తున్న తొలిదర్శన, ప్రథమ తాంబూలభాగ్యశాలి యాదవభక్తశిఖామణి ఎంతో అభినందనీయులు.

మన దేవాలయాలు

ఝాంసింగ్ బాలాజీఆలయం, భాగ్యనగరం

- శ్రీమతి పసుమర్తి రామలక్ష్మి

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న దివ్యస్థలం తిరుమలక్షేత్రమే ఐనా అనేకప్రాంతాల్లో కూడా స్వామివారు కొలువై ఉన్న ఆలయాలున్నాయి. ఆపదమొక్కులవాడా! అనాథరక్షకా! వడ్డికాసులవాడా! ఏడుకొండలవాడా! గోవింద! అని భక్తులచే ఆర్తిగా పిలిపించుకునే ఆరాధ్యదైవం భాగ్యనగరంలో.... శ్రీఝాంసింగ్ బాలాజీగా భక్తుల నీరాజనాలు అందుకుంటున్నారు.

స్థలచారిత్రత నేపథ్యమేమంటే.....

17వ శతాబ్దంనాటి పురాతనఆలయానికి సంబంధించి ఆసక్తికరమైన స్థలచారిత్రకగాథ ప్రచారంలో ఉంది. ఉత్తరభారత దేశంనుండి రాజపుత్రకుటుంబాలు దక్షిణభారతదేశంలో వలసొచ్చి కొన్నిచోట్ల స్థిరనివాసమేర్పరచుకున్నాయి. ఆ రాజపుత్రుల సంబంధి కుటుంబీకుడైన శ్రీ ఝాంసింగ్ హైదరాబాద్‌నవాబు మూడవ సికందర్‌పాలనలో అశ్వదళాధిపతిగా పనిచేసేవారు. వారికి శ్రీవారి పట్ల ప్రగాఢ భక్తిప్రపత్తులుండేవి. నిత్యం స్వామిని దర్శించుకునేందుకు 1810వసంవత్సరంలో గుడి మల్కాపూర్‌గా పిలువబడే ఈ ప్రాంతంలో శ్రీఅలమేలుమంగా ఆదిలక్ష్మీసమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ఆలయం నిర్మించాడు. అప్పటినుండి ఆలయం దేదీప్యమానంగా వెలుగొందింది. ఉత్తరదక్షిణ భారతీయశిల్పకళలో ఉత్తమమైన మేలు కలయికకు తార్కాణంగా ఆ ఆలయం నిలిచింది. చారిత్రకమైన ఒడిదుడుకులను ఎదుర్కొంటూ జంటనగరవాసులనే కాకుండా నగరానికి వచ్చే యాత్రికులను కూడా విశేషంగా ఆకర్షిస్తోంది ఈ ఆలయం.

భద్రాచల రామదాసువలె శ్రీవారిభక్తుడైన ఝాంసింగ్ దేవాలయనిర్మాణాన్ని చేపట్టినందుకుగాను అప్పటి నిజాం నవాబు నిరాధారమైన వదంతులను నమ్మి ఝాంసింగ్‌కు శిక్ష విధించాడు. కానీ, అప్పటి నిజాం ప్రధానమంత్రియైన రాజా చందూలాల్ జోక్యం మేరకు శిక్షను రద్దు చేయడమే కాకుండా దేవాలయానికి స్థలాన్ని మంజూరుచేసి శాసనాన్ని జారీ చేయడం జరిగింది. శతాబ్దాలనాటి ఆలయం ప్రస్తుతం దేవాదాయధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతోంది. ఆలయం పూర్వవైభవాన్ని సంతరించుకుని, భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది.

రండి చూసొద్దాం ఆలయనిర్మాణశైలి

దేవాలయం పాంచరాత్రాగమ సంప్రదాయానుసారం నిర్మింపబడింది. ప్రధానాలయం విశాలమైన ముఖమంటపం, ప్రదక్షిణ మంటపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది. స్వామివారి ఆలయానికి ఎడమవైపున ప్రత్యేక ఆలయంలో స్వామివారి దేవేరి శ్రీమహాలక్ష్మి కొలువు తీరి భక్తులకు దర్శనమిస్తున్నారు. శ్రీవారి ప్రాకారమంటపంలో వైవిధ్యమైన శిల్పకళను చూడొచ్చు.

సువిశాలమైన ప్రాకారంలో మనం ఎక్కడా చూడనటువంటి విభిన్నమైన, విలక్షణమైనరీతిలో నిర్మించబడిన ధ్వజస్తంభాన్ని ఇక్కడ చూడవచ్చు. గుమ్మడికాయలు ఒకదానిపై ఒకటి పేర్చినట్లు



ఉండే అమరికతో ధ్వజస్తంభనిర్మాణం వినూత్నంగా ఉంటుంది. తూర్పువైపుఉన్న ప్రవేశపు ముఖద్వారంవద్ద దీపస్తంభం కనిపిస్తుంది. ఈ రెండింటిమధ్యభాగంలో బలిపీఠం ఉంటుంది. ఈ రెండు స్తంభాలు సందర్శకులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

దీనికెదురుగా రెండంతస్తుల నగార్ఖానా అంటే వాయిద్యాలు వాయించేగదిని నిర్మించారు. మధ్యలో 12స్తంభాలపై మంటపముంది. దీనికి ముందుభాగంలో గరుడస్తంభం ఉంది.

బ్రహ్మోత్సవాలు జరిగే తీరు

శ్రీరంగం, కంచి మొదలైన దివ్యదేశాల్లోని సంప్రదాయాల ప్రకారం ఉత్సవాలను నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలు వైశాఖమాసంలో ఘనంగా జరుగుతాయి. ఈ సందర్భంగా సింహవాహనం, పల్లకి, సూర్యప్రభ, చంద్రప్రభ, శేష, గరుడ, హనుమంత, గజ, అశ్వవాహన సేవలతోపాటు కల్యాణోత్సవం, రథోత్సవం అంగరంగవైభవంగా జరుగుతాయి.

ఇంకా ధనుర్మాసం, సంక్రాంతి, వైకుంఠఏకాదశి, విజయదశమి, దీపావళి, ఉగాదివంటి పర్వదినాలసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

కొంగుబంగారమై... కల్పవృక్షమై...

నిత్యం రద్దీగా ఉండే నగరంలో యాంత్రికజీవనం గడిపే నగరవాసులపాలిట కొంగుబంగారమై, కల్పవృక్షమై ఝూంసింగ్ బాలాజీఆలయం విలసిల్లుతూంది. ఈ ఆలయంలోని స్వామివారిని గురించి భక్తుల్లో అనేక నమ్మకాలున్నాయి. ముఖ్యంగా స్వామివారిని దర్శించి మనసులోని కోరికలను వెల్లడిస్తే ఆ కోరికలు తప్పక నెరవేరుతాయనీ, స్వామివారికి విన్నవించుకుంటే కష్టాలు, నష్టాలు తొలగిపోతాయనీ భక్తుల ప్రగాఢనమ్మకం.

కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరుడు భక్తులు ఆర్తితో పిలిస్తే పలికే దైవం. భక్తుల క్లేశాలను తొలగించే దేవుడు. భక్తజనసులభుడు, దయామయుడు. ఎవరు ఏ రీతిన కొలిస్తే ఆ భావనతో అనుగ్రహించే కరుణామయుడు. మెహదీపట్నం నుండి గుడిమల్కాపూర్‌కు బస్సు, ఆటో సౌకర్యాలు ఉన్నాయి. కోరిన కోర్కెలు తీర్చే కొండంతదేవుడు ఝూంసింగ్ బాలాజీగా ప్రసిద్ధికెక్కిన శ్రీవేంకటేశ్వరస్వామిని మనసారా సేవించుకుందాం. స్వామి అనుగ్రహాన్ని పొందుదాం.

బ్రహ్మోత్సవం! భవ్యోత్సవం!!

– డా॥ మరింగంటి లక్ష్మణాచార్యులు

ఇదే.... ఇదే....
ఇదే ఇదే ఇదే ఇదే బ్రహ్మోత్సవం
బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం.... భవ్యోత్సవం

వేల వేల కనులున్నా వేంకటవిభుని
వీక్షింపగ చాలవంది బ్రహ్మోత్సవం
పాండిత్యం, శాస్త్రజ్ఞత ఎంత, ఎంత ఉన్నా
వర్ణింపగ లేవంది బ్రహ్మోత్సవం

ఎన్నెన్నో విశేషాలు, ఎన్నెన్నో వైభవాలు
చూడగ రమ్మన్నదీ బ్రహ్మోత్సవం
దేవతలను, దేవుళ్ళను రప్పించి
మన ముందర నిలుపుతుంది బ్రహ్మోత్సవం

అందరిలో గోవిందుని చూపించేది
అణువు అణువులో దివ్యత తెప్పించేది
చరాచరములన్నిటినీ మెప్పించేదీ
బ్రహ్మోత్సవం ఈ బ్రహ్మోత్సవం

భాగవతోత్తములను, భక్తులనూ
ఒకచోటికి చేర్చేదే బ్రహ్మోత్సవం

వేదనాదమొకవంక, పాశురమ్ము లొకవంక
వినవచ్చే సందర్భం బ్రహ్మోత్సవం ఈ బ్రహ్మోత్సవం


తన దర్శన నిమిత్తం, తహతహలాడేవారికి
అశక్తులకు, రోగులకు, వృద్ధులకు, సేవకులకు
తృప్తిని కలిగించ తలచి, తపనపడే శ్రీహరిని
బయటకు తోడ్కొని వచ్చే బ్రహ్మోత్సవం ఈ భవ్యోత్సవం

దైవదర్శనభాగ్యం కలిగించి
అజ్ఞానం, అహంకార మణగించి
ఎద-ఎదలో దివ్యజ్యోతి వెలిగించే
ఆనందం అందించే బ్రహ్మోత్సవం ఈ బ్రహ్మోత్సవం

కష్టాలు, కన్నీళ్లు మరిపించేది
శరణాగతివేడిన మురిపించేది
"మూసుకుపోయిన" కన్నులు తెరిపించి
నరజన్మకు ధన్యత అందించేది బ్రహ్మోత్సవం, ఈ బ్రహ్మోత్సవం



యువవాణి



వందనం.. మన సంస్కృతీనందనం

- శ్రీ ఎం.సూర్యప్రకాశరావు

మన భారతీయ సంస్కృతీ నందనవనమైన 'వందనం' సమర్పించేవారి అహంకార అభిజాత్యాలను రూపుమాపి వారి హృదయాలను 'నందనం' చేస్తుంది. వందనం స్వీకరించినవారి మనసులు కూడా పులకించిపోయి నందనవనాలౌతాయి. అందుకే 'వందనం' మన 'నందనం' ఔతుంది. నమస్కారం ఎవరికి చేయాలి? ఎప్పుడు చేయాలి? ఎలా చేయాలి? అనే ప్రశ్నలకు మనపూర్వులు ఏనాడో సమాధానాలు సిద్ధం చేశారు.

బ్రహ్మచారి ప్రతిదినమూ తల్లికీ, తండ్రికీ, ఆచార్యునికీ, విద్వాంసునికీ నమస్కరించాలని వైఖానస ధర్మసూత్రం చెప్తోంది. అలా చేస్తే ఆయుర్దాయం, జ్ఞానం, ఆరోగ్యం, శుభాలు చేకూరుతాయని హితవు చెబుతోంది.

వందనమంటే...

వందనమునకు పూజ, స్తోత్రం, నమస్కారమని అర్థాలున్నాయి. నమస్కరించదగ్గవ్యక్తిని 'వంద్యుడు" అని వ్యవహరిస్తారు. తన గోత్రనామాదులను చెప్పి పాదాభివందనం చేయదగినవారిని 'వందారువు' అంటారు!! వందనంలో సమర్పణభావముంది. తన అహంకారాన్ని తగ్గించుకొని, తనను తాను సమర్పించుకునే గుణము వందనంలోనే ఉంది కనుక దానిని నమస్కారమంటారు.

నమస్కార ప్రాధాన్యమేమిటి?

'నమఃతే" పదము 'నమస్తే'గా రూపాంతరం చెందింది. అందులో తాను శిరస్సు వంచి తనను సమర్పించుకుంటున్నాననే భావం ప్రస్ఫుటితమౌతుంది.

"మనస్' అనే శబ్దమే "నమస్'గా శబ్ద రూపాంతరం చెందిందని విజ్ఞులంటారు. కనుక నమస్కరించడమంటే 'మనస్సునే సమర్పించడం, అర్పించడం అనుకోవచ్చు. వినయభావనను ప్రదర్శించేతత్వాన్ని అవగాహన చేసుకోవడంలో నమస్కారం ప్రధానపాత్ర వహిస్తుంది.

పరమేశ్వరుని నమస్కారప్రియునిగా పెద్దలు చెబుతారు. 'పరమాత్మకు నమస్కరించు! కోరికలన్నీ నీకు నమస్కరిస్తాయని' విజ్ఞుల ఉవాచ! నమస్కారంవల్ల సర్వ శుభాలు చేకూరే అవకాశముంది కనుక పంచప్రణవాలలో నమస్కారమొకటి. 'ఓంకారం, స్వాహాకారం, స్వధాకారం, వషట్కారం, నమస్కారం' అంటూ పంచ ఆకారాలకు అర్థవంతమైన సాకారం కలిగుంది. మొదటి నాలుగింటికీ నియమాలు, పద్ధతులు ఉన్నప్పటికీ, ఏ నియమాలు లేని సంస్కారం ఒక్క నమస్కారమే! ఈ నమస్కారాన్ని ఎవ్వరైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవ్వరికైనా ఆచరించొచ్చు. పరమేశ్వరునికి నమస్కరించే విధానాలు నమకాలుగా ప్రసిద్ధిచెందాయి.

దేవతలు వెంటనే అనుగ్రహించే విధానాన్ని **'అంజలిముద్ర'** అని పిలుస్తారు. శిరస్సు వంచి రెండుచేతులూ జోడించి నమస్కరించడం మన సంప్రదాయం. సాధారణంగా హృదయానికి దగ్గరగా రెండుచేతులూ జోడిస్తాం, కనుక ఆ నమస్కారాన్ని **'హృదయాంజలిముద్ర'** అనీ, హృదయపూర్వకమైన నమస్కారమనీ పిలవవచ్చు.

మేధస్సు, ఆలోచనలకు శిరస్సు ప్రధానస్థానం. చేతులు కార్యాచరణకర్తలు. హృదయం అద్భుతమైన ఆంతరంగంగా గుర్తింపబడుతుంది. అందుకే శిరస్సు, చేతులు, హృదయం కలిసి చేస్తున్న ఈ హృదయాంజలి వెనుక మహత్తరమైన భావన ఉంది. అగోచరమైన, అద్భుతమైన భగవత్‌శక్తిని అందుకునేందుకు భగవదర్పణం కావాలని కోరుకుంటూ త్రికరణశుద్ధిగా చేసే నమస్కారంవల్ల మనశ్శాంతి కలుగుతుంది. మనఃపూర్వకంగా, మేధోపూర్వకంగా తనువును ముకుళింపచేసి రెండుచేతులూ జోడించి చేసే ప్రక్రియ కనుక నమస్కారానికంత ప్రాధాన్యం ఉంది! ప్రాచుర్యముంది!

ఒక్క నమస్కారం పది అవభృథస్నానాలతో సమానమని విజ్ఞులు చెబుతున్నారంటే నమస్కారమెంత ఉత్కృష్టమైనదో, ఉన్నతమైనదో గమనించొచ్చు.

'అమ్మ అంటే భూమిపైన నడయాడే దేవత. అందుకే 'మాతృదేవోభవ" అన్నారు. ఆమెలో దైవాన్ని చూస్తూ నమస్కరిస్తూ ప్రదక్షిణం చేస్తే ఎంత పుణ్యమో....

వందనమెలా చేయాలి?

సర్వసాధారణంగా నమస్కారం రెండుచేతులూ జోడించి చేస్తాం. ఒంటిచేత్తో నమస్కరించరాదని పెద్దలు చెబుతారు.

మనం ఒంటిచేత్తో ఎవరికి నమస్కరిస్తే, వారికి మన పుణ్యాలన్నీ సంక్రమిస్తాయని స్మృతి చెబుతుంది. కనుక ఎవరికైనా, ఎప్పుడైనా నమస్కరించేటప్పుడు రెండుచేతులు జోడించి నమస్కరించాలి.

గురువులకెలా నమస్కరించాలి?

గురువులకు నమస్కరించేవిధం భిన్నంగా ఉంటుందని, వారికి ఈ విధంగా నమస్కరించాలని శాస్త్రం చెబుతుంది.

కుడిచేతితో గురువుగారి కుడిపాదాన్ని, ఎడమచేతితో గురువుగారి ఎడమపాదాన్ని స్పృశిస్తూ నమస్కరించాలి. ఆయన పాదపద్మములే తనకు శరణ్యమనే భక్తిభావనతో గురువునకు నమస్కరించుమని ప్రాజ్ఞులమాట. మనుస్మృతిలో మనువు ఈ నమస్కారవిధానం వివరించాడు.

ఎవరెవరు నమస్కారానికి అర్హులు?

నిత్యాన్నదానం చేసేవారు నమస్కారానికి అర్హులే. నిరంతరం గృహంలో అగ్నిహోత్ర ఆరాధన చేసేవారూ వందనీయులే. వేదాంతమంటే ఎరిగినవారూ నమస్కరించదగినవారే. శతవర్షములు జీవించినవారూ, పరోపకారపారీణత్వం ఆచరించేవారూ నమస్కరించదగినవారే! పతినే వ్రతంగా భావించే పతివ్రతామతల్లులూ వందనీయులే. ఈ ఆరుగురూ తమ జీవన సమయంలో నమస్కరించదగినవారనీ, శుభాశీస్సులు అందించగలవారనీ శాస్త్రం చెబుతుంది.

నమస్కారంవల్ల అలవడే సద్గుణాలు

నమస్కారంవల్ల దైవభావం అలవడుతుంది. నిరాడంబరత, సేవాభావం కలుగుతుంది. మనలోని అహంకారం తగ్గుతుంది. సేవాభావంవల్ల భక్తిభావం అంకురిస్తుంది. భక్తిభావం ఆత్మసాక్షాత్కారజ్ఞానానికి ప్రథమసోపానంగా మారుతుంది. పరమభక్తియే మోక్షప్రాప్తికి ఉత్తమసాధనమౌతుంది.

భగవంతుడే నమస్కరించదగ్గవారు

చిత్తశుద్ధిగల ఆ నలుగురికీ తాను నమస్కరిస్తానని కృష్ణ భగవానుడు భగవద్గీతలో ఉద్ఘాటించాడు. వారెవరంటే– కరవు కాలంలో అన్నం పెట్టే అన్నదాత మొదటివాడు. కరువు పోయి సుభిక్షంగా ఉన్నసమయంలో ధనదానం చేసే ధనవంతుడు రెండవవాడు. యుద్ధరంగంలో వెనుదిరగక ధైర్యంగా శత్రువును ఎదిరించే ధీరుడు మూడవవాడు. బాకీ ఉన్నప్పుడు చిత్తశుద్ధిగా అప్పు తిరిగి ఇచ్చివేసే నిజాయితీపరుడు నాల్గవవాడు. ఈ నలుగురూ నమస్కారములకు అర్హులని కృష్ణపరమాత్మ శ్లాఘించాడు.

సాధారణంగా పెద్దలకు నమస్కరించేటప్పుడు వంశ పారంపర్యవివరాలు, గోత్రనామాదులవిశేషాలు తెలుపుతూ నమస్కరించడం మన ఆచారం. నమస్కరించేటప్పుడు ఎంతో వినయ విధేయతలు నమస్కరించేవ్యక్తి ప్రదర్శించాలి. అంతే ఆత్మీయతను, ఆప్యాయతను, అనురాగాన్ని స్వీకరించేవ్యక్తి చూపించాలి.

పెద్దలైనవారు నమస్కారం స్వీకరిస్తూ. ఆ నమస్కారం తనకుకాదనీ, భగవంతునికే చెందుతుందనీ, తమకు నమస్కరించినవారి శుభాన్ని ఆకాంక్షిస్తూ దీవెనలను హృదయపూర్వకంగా అందచేస్తారు. అటువంటి పెద్దల ఆశీస్సులు వారిని పరమానంద భరితులను చేస్తాయి. వారికి ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసం కలిగిస్తాయి. అప్పుడే నమస్కారప్రక్రియకు అర్థమూ, పరమార్థమూ సిద్ధిస్తాయని చెప్పొచ్చు.



గరుడపతాకం ఎగిరింది..!

– డా॥కె.రవిచంద్రన్

ఓం.. నమోస్తుతే ధ్వజాయ..
సకల భువన జనహితాయ..
విమల బోధకాయ..
మహిత మంగళాయ..

అంటూ రెపరెపలాడే పతాకాన్ని భగవద్ధ్వజంగా మన పెద్దలు తలుస్తుంటారు. కొలుస్తుంటారు.

ధ్వజం అనేది ప్రస్తుత పరిభాషలోని జెండా వంటిది కాదు. వర్ణసహితమైన వస్త్రభాగం అంతకంటే కాదు. చిత్రమయమైన కలనేతలనూలు కానేకాదు. అది మన ప్రాచీన సంస్కృతికి, సంప్రదాయానికి, సనాతనధర్మానికి, నిత్యనూతన స్వధర్మానికీ అది సంకేతం. నిలువెత్తునిదర్శనం.

కురుక్షేత్రసంగ్రామంలో పార్థసారథి తన రథంలో భగవంతుని రూపాలు ఎన్నింటినో ప్రతిష్టించుకున్నాడు. తేరు కొనకొమ్మమీద మటుకు పవనసుతుడైన ఆంజనేయస్వామి రూపం ఉండే ధర్మపతాకాన్ని ఆవిష్కరించుకున్నాడు. అది ధర్మధ్వజమై నిలిచింది. అది పుణ్యప్రదమై వెలిగింది. మంచిని గెలిపించింది. చెడును నిరసించింది. అందుకే, భారతీయ ఆత్మ ఈధ్వజానికి దివ్యమైన గౌరవాన్ని ఎల్లవేళలా కల్పిస్తుంది. భవ్యమైన అంజలిని అనుదినమూ ఘటిస్తుంది.

ప్రతీ శుభకార్యానికీ అంకురారోపణగా ధ్వజారోహణపర్వాన్ని మన పూర్వులు అత్యంతభక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుండేవారు. అనూచానమై నిలిచిన అలాంటి ఆచారానికి కలియుగదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో బ్రహ్మోత్సవసమయాన అత్యంతప్రాధాన్యం ఏర్పడింది. పెద్దపీట దక్కింది.

తిరుమల శ్రీవారిబ్రహ్మోత్సవాలను ఈ ధ్వజారోహణ సత్సంప్రదాయంతోనే ప్రారంభించడం మన ప్రాచీనవిలువలకు మర్యాద మన్నన చేకూర్చడమే. పతాకాన్ని ఎగురవేసి ఆరంభించే బ్రహ్మాండనాయకుని ఉత్సవం అందుకేనేమో భువి, దివి ఏకమై నిర్వహించే పుణ్యక్రతువుగా సాగుతుంటుంది.

ధ్వజపటం.. హరివాహనం...

తిరుమలకొండమీద జరిగే బ్రహ్మోత్సవాల ధ్వజారోహణ విశిష్టతను, ఆ కార్యక్రమసరళిని మరింత వివరంగా మనం తెలుసుకోదలిస్తే....

తిరుమలగిరిపై వేంచేసిన శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతీఏటా ఘనంగా జరిగే బ్రహ్మోత్సవవేడుకలు ఈ పతాకావిష్కరణతోనే మొదలవుతాయి. విష్ణుమూర్తి వాహనమైన గరుడుడు రూపుదాల్చిన ధ్వజాన్ని తొలుత అర్చకస్వాములు ఆలయానికి చెందిన నాలుగుమాడవీథుల్లోనూ ఊరేగిస్తారు. తిరువీథిఉత్సవం పూర్తయ్యాక పతాకాన్ని ధ్వజస్తంభంమీద భక్తజనసముద్రం ఎగసిపడుతుండగా కన్నులపండువగా ఎగురవేస్తారు. ఉత్సవాల ప్రారంభానికి ఈ ధ్వజారోహణమే అంకురారోపణ. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యాక మళ్లీ ఈ పతాకాన్ని ధ్వజస్తంభం మీదనుంచి వేదమంత్రోచ్చాటనల నడుమ ధరణీవాసానికి చేరుస్తారు. ఈ పతాకాన్ని **'ధ్వజపటం'** అని భక్తులు భక్తిప్రపత్తులతో పిలుచుకుంటారు.

దేవతలకు శుభాహ్వానం..

బ్రహ్మోత్సవాల ప్రారంభసూచకంగా చేపట్టే ఈ ధ్వజారోహణం వెనుక కీలకమైన అంశం లేకపోలేదు. బ్రహ్మోత్సవవేళ ధ్వజస్తంభంపై ఈ పతాకం తీరుగా ఠీవిగా గాలికి కదలడమంటే దేవతలకు ఆహ్వానం అందివ్వడమే. ధ్వజంపై చిత్రించిన గరుడుని గరుడాళ్వార్ అని పెద్దలు కొనియాడుతుంటారు. పైలోకాల్లో ఉన్న సమస్తదేవతలనూ శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రారమ్మని ఆహ్వానించడమే ఈ పతాకావిష్కరణ లక్ష్యం. గరుడాళ్వార్ పిలుపునందుకునే ముక్కోటిదేవతలూ బిలబిల

మంటూ స్వామిసేవలో పాల్గొని తరిస్తారు. తాము తరించడమే కాదు. సకలలోకాలను, సమస్తప్రాణికోటినీ తరింపజేస్తారు.

పతాకం మీద గరుడుని ఆకృతి కూడా అర్థవంతంగా చిత్రీకరిస్తారు. గరుడాళ్వారుల వారు దక్షిణహస్తాన్ని గగనం వైపు చూపుతూ దేవతలకు స్వాగతం పలుకుతున్నట్లుగా ఉంటారు. వామహస్తంతో సూర్యచంద్రులసాక్షిగా పూర్ణకలశాన్ని చూపిస్తూ సమస్తశుభాలకూ హేతువవుతుంటారు. ఇంతేకాదు. ధ్వజం మీద మరో అయిదు కలశాలు పంచభూతాలకూ ప్రతీకలుగా కళకళలాడుతుంటాయి. హారతి, గంట, ధూపము చిత్రాలుగా కొలువుదీరి పతాకాన్ని తేజోవంతం చేస్తుంటాయి. గరుడికి సర్పజాతులను ఆభరణాలుగా చేసి మరీ ధ్వజం వింతకాంతులీనుతుంటుంది.

గరుడపతాకం....

శ్రీవారి బ్రహ్మోత్సవాలకే కీలకమని చెప్పదగ్గ ఈ 'ధ్వజపటం' తయారీ అనేది చిన్నవిషయం కాదు. బ్రహ్మోత్సవాలకే దీటుగా అద్భుత కళావిలాసంగా దీనిని రూపొందించాలి. బ్రహ్మకడిగిన పాదాలకు నైవేద్యంగా అపరబ్రహ్మలాగానే ఈ ధ్వజపటాన్ని సృష్టించాలి. ఇంతటి మహత్కార్యాన్ని నిర్వహించే అద్భుత అవకాశం శ్రీపేరూరు శివప్రసాద్‌కు లభ్యమైంది. శ్రీనివాసుడే తనకీ సావకాశాన్ని కల్పించినట్టుగా భావిస్తూ శ్రీశివప్రసాద్ 1986వ సం॥లో ప్రారంభించి ఇప్పటికి మూడుదశాబ్దాలకు పైబడి ధ్వజపటాన్ని తయారుచేస్తూ వస్తున్నారు. శ్రీవారిసేవలో పుణ్యపతాకమై నిలుస్తున్నారు. వీరు. తి.తి.దేవస్థానానికి చిత్రించి సమర్పించిన 'కేశవాదిరూపాలు' తైలవర్ణచిత్రాలు విశేషప్రజాదరణ పొంది చరిత్ర సృష్టించాయి.

'సప్తగిరి' మాసపత్రిక(ఆరుభాషలు)లో చిత్రకారునిగా పనిచేస్తున్న శివప్రసాద్, బ్రహ్మోత్సవాలవేళ ఈ ధ్వజాన్ని నిష్ఠాశ్రద్ధలతో నిర్మిస్తారు. పతాకరూపకల్పన నిర్దుష్టమైన పద్ధతుల్లో సాగుతుంటుంది. ఏడు అడుగుల ధవళవస్త్రాన్ని పతాకం తయారు చేసేందుకు వినియోగిస్తారు. ఈ వస్త్రాన్ని ఒక రోజు రోజంతా పసుపునీళ్లల్లో నానబెట్టి ఉంచుతారు. ఆరబెడతారు. ఆరిన తర్వాత నిమ్మఉప్పు నీటిలో తడిపి మరింతగాశుద్ధి చేస్తారు. ఈక్షారశుభ్రత వల్ల పసుపురంగు వెలిసిపోకుండా ఉండటమే కాకుండా పతాకం తేటుగా రెపరెపలాడుతుంది. అలా తయారైన శుభ్రవస్త్రం మీద గరుడాళ్వార్ రూపాన్ని అందంగా చిత్రిస్తారు. ఇందుకుగాను ఉపయోగించే రంగులన్నీ సహజసిద్ధమైనవే. ఈ వర్ణాలను వృక్షసంబంధమైన జిగురుతోనూ, ఎర్రమట్టి, బొగ్గుపొడి తదితరాల మిశ్రమంతోనూ శివప్రసాద్ తయారు చేస్తారు. ఈవిషయమై ఆయన మాట్లాడుతూ...

"బ్రహ్మోత్సవాలకు శుభసూచకమైన ధ్వజారోహణకార్యక్రమంలో చిత్రకారునిగా భాగం లభించడం ఎంతో సంతృప్తినిస్తుంది. శ్రీవారిసేవలో పాలుపంచుకోవడం పూర్వజన్మసుకృతమే. పతాకాన్ని రూపొందించే పుణ్యకార్యం 32 ఏళ్లుగా స్వామి నాకు ఆజ్ఞనివ్వడం, నాపై శ్రీవారు చూపుతున్న కృపగానే భావిస్తాను." అని వినమ్రంగా ఆయన తెలియజేశారు.

ధ్వజరూపాన్నే కాదు. తిరుమల తిరుపతి దేవస్థానం, దేవస్థానం అనుబంధ సంస్థలు నిర్వహించే అనేకకార్యక్రమాలకు సంబంధించిన స్మృతిచిహ్నాలు, జ్ఞాపికలు తనచిత్రకళావిన్యాసంతో సంపద్వంతం చేస్తారు శివప్రసాద్. ఆయన అన్నట్టుగా, స్వామిని అర్చించినా స్వామి సంబంధకార్యక్రమాలు వేటిలో భాగం పంచుకున్నా వేంకటేశ్వరుని దయకు పాత్రమవుతాం. ఇది సత్యం. ఇదే సత్యం.

ఓం నమోస్తుతే ధ్వజాయ..
ఓం నమో శ్రీవేంకటేశాయ...



ధ్వజపట రూపకల్పనలో నిమగ్నమైన శ్రీ పి. శివప్రసాద్



కొప్పెరకు కాపలా, ఆదాయవ్యయాలను చూసే బాధ్యతను అప్పజెప్పారు. అప్పటినుండి మా కుటుంబీకులు ఈ కైంకర్యంలో తరిస్తున్నాం. దీనిని కొనసాగిస్తూ నేనుకూడా 2016వ సంవత్సరంలో శ్రీవారికి 75 కిలోలబరువుతో ఒక లోహగంగాళాన్ని సమర్పించాను. 04-07-2017న కూడా ఒక గంగాళాన్ని సమర్పించాను. శ్రీవారికి సేవచేసేభాగ్యాన్ని ఆ దేవదేవుడు మాకు కల్పించినందుకు పులకించిపోతుంటాము.

హుండి (కొప్పెర) గంగాళాన్ని తయారు చేయడానికి మరియు దానికొలతల వివరాలివి-

01) అడుగుభాగం మరియు చెవి, రింగులు తయారు చేయడానికి ఇత్తడిని, చుట్టుకొలతకు రాగిని ఉపయోగిస్తాం.
02) గంగాళం కొలతలు 25 లేక 27 ఇంచీలు, అడుగు భాగం చుట్టుకొలత మరియు ఎత్తుకూడా 25 లేక 27 ఇంచీలుగా ఉండేట్లుగా పెట్టడం జరుగుతుంది.
03) ఒక గంగాళానికి '91/4' మీటరు తెల్లటిగుడ్డను,
04) 40 గంగాళాలకు 6 మీటర్ల పసుపుగుడ్డను,
05) నామానికి సరిపడే అంత అంటే 40 గంగాళాలకు 1.60 మీటర్ల ఎరుపుగుడ్డను సమర్పించుకుంటాము.

ఈ విధంగా పై తెల్పిన కొప్పెర గంగాళానికి వస్త్రాలను భక్తిపూర్వకంగా కానుకగా సమర్పించుకోవడం మా ఆనవాయితీగా వస్తోంది. ఇది మా అదృష్టం. ఆ దేవదేవుడు మాపై చూపిన కృపగా మేము భావిస్తూంటాము.

మా అదృష్టం

- శ్రీ కె.సాయిసురేష్

శ్రీవారికి భక్తులు కానుకలు సమర్పించే కొప్పెర (హుండి) ను వంశపారంపర్యంగా మా పూర్వీకులనుండి మాకు రావడం అపురూపమైన అదృష్టం. మొట్టమొదటి సారిగా 25-07-1821న మా పూర్వీకులు శ్రీవారికి కొప్పెరను సమర్పించారు. ఆ తరువాత 25-07-1825న 'సిరికొలువు' పెట్టి కొప్పెర గంగాళానికి వస్త్రం చుట్టి దానిని తొమ్మిదడుగుల ఎత్తులో పెట్టడం జరిగింది. అప్పటినుండి నిరంతరాయంగా తిరుమల శ్రీవారికి కొప్పెర గంగాళం, ఆ గంగాళానికి సంబంధించినటువంటి వస్త్రం అఖిలాండకోటి బ్రహ్మాండనాయకునికి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది.

శ్రీవారికి మాకుటుంబీకులు చేస్తున్న కైంకర్యాన్ని గుర్తించి మా పూర్వీకులకు కొంత భూమి కానుకగా ఇచ్చి



బాలప్రబోధం

ఎలాంటివారితో స్నేహం చెయ్యాలి?

- శ్రీ అవసరాల లక్ష్మీపతిరావు

భీష్ముడు ఏభైఎనిమిదిరోజులు అంపశయ్యపై ఉండే పాండవులకు ధర్మబోధ చేస్తున్నాడు. శ్రీకృష్ణపరమాత్ముని సలహామేరకు యుధిష్ఠిరుడు, పాండవులు ధర్మసందేహాన్ని నివృత్తి చేసుకున్నారు. ఏభైఎనిమిదిరోజులు ధర్మసూక్ష్మాలను నివృత్తి చేసుకుని అంతా ఒక్కముక్కలో చెప్పమని ధర్మరాజు కోరినప్పుడు భీష్మపితామహుడు ఇలా చెప్పాడు.

ఇతరులు మనకు ఏమిచేస్తే నొచ్చుకుంటామో. ఆ పని మనం ఇతరులయెడ చేయరాదు. ఇది ధర్మసూక్ష్మం.

ఇలాంటివి ఎన్నో సూత్రాలు, నీతికథలను భీష్ముడు పాండవులకు బోధించాడు. ఎలాంటివారితో మైత్రి చేసుకోవాలని ధర్మరాజు ప్రశ్నించినప్పుడు దుష్టస్వభావం గల మిత్రులు ఏ విధంగా కృతఘ్నులుగా ఉంటారో గౌతముడను బ్రాహ్మణుడి ఉదంతాన్ని ఉదహరిస్తూ భీష్ముడు చెప్పిన కథ మహాభారతం శాంతిపర్వంలోనిది.

కథ విందాం రండి....


గౌతముడను బ్రాహ్మణుడు వేదాలనభ్యసించాడు. తానున్న దగ్గర బ్రతకలేక పట్నంలో బ్రతుకుదామని బయలుదేరాడు. ఆతడు ఒక వనంగుండా ప్రయాణం చేస్తూ మార్గ మధ్యంలో ఒక చెట్టుక్రింద విశ్రమించాడు.

ఆ వృక్షంమీద బ్రహ్మప్రియసఖుడు 'నాడీజంఘుడు' అను కొంగలరాజున్నాడు. సాయం సమయాన అతిథిగా వచ్చిన ఆ బ్రాహ్మణునికి నాడీజంఘుడు అతిథిసత్కారాలు చేసి అతని వివరాలు అడిగాడు. అందుకతను 'నేను గౌతముడనే బ్రాహ్మణుడను' ధనసంపాదనకోసం పట్నానికి బయలుదేరానని చెప్పాడు. నాడీజంఘుడు ఆ బ్రాహ్మణునితో, "ఇప్పుడు మనం మిత్రులమయ్యాం. నీకు ధనం లభించే మార్గం చెప్తాను. ఇక్కడికి కొద్దిదూరంలో మేరువ్రజమనే నగరముంది. అక్కడ విరూపాక్షుడనే ఒక రాక్షసరాజున్నాడు. అతడు నాకు పరమమిత్రుడు. నేను పంపినట్టు చెప్పి ధనం అడిగితే ఆతడు నీకు కావలసినంత ధనమిస్తాడు. అక్కడికి వెళ్లు నీపని సిద్ధిస్తుంది" అని చెప్పాడు.

అక్కడనుంచి గౌతముడు విరూపాక్షునివద్దకెళ్లాడు. తాను నాడీజంఘుని మిత్రుడనని చెప్పగానే అఖండమర్యాదలు చేశాడు. అతడు మోయలేనంత ధనమిచ్చాడు. ఆ ధనాన్ని తీసుకొని గౌతముడు తిరిగీ తన ఊరు వెడుతూ మధ్యలో కొత్తగా స్నేహం కుదిరిన నాడీజంఘుణ్ణి కలుసుకున్నాడు. అప్పుడు అతణ్ణి చూచి నాడీజంఘుడు బ్రాహ్మణా! ధనప్రాప్తి వంశపారంపర్యంగాను, దైవసంకల్పంవల్లనూ, సొంతప్రయత్నంవల్లనూ, మిత్రునివల్లనూ కలుగుతాయన్నాడు.

ఆ తర్వాత ఆ బ్రాహ్మణుని రక్షణకోసం ఆతనిపక్కనే నిద్రించాడు. కానీ, దుష్టబుద్ధిగల ఆ బ్రాహ్మణుడు తన ఆకలి తీర్చుకోడానికి పక్కనే మండుతున్న కట్టెతో నాడీజంఘుణ్ణి మట్టుపెట్టి ఆ మాంసాన్ని వండుకుని తినేశాడు. ఆ ధనం మూటకట్టుకుని తన ఊరికి బయలుదేరేశాడు.

నాడీజంఘునికే "రాజధర్మ" అనేపేరు కూడా ఉంది. రాజధర్మ కనపడకపోవడంతో విరూపాక్షుడు బాధపడుతూ తన



2017 అక్టోబరు నెల ముఖ్యమైన పండుగలు

07	అట్లతద్దె
18	నరకచతుర్దశి
19	దీపావళి, శ్రీకేదారగౌరీవ్రతం
23	నాగులచవితి
28	తిరుమల శ్రీవారి పుష్పయాగం

కుమారుణ్ణి పిలిచి ప్రతిరోజూ బ్రహ్మదర్శనం చేసుకున్న తర్వాత రాజధర్మ ఇంటికి వెళ్లేటప్పుడు నాకు కనబడిగాని ఇంటికి వెళ్లేవాడుకాదు. ఈ రెండురోజులూ నాకు ఆతడు కనబడలేదు. కారణం తెలుసుకురమ్మని పంపాడు.

విరూపాక్షుని కుమారుడు కొందరు రాక్షసులతో కలిసి ఆ చెట్టుదగ్గరకెళ్లి చూసేసరికి అక్కడ నాడీజంఘుని అస్థికలు పడున్నాయి. ఇది గౌతముడి పనేనని తలచి ఆతడిని వెంబడించి పట్టుకున్నారు.

వారందరు గౌతముణ్ణి, రాజధర్ముని అస్థికల్ని విరూపాక్షునివద్దకు తీసుకెళ్లారు. అది చూచి విరూపాక్షుడు కోపంతో ఈ బ్రాహ్మణుణ్ణి ముక్కలుముక్కలుగా నరికి తినేయండని ఆజ్ఞాపించాడు.

ఆతని శరీరాన్ని మేము తినమన్నారు రాక్షసులు. ఈ పాపాత్ముణ్ణి తిని ఆ పాపం మేము మూటకట్టుకోలేమన్నారు. ఐతే వీనిని దస్యులకిమ్మని రాజు ఆజ్ఞాపించాడు. వారు కూడా అతని శరీరాన్ని తాకమన్నారు.

రాజా! బ్రహ్మహత్యచేసినవారికి, సురాపానం చేసిన వారికి, చోరునికి, బ్రహ్మచర్యభంగం గావించినవాడికి ప్రాయశ్చిత్తముంది. కాని కృతఘ్నునికి మాత్రం ప్రాయశ్చిత్తం లేదు.

నరాధముడు, కృతఘ్నుడు, మిత్రద్రోహి, క్రూరుడు ఐన ఈతని శరీరాన్ని క్రూరమృగాలు, క్రిమికీటకాలూ కూడా సైతం తినవన్నారు.

రాక్షసరాజు రాజధర్మునికి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు చేశాడు. ఆ సమయంలో ఆకాశమార్గంలో కామధేనువు నోటినుండి నురుగు చితిమీదపడింది. వెంటనే నాడీజంఘుడు చితినుండి లేచి మిత్రుడు విరూపాక్షునివద్దకొచ్చాడు.

స్వర్గంనుండి దేవేంద్రుడొచ్చి, బ్రహ్మదేవుని శాపంచేత నీ మిత్రుడైన రాజధర్ముణ్ణి గౌతముడు చంపాడు. ఇందులో అతని తప్పేమీ లేదన్నాడు. ఆ మాటలకు నాడీజంఘుడు “నా మిత్రుడైన గౌతముణ్ణి కూడా బ్రతికించుమని ఇంద్రుణ్ణి ప్రార్థించగా వాణ్ణి తిరిగీ బ్రతికించాడు.

గౌతముడు తన ధనం తీసుకుని తన నివాసానికి చేరుకున్నాడు. అది చూచి దేవతలు ఈతడు అధికసంతానం పొంది నరకంలో పడుంటాడని శపించారు. కాబట్టి యుధిష్ఠిరా! కృతఘ్నునికి యశస్సుండదు. సుఖముండదు. కృతఘ్నుణ్ణి ఎప్పుడూ నమ్మకూడదు. కృతఘ్నునికి ప్రాయశ్చిత్తం కూడా ఉండదు.

మానవుడు ఎట్టి పరిస్థితుల్లోనూ మిత్రద్రోహం చేయకూడదు. మిత్రద్రోహం చేసినవాడు చిరకాలం ఘోరమైన నరకంలో పడుంటాడు. మిత్రులు కావాలనుకున్నవాళ్లు మిత్రుని విషయంలో కృతజ్ఞుడై ఉండాలి. మిత్రునివల్ల సమస్తమూ పొందవచ్చు. మిత్రునివల్ల గౌరవం లభిస్తుంది అని భీష్ముడు యుధిష్ఠిరునికి ఉపదేశించాడు.

నేటి విద్యార్థులకు ఈ కథ ఒక హెచ్చరికవంటిది. ఎవరినిబడితే వారిని స్నేహితులుగా స్వీకరించరాదు. కొత్తగా వచ్చినవారిని విశ్వసించరాదనీ తెలియజెప్తోంది.

వైకుంఠపాళి
:: 22 - సమాధానాలు ::

	1 ప	2 రా	శ	3 ర	సు	4 తు	డు	
5 అ		త్రి		థ		ష్టి		6 సు
7 యో	ధ		8 య	యా	తి		9 సు	ధ
ధ్య		10 శా		త్ర		11 ఆ		ర్మ
	12 ఊ	ర్వ	శి		13 లా	హి	రి	
14 ల		రి		15 సం		రి		16 మా
17 క్ష	మ		18 జా	య	ప		19 శూ	లి
ణ		20 ఆ		మ		21 కౌ		ని
	22 వి	న	తా	నం	ద	ను	డు	

తిరుమలకొండపై వెలసియున్న స్వామిదర్శనానికై తండో పతండాలుగా ప్రజలు తరలివస్తారు. ఎక్కడెక్కడినుంచో స్వామిని చూడాలనే బలమైనకాంక్షతో అలుపెరుగకుండా వాహనాల్లో నైతేనేమి, కాలినడకనైతేనేమి బయలుదేరి బిరబిరా వచ్చేస్తుం టారు. అంతటి మాహాత్మ్యం కల్గిందీ తిరుమలక్షేత్రం. కానీ, స్వామి దర్శనానికన్నా ముందు స్వామికి తలనీలాలు సమర్పించాలనే తలంపుతో ముందుగా ఆ మొక్కు చెల్లించుకోవడానికే ప్రాము ఖ్యమిస్తారు. దైవదర్శనం క్యూలోకన్నా తలనీలాలు సమర్పించే కల్యాణ కట్టవద్దనే అత్యధికంగా భక్తులుంటారు. అంతటి విశిష్టత కల్యాణకట్టకు ఉందిమరి. ఆ కల్యాణకట్టన్నా, అందు భక్తులు సమ ర్పించుకునే తలనీలాలన్నా స్వామివారికి ఎంతో ఇష్టం. మరెంతో ప్రీతీనూ.

పద్మపురాణమేమంటోందంటే...

తీర్థోపవాసః కర్తవ్యః శిరసోముండనం తథా ।
శిరోగతాని పాపాని యాన్తి ముండనతోయతః ॥

తీర్థక్షేత్రాల్లో విధిగా తలనీలాలమొక్కులు చెల్లించు కోవాలి. తలనీలాలు సమర్పించుకోవడంద్వారా తెలిసో తెలీకో చేసిన కర్మలన్నీ తొలగిపోతాయి. మనిషిలో స్వతహాగా ఉండే అహం తొలగిపోతుంది. సన్మార్గంలో నడిచేందుకు ఈ మొక్కులు దోహదపడతాయి. మన అహంకారాన్ని స్వామివారిదగ్గర వది లేశామనే దానికి గుర్తుగానే భక్తులు తమ తలనీలాలు సమ ర్పించుకుంటారు.

